www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 22-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 84 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 9.37, పాడ్యమి తె. 5.12 వరకు; నక్షత్రం: మూల సా. 5.54 తదుపరి పూర్వాషాఢ వర్జ్యం: సా. 4.19-5.54, తె. 3.10-4.12; దుర్ముహూర్తం: ఉ. 5.45-7.30, అమృతఘడియలు: ఉ. 11.36-1.11; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.48

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రభుత్వానికి ఎస్‌బీఐ రూ.6,959 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.6,959 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. శుక్రవారం నాడిక్కడ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు. గడచిన ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్‌బీఐ ఒక్కో షేరుకు రూ.13.70 డివిడెండ్‌ను ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.11.30గా ఉంది. కాగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) కూడా కేంద్ర ప్రభుత్వానికి రూ.857 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. బ్యాంక్ ఎండీ నిధు సక్సేనా ఈ మేరకు ఆర్థిక మంత్రికి డివిడెండ్ చెక్‌ను అందించారు.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

- సెన్సెక్స్ 269 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస రికార్డుల ర్యాలీకి తెరపడింది. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆయిల్ అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటంతో శుక్రవారం ఈక్విటీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అయితే, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడంతో పాటు ఐటీ షేర్లలో కొనుగోళ్లు నష్టాలకు కొంత అడ్డుకట్ట వేయగలిగాయి. వారాంతం ట్రేడింగ్ లాభాల్లోనే ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత గంటకే సెన్సెక్స్ నష్టాల్లోకి మళ్లింది. ఒకదశలో సూచీ 677 పాయింట్ల మేర క్షీణించి 77,000 స్థాయిని సైతం కోల్పోయింది. మళ్లీ కాస్త తేరుకుని 269.03 పాయింట్ల నష్టంతో 77,209.90 వద్ద ముగిసింది. నిఫ్టీ విషయానికొస్తే, ప్రారంభ ట్రేడింగ్‌లో 100 పాయింట్ల వరకు పెరిగి 23,667.10 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కానీ, జోరును కొనసాగించలేక డీలా పడిన సూచీ చివరికి 65.90 పాయింట్ల నష్టంతో 23,501.10 వద్ద స్థిరపడింది.సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 19 నష్టపోయాయి.

అవాన్స్ రూ.3,500 కోట్ల ఐపీఓ: విద్యా రుణాలందించే ఎన్‌బీఎఫ్‌సీ అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.2,500 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది. తద్వారా సంస్థ మొత్తం రూ.3,500 కోట్లు సమీకరించనుంది.



యులిప్స్ ప్రచారంపై జర జాగ్రత్త

పెట్టుబడి సాధనాలుగా ప్రచారం చేయొద్దు : ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ: యూనిట్ లింక్డ్ ప్లాన్స్ (యులిప్స్)పై భారతీయ బీమా అభివృద్ధి, నియంత్రణ మండలి (ఐఆర్‌డీఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. వీటిని పెట్టుబడి సాధనాలుగా ప్రచారం చేయవద్దని బీమా సంస్థలను ఆదేశించింది. దీనికి సంబంధించి ఒక మాస్టర్ సర్క్యులర్ విడుదల చేసింది. ఈ పథకాలు సాంప్రదాయ ఎండోమెంట్ పాలసీలకు భిన్నమైనవని చెప్పడంతో పాటు వీటిపై రాబడులు మార్కెట్ పనితీరుపై ఆధారపడి ఉంటాయనే విషయాన్ని బీమా సంస్థలు మదుపరులకు ముందుగానే స్పష్టం చేయాలని కోరింది.

బీమా సంస్థల ఏజెంట్లు అధిక రాబడుల పేరుతో ఈ పాలసీను మదుపరులకు అంటగడుతున్నట్టు వార్తలు రావడంతో ఐఆర్‌డీఏఐ ఈ చర్య తీసుకుంది. అలాగే పార్టిసిపెంట్ ఎండోమెంట్ పాలసీలపై ఉదహరించిన రాబడులకు కూడా హామీ లేదని బీమా సంస్థలు స్పష్టం చేయాలని కోరింది. యులిప్స్, వేరియబుల్ పే అవుట్ ఆప్షన్‌తో కూడిన యాన్యుటీ పథకాల ప్రచారంలో వాటిలో ఉండే నష్ట భయాలనూ ప్రముఖంగా పేర్కొనాలని ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది.

ఎన్‌పీఎస్ ఖాతాదారులకు కొత్త ఆప్షన్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) పథకాన్ని మరింత ఆకర్షణీయంగా చేయాలని పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వేతర ఖాతాదారుల కోసం ఈ ఏడాది సెప్టెంబరు నాటికి కొత్త లైఫ్ సైకిల్ ఆప్షన్ ఫండ్ ఆప్షన్ ప్రవేశ పెట్టాలని యోచిస్తోంది. పీఎఫ్ఆర్‌డీఏ చైర్మన్ దీపక్ మొహంతి ఈ విషయం వెల్లడించారు. ఎన్‌పీఎస్‌లో ఈ కొత్త ఆప్షన్ ద్వారా ఖాతాదారులు ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులు పెంచుకునే ఆప్షన్ కల్పించాలని పీఎఫ్ఆర్‌డీఏ భావిస్తోంది. దీనివల్ల మార్కెట్ బాగుంటే ఎన్‌పీఎస్ ఖాతాదారులకు మరిన్ని రాబడులు లభిస్తాయి. ఇందుకోసం ఖాతాదారుల టాపరింగ్ వయసుని ప్రస్తుత 35 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలకు పెంచబోతున్నట్టు తెలిపారు.

భవిష్యత్ అంతా ఫార్మా సేవల రంగానిదే

ఇందుకు ప్రత్యేక పారిశ్రామిక పార్క్ అవసరం

పార్క్ ఏర్పాటుతో మరిన్ని అవకాశాలు

తెలంగాణ ప్రభుత్వానికి ఫార్మా సర్వీసెస్ సంస్థల వినతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐటీ సర్వీసుల రంగం తరహాలోనే రానున్న రోజుల్లో ఫార్మా సేవల రంగానికి అమితమైన గిరాకీ ఏర్పడనుందని ఈ రంగంలోని కంపెనీలంటున్నాయి. శుక్రవారం నాడిక్కడ భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ చాప్టర్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఫార్మా సంస్థలకు చెందిన సీఈఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరాజెన్ లైఫ్ సైన్సెస్ సీఈఓ మణి కంటిపూడి మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ పద్ధతిలో వినూత్న ఔషధాల మాలిక్యూల్స్ కోసం పరిశోధన, అభివృద్ధితో పాటు వాటిని ఉత్పత్తి చేసే (సీఆర్‌ఓ-సీడీఎంఓ) ఫార్మా సేవల కంపెనీలకు మంచి భవిష్యత్ ఉందన్నారు. అయితే ఇందుకు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడైతే ఈ రంగం ఐటీ సేవల రంగం తరహాలోనే శరవేగంగా వృద్ధి చెంది పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలతో పాటు ఎగుమతి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇప్పటి వరకు ఈ సేవల కోసం చైనాపై ఆధారపడిన అమెరికా, యూరప్ దేశాలకు చెందిన పలు ఫార్మా కంపెనీలు.. చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగంగా ఫార్మా సేవల కోసం భారత్ వైపు చూస్తున్నాయని మణి పేర్కొన్నారు. అయితే ఈ అవకాశాలను దక్కించుకునేందుకు గాను ఫార్మా సేవల రంగానికి చెందిన కంపెనీల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కు లేదా క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఈ రంగంలోని కంపెనీలు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాయని ఆయన వివరించారు. కాగా బల్క్ డ్రగ్స్‌తో పాటు ఫార్మా సేవల కంపెనీలకూ హైదరాబాద్ కేంద్రంగా ఎదుగుతోందని ఈ సమావేశంలో పాల్గొన్న సప్తగిర్ గ్రూప్ ఎండీ శిల్పా రెడ్డి తెలిపారు. మరోవైపు ఫార్మా సేవల కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు.. ఫార్మా కంపెనీల ప్రతినిధులకు హామీనిచ్చారు.



సీఐఐ సమావేశంలో పాల్గొన్న ఫార్మా సంస్థల సీఈఓలు

రూ.35 కోట్ల బుగాటీ టూర్‌బిల్లాన్



అల్ట్రా లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బుగాటీ సరికొత్త కారును ఆవిష్కరించింది. దాని పేరు టూర్‌బిల్లాన్. ధరెంతో తెలుసా.. 38 లక్షల యూరోలు. మన కరెన్సీలో రూ.35 కోట్ల పైమాటే. ఎందుకంత రేటు అంటారా..? దాని ప్రత్యేకతలు అలాంటివి మరి. 8.3 లీటర్, వీ 16 ఇంజన్‌తో కూడిన ఈ మెగా కార్.. ఒక మెగావాట్‌కు పైగా పవర్‌ను ఉత్పత్తి చేయగలదు. అంతేకాదు, సున్నా నుంచి గంటకు 100 కి.మీ వేగాన్ని కేవలం 2 సెకన్లలో అందుకోగలదని కంపెనీ తెలిపింది. 5 సెకన్లలో 200 కి.మీ, 10 సెకన్లలో 300 కి.మీ, 25 సెకన్లలోగా 400 కి.మీ వేగాన్ని అందుకుంటుందని బుగాటీ వెల్లడించింది. గంటకు 445 కి.మీ గరిష్ఠ వేగంతో దూసుకెళ్లగలదు. కేవలం 250 టూర్‌బిల్లాన్‌లను మాత్రమే తయారు చేయనున్నట్టు బుగాటీ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,150 ▲	98,500 ▲
ముంబై	72,746 ▲	66,635 ▲	90,666 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	510
వరంగల్	517	గోదావరి	505
చిత్తూరు	573	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	130
వరంగల్	119	గుంటూరు	130
కరీంనగర్	119	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	144
కర్నూలు	119	నెల్లూరు	144
విశాఖపట్నం	136	అనంతపురం	130
గోదావరి	130		

జేకే టైర్ నుంచి సరికొత్త శ్రేణి టైర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వాణిజ్య ట్రక్కులు, బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) కోసం జేకే టైర్ సరికొత్త శ్రేణి టైర్లను తీసుకువచ్చింది. శుక్రవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో ఈ టైర్లను జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ అనూజ్ కథూరియా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రవాణా రంగ అవసరాలకు తగ్గట్టుగా ఈ కొత్త టైర్లను డిజైన్ చేసినట్లు తెలిపారు. జెట్‌వే జేయూసీ ఎక్స్‌ఎం, జెట్‌స్టీల్ జేడీసీ ఎక్స్‌డీ పేరుతో ట్రక్కులు, బస్సుల కోసం రేడియల్ టైర్లను తీసుకురాగా, ఎలక్ట్రిక్ బస్సుల కోసం జెట్‌వే జేయూఎక్స్‌ఈ పేరుతో టైర్లను తీసుకువచ్చినట్లు కథూరియా వెల్లడించారు. ఈ కొత్త టైర్లతో సంస్థ ఉత్పత్తుల పోర్టుఫోలియో మరింతగా పెరగటమే కాకుండా మార్కెట్లో స్థానాన్ని బలోపేతం చేసుకునే అవకాశం లభించనుందన్నారు. కర్ణాటక, మైసూరులో కంపెనీ రూ.600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఆర్ అండ్ డీ కేంద్రం ఈ టైర్ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని కథూరియా తెలిపారు. కాగా ఆర్ అండ్ డీపై ఏటా రూ.125 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో కంపెనీకి 380 మంది డీలర్లు ఉండగా మార్కెట్ వాటా 4 నుంచి 5 శాతం వరకు ఉందని కథూరియా తెలిపారు.

నలుగురు నై, ఇద్దరు సై

రెపో తగ్గింపుపై ఎంపీసీలో భిన్న ధోరణులు

ముంబై: దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుదల మందకొడిగా ఉండడానికి ఆహార ధరలే కారణమని, అవి పట్టూ విడుపూ లేకుండా గరిష్ఠ స్థాయిల్లో కొనసాగుతూ ఉంటున్నందు వల్ల రెపో రేటులో యథాతథ స్థితికి అనుకూలంగా తాను ఓటు వేస్తున్నానని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆర్‌బీఐ విడుదల చేసిన ఎంపీసీ తీర్మానాల వివరాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. వాస్తవానికి ఈ సారి రెపో రేటు తగ్గుదలకు బలం పెరిగింది. గతంలో ఎంపీసీ సభ్యుడు జయంత్ ఆర్ వర్మ ఒక్కరే రెపో రేటు తగ్గింపునకు అనుకూలంగా ఓటు వేసే వారు. ఈసారి అషిమా గోయెల్ కూడా ఆయనతో జత కలిశారు. ఫలితంగా రెపో రేటులో యథాతథ స్థితికి నలుగురు, తగ్గింపునకు ఇద్దరు ఓటు వేసినట్టయింది. ఫలితంగా వరుసగా ఎనిమిదో సారి కూడా రెపో రేటు 6.5 శాతం వద్ద స్థిరంగా ఉంది. యథాతథ స్థితికి ఓటు వేసిన వారిలో శశాంక భిడే ఒక్కరే ఆర్‌బీఐ వెలుపలి సభ్యుడు. కాగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ రంజన్, డిప్యూటీ గవర్నర్ మైకేల్ దేవవ్రత పాత్రా, గవర్నర్ శక్తికాంత దాస్ ఇంటర్నల్ సభ్యులు.

జెప్టో రూ.5,560 కోట్ల సమీకరణ

రూ.30,000 కోట్లు దాటిన కంపెనీ మార్కెట్ విలువ

న్యూఢిల్లీ: పలువురు ఇన్వెస్టర్ల నుంచి 66.5 కోట్ల డాలర్ల (దాదాపు రూ.5,560 కోట్లు) నిధులు సమీకరించినట్లు ముంబైకి చెందిన క్విక్ కామర్స్ స్టార్టప్ జెప్టో శుక్రవారం వెల్లడించింది. ఈ సందర్భంగా కంపెనీ మార్కెట్ విలువను 360 కోట్ల డాలర్ల (రూ.30,060 కోట్లు) స్థాయిలో లెక్కగట్టినట్లు జెప్టో తెలిపింది. ఏడాది క్రితంతో పోలిస్తే, కంపెనీ మార్కెట్ విలువ దాదాపు మూడింతలైంది. ఏడాది కన్నా తక్కువ సమయం క్రితమే సంస్థ 140 కోట్ల డాలర్ల మార్కెట్ విలువ వద్ద 23.5 కోట్ల డాలర్లు సమీకరించింది. ఈసారి ఫండింగ్ రౌండ్‌లో కొత్త ఇన్వెస్టర్లు అవెనీర్, లైట్‌స్పీడ్, అర్వతో పాటు ఇప్పటికే సంస్థలో ఇన్వెస్ట్ చేసిన గ్లేడ్ బ్రూక్, నెక్సస్, స్టెప్‌స్టోన్, గుడ్‌వాటర్, ల్యాచీ గ్రూప్ కూడా పాల్గొన్నాయని జెప్టో వెల్లడించింది. త్వరలో పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు జెప్టో సహ వ్యవస్థాపకులు వెల్లడించారు.

- హైదరాబాద్ కేంద్రంగా ఉన్న టెక్‌టోరో కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్.. 2024 సంవత్సరానికి గాను గూగుల్ నుంచి ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ యాక్సిలరేటర్ అవార్డును అందుకుంది. ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్ విస్తరణ, ఇంటిగ్రేషన్‌లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును దక్కించుకుంది. లండన్‌లో జరిగిన ఆండ్రాయిడ్ ఎంటర్‌ప్రైజ్ గ్లోబల్ పార్ట్‌నర్ సమ్మిట్‌లో టెక్‌టోరో ఎండీ శ్రీధర్ దన్నపనేని ఈ అవార్డును అందుకున్నారు.

స్పోర్ట్స్

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ x అమెరికా (ఉ.6. గం.)

భారత్ x బంగ్లాదేశ్ (రా.8. గం.)

విండీస్‌కు కావాలి భారీ విజయం

బ్రిడ్జిటౌన్ (బార్బడోస్): రికార్డు స్థాయిలో మూడో టైటిల్‌పై కన్నేసిన ఆతిథ్య వెస్టిండీస్..వరల్డ్ కప్ సూపర్-8లో కీలక సమరానికి సిద్ధమైంది. శనివారం జరిగే మ్యాచ్‌లో మరో ఆతిథ్య జట్టు అమెరికాను ఢీకొననుంది. గ్రూపు దశలో అజేయంగా నిలిచిన కరీబియన్లు..సూపర్-8 తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ చేతిలో 8 వికెట్లతో చిత్తుగా ఓడారు. ఆ మ్యాచ్‌లో ఏకంగా 51 డాట్ బాల్స్ ఆడడం వెస్టిండీస్ బ్యాటర్ల దారుణ స్ట్రయిక్ రొటేట్‌కు అద్దం పడుతుంది. ఇంగ్లండ్‌పై ఓటమి దరిమిలా సూపర్-8 గ్రూప్-2 పట్టికలో వెస్టిండీస్ చివరి స్థానంలో నిలిచింది. ఆ జట్టు నెట్ రన్‌రేట్ కూడా మైనస్ (1.343)గా ఉంది. ఈనేపథ్యంలో టైటిల్ రేసులో నిలవాలంటే అమెరికాపై ఆ జట్టు భారీ విజయం సాధించాల్సి ఉంటుంది.

కమిన్స్ హ్యాట్రిక్

బంగ్లాపై ఆసీస్ గెలుపు



కమిన్స్ (3/29)

నార్త్ సౌండ్ (ఆంటిగ్వా): ఈసారి టీ20 వరల్డ్ కప్‌లో తొలి హ్యాట్రిక్ నమోదు చేసిన బౌలర్‌గా ఆస్ట్రేలియా స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ నిలిచాడు. కమిన్స్ (3/29)కు తోడు స్పిన్నర్ ఆడమ్ జంపా (2/24) ఆకట్టుకోవడంతో శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ విధానంలో ఆసీస్ 28 పరుగుల తేడాతో నెగ్గింది. అలాగే ఈ మెగా టోర్నీలో అత్యధిక వరుస విజయాలు (8) సాధించిన జట్టుగానూ నిలిచింది. సూపర్-8 గ్రూప్-1లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బంగ్లా 20 ఓవర్లలో 8 వికెట్లకు 140 పరుగులు చేసింది. కెప్టెన్ షంటో (41), తౌహిద్ హ్రిదాయ్ (40) మాత్రమే రాణించారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ తన్‌జీద్‌ను స్టార్క్ డకౌట్ చేయగా.. రెండో వికెట్‌కు 58 పరుగులు జోడించిన షంటో-లిట్టన్ దాస్ (16) జోడీని జంపా పెవిలియన్‌కు చేర్చడంతో బంగ్లా కోలుకోలేకపోయింది. ఇక 18వ ఓవర్ చివరి రెండు బంతుల్లో మహ్మదుల్లా (2), మెహిదీ హసన్ (0)లను అవుట్ చేసిన కమిన్స్.. తన తర్వాతి ఓవర్ (20వ) తొలి బంతికి హ్రిదాయ్‌ను పెవిలియన్ చేర్చి హ్యాట్రిక్ పూర్తి చేశాడు. ఛేదనలో ఆసీస్ ఓపెనర్లు వార్నర్ (53 నాటౌట్), హెడ్ (31) చెలరేగారు. తన వరుస ఓవర్లలో స్పిన్నర్ రిషాద్.. హెడ్, మార్ష్ (1)లను అవుట్ చేసినా మ్యాక్స్‌వెల్ (14 నాటౌట్) సహకారంతో వార్నర్ జోరు కొనసాగించాడు. అయితే ఆసీస్ ఇన్నింగ్స్ 11.2 ఓవర్లలో 100/2 స్కోరు వద్ద భారీ వర్షం కురిసి మ్యాచ్ రద్దయ్యింది. అప్పటికే డక్‌వర్త్ ప్రకారం కంగారూలు 28 రన్స్ అదనంగా చేయడంతో విజయానికి ఢోకా లేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 140/8 (షంటో 41, తౌహిద్ 40; కమిన్స్ 3/29, జంపా 2/24).

ఆస్ట్రేలియా: 11.2 ఓవర్లలో 100/2 (వార్నర్ 53 నాటౌట్, హెడ్ 31; రిషాద్ 2/23).

పాయింట్ల పట్టిక — గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఆస్ట్రేలియా	1	1	0	0	2	2.471
భారత్	1	1	0	0	2	2.350
అఫ్ఘాన్	1	0	1	0	0	-2.350
బంగ్లాదేశ్	1	0	1	0	0	-2.471

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

ప్రాక్టీస్‌లో అక్షర్, కోహ్లీ, కుల్దీప్



‘టాప్’ లేపాలి

బంగ్లాదేశ్‌తో భారత్ మ్యాచ్ నేడు



నార్త్‌సౌండ్ (ఆంటీగ్వా): వరల్డ్ కప్ సూపర్-8 తొలి మ్యాచ్ ఆడిన గంటల్లోనే.. భారత్, బంగ్లాదేశ్ మరో పోరుకు సిద్ధమయ్యాయి. శనివారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో రెండు జట్లు తలపడనున్నాయి. మొదటి మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్‌పై సాధించిన విజయంతో టీమిండియా ఉత్సాహంగా ఉంది. మరోవైపు ఆస్ట్రేలియా చేతిలో పరాజయంతో బంగ్లాదేశ్ డీలా పడింది. రెండో మ్యాచ్‌లోనూ నెగ్గి సెమీస్ రేసులో మరింత ముందంజ వేయాలని రోహిత్ సేన భావిస్తోంది. కాగా..ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే బంగ్లాదేశ్ సెమీస్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. అయితే టాపార్డర్ బ్యాటర్లు స్థాయికితగ్గ ప్రదర్శన చేయాలని రెండు జట్లు ఆశిస్తున్నాయి. ముఖ్యంగాఓపెనర్లు రోహిత్, విరాట్ భారీ ఇన్నింగ్స్‌తో శుభారంభాలు ఇవ్వాల్సి ఉంది. సిక్సర్ల వీరుడు శివమ్ దూబే అంచనాలను అందుకోలేకపోతున్నాడు. బంగ్లాదేశ్‌పై కూడా అతడు బ్యాట్ ఝుళిపించకపోతే రాబోయే మ్యాచ్‌లకు సంజూ శాంసన్ పట్ల జట్టు మొగ్గుచూపే అవకాశాలు లేకపోలేదు. బౌలింగ్‌కు సంబంధించి ఈ మ్యాచ్‌కు భారత జట్టులో ఎటువంటి మార్పులూ ఉండకపోవచ్చు.

పిచ్, వాతావరణం

స్పిన్నర్లు, సీమర్లకు అనుకూలిస్తుంది. బ్యాటర్లకు పెద్దగా సహకారం లేకపోవడంతో గత మ్యాచ్‌ల్లో ఇక్కడ తక్కువ స్కోర్లు నమోదయ్యాయి. ఆరంభ ఓవర్లలో బ్యాటర్లు జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. వర్షం నుంచి ఎటువంటి అంతరాయమూ ఉండబోదు.

బంగ్లా డీలా..

మరోవైపు టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. పవర్ హిట్టర్లు లేకపోవడం ఆ జట్టు ప్రధాన లోపం. దానికితోడు ఓపెనర్ లిట్టన్ దాస్, తన్‌జీద్ రాణించకపోవడంతో బంగ్లా కష్టాలు రెండింతలయ్యాయి. ఈనేపథ్యంలో బుమ్రా పదునైన బౌలింగ్‌ను బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారన్నది వేచి చూడాలి. ముస్తాఫిజుర్ సారథ్యంలోని పేస్ దళం ఆకట్టుకుంటున్నా..లెగ్గీ రిషద్ హొస్సేన్‌కు ఇతర స్పిన్నర్ల నుంచి సహకారం లభించడంలేదు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, హార్దిక్, అక్షర్, బుమ్రా, జడేజా, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్.

బంగ్లాదేశ్: షంటో (కెప్టెన్), తన్‌జీద్, లిట్టన్ దాస్, హ్రిదాయ్, షకీబల్, మహ్మదుల్లా, మెహిదీ హసన్, రిషాద్, టస్కిన్, తన్జిద్ హసన్ సకీబ్, ముస్తాఫిజుర్.

నవంబరులో సౌతాఫ్రికాతో 4 టీ20లు

ముంబై: నవంబరులో నాలుగు మ్యాచ్‌ల టీ20ల సిరీస్ కోసం భారత జట్టు సౌతాఫ్రికా వెళ్లనుంది. నవంబరు 8న డర్బన్ స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌తో సిరీస్ మొదలవనుందని బీసీసీఐ, సీఎస్ఏ శుక్రవారం సంయుక్తంగా వెల్లడించాయి. రెండో టీ20 నవంబరు 10న ఎబెహాలో, 13న మూడోది సెంచూరియన్‌లో, 15వ తేదీన జొహాన్నెస్‌బర్గ్ వేదికగా ఆఖరి మ్యాచ్ జరగనుంది. టీమిండియాకు స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ నవంబరు 5న ముగియనుంది. ఆ వెంటనే దక్షిణాఫ్రికాకు భారత జట్టు బయలుదేరనుంది.

సెమీస్‌కు ధీరజ్

ఆర్చరీ వరల్డ్ కప్

అంటాల్యా (తుర్కియే): భారత ఆర్చర్లు బొమ్మదేవర ధీరజ్, అంకితా భక్త్ ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-3 పోటీల్లో పతకం సాధించే దిశగా దూసుకెళుతున్నారు. ఈ ఇద్దరూ రికర్వ్ ఈవెంట్ వ్యక్తిగత విభాగాల్లో సెమీఫైనల్స్ చేరారు. పురుషుల వ్యక్తిగత విభాగం క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ధీరజ్ 7-3తో జొనాథన్ వెటర్ (జర్మనీ)ని ఓడించాడు. మహిళల కేటగిరిలో అంకిత 6-4తో జియోన్ హన్‌యంగ్ (కొరియా)పై గెలిచింది. ఫైనల్ బెర్త్ కోసం ఒలింపిక్, వరల్డ్ చాంపియన్ కిమ్ వూజిన్ (కొరియా)తో ధీరజ్.. యాంగ్ గ్జియోలి (చైనా)తో అంకిత తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ విభాగం సెమీఫైనల్లో ధీరజ్-భజన్ కౌర్ జోడీ 3-5తో కొరియా జంట చేతిలో ఓటమిపాలైంది. కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ-ప్రియాన్ష్ ద్వయం క్వార్టర్స్‌లో ఇటలీ చేతిలో ఓడింది.

సఫారీల జోరు

ఉత్కంఠ పోరులో ఇంగ్లండ్ ఓటమి



డికాక్ (65)

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): టీ20 వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా అజేయ ఆటతీరుతో చెలరేగుతోంది. తక్కువ స్కోరుకే పరిమితమైనా.. బౌలర్ల రాణింపుతో డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్‌ను అద్భుతంగా కట్టడి చేసింది. ఇక, ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్ (53) చివరి వరకు పోరాడినా ఫలితం లేకపోయింది. దీంతో శుక్రవారం గ్రూప్-2లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఏడు పరుగుల తేడాతో నెగ్గిన సఫారీలు తమ సెమీస్ అవకాశాలను మరింత మెరుగుపర్చుకున్నారు. టోర్నీలో వీరికిది డబుల్ హ్యాట్రిక్ విజయం. ముందుగా సౌతాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 163 పరుగులు చేసింది. ఓపెనర్ డికాక్ (65) మెరుపు ఆటతీరుతో పవర్‌ప్లేలోనే ఈ జట్టు 63 పరుగులతో పటిష్ఠంగా కనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు రషీద్, మొయిన్ అలీ పరుగులను కట్టడి చేశారు. 22 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసిన డికాక్ తొలి వికెట్‌కు హెన్‌డ్రిక్స్ (19)తో కలిసి 86 పరుగులు అందించాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (43) భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు. ఛేదనలో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 156 పరుగులకే పరిమితమైంది. లివింగ్‌స్టోన్ (33) రాణించాడు. రబాడ, కేశవ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఓ మాదిరి ఛేదనలో బట్లర్ సేన 61 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ స్థితిలో మిడిలార్డర్‌లో బ్రూక్ అర్ధసెంచరీతో అండగా నిలిచాడు. అతడికి లివింగ్‌స్టోన్ జత కలవడంతో జట్టు గెలుపువైపు సాగినట్టనిపించింది. కానీ 18వ ఓవర్‌లో లివింగ్‌స్టోన్ అవటవడంతో ఉత్కంఠ పెరిగింది. ఇక చివరి ఓవర్‌లో 14 రన్స్ కావాల్సిన వేళ తొలి బంతికే బ్రూక్ క్యాచ్‌ను మార్‌క్రమ్ పట్టేయడంతో సఫారీల సంబరాలు మిన్నంటాయి. డికాక్‌కు ‘మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్’ లభించింది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
సౌతాఫ్రికా	2	2	0	0	4	0.625
ఇంగ్లండ్	2	1	1	0	2	0.412
అమెరికా	1	0	1	0	0	-0.900
వెస్టిండీస్	1	0	1	0	0	-1.343

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 163/6 (డికాక్ 65, మిల్లర్ 43; ఆర్చర్ 3/40).

ఇంగ్లండ్: 20 ఓవర్లలో 156/6 (బ్రూక్ 53, లివింగ్‌స్టోన్ 33; కేశవ్ 2/25, రబాడ 2/32).

నాకౌట్‌కు స్పెయిన్

ఇటలీకి షాక్ — యూరో కప్



గెల్సెన్‌కిర్చెన్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో స్పెయిన్ నాకౌట్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-బిలో భాగంగా గురువారం అర్ధరాత్రి జరిగిన పోరులో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీకి షాకిచ్చింది. దీంతో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నెగ్గిన స్పెయిన్.. 6 పాయింట్లతో రౌండ్-16 బెర్త్ ఖాయం చేసుకుంది. మ్యాచ్‌లో ఇటలీ డిఫెండర్ రికార్డో కలాఫియోరి 55వ నిమిషంలో సెల్ఫ్ గోల్‌తో ప్రత్యర్థిని ఆధిక్యంలో నిలిపాడు. ఈ గోల్‌తోనే స్పెయిన్ గెలుపొందడం విశేషం. గ్రూప్-ఈలో ఉక్రెయిన్ 2-1తో స్లోవేకియాను చిత్తుచేసి టోర్నీలో బోణీ కొట్టింది. గ్రూప్ ‘డి’ మ్యాచ్‌లో ఆస్ట్రియా 3-1తో పోలెండ్‌ను ఓడించింది.

కోచ్ పదవిపై గంభీర్ దాటవేత

కోల్‌కతా: టీమిండియా తదుపరి హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారా..అన్న ప్రశ్నకు గంభీర్ సమాధానం దాట వేశాడు. తాను ఇంకా అంతదూరం ఆలోచించలేదని తెలివిగా బదులిచ్చాడు. భారత జట్టు ప్రధాన కోచ్ పదవికి సంబంధించి బీసీసీఐ క్రికెట్ సలహా కమిటీ ఎదుట గతవారం వర్చువల్ ఇంటర్వ్యూకి గంభీర్ హాజరైన విషయం తెలిసిందే. ‘కోచ్ పదవికి సంబంధించిన ప్రశ్నకు ఇప్పుడు సమాధానం ఇవ్వడం కష్టం. అయితే వ్యక్తులకన్నా జట్టును ముందంజలో ఉంచడం నా కోచింగ్ ఫిలాసఫీ’ అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 22-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 84 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

నీట్ నిర్వహణలో అడుగడుగునా లోపాలు

186 పరీక్ష కేంద్రాల్లో కరువైన సీసీ టీవీ పర్యవేక్షణ

16% కేంద్రాల్లో ప్రశ్నపత్రాలుంచే గదులకు భద్రతలేమి

మళ్లీ పరీక్ష కోసం సుప్రీంలో తెలంగాణ అభ్యర్థి పిటిషన్

వెంటనే నిర్ణయం తీసుకోవాలంటూ ఎన్‌టీఏకి ఆదేశం

1563 మంది అభ్యర్థులకు రేపు 7 కేంద్రాల్లో నీట్ పరీక్ష

హైదరాబాద్‌లో విద్యార్థి యువజన సంఘాల ఆందోళన

జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్ష వాయిదా

9



కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడికి వెళ్తున్న యూత్ కాంగ్రెస్

రుణమాఫీకి రాజముద్ర

ఒకే విడతలో రూ.2 లక్షల మాఫీకి మంత్రివర్గ ఆమోదం



క్యాబినెట్ భేటీ అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, దామోదర, భట్టి, తుమ్మల, ఉత్తమ్

డిసెంబరు 9కి ఐదేళ్ల ముందున్న రుణాలన్నీ మాఫీ

నియమ నిబంధనలకు ఆమోదం.. త్వరలో జీవో

ప్రభుత్వంపై పడే భారం రూ.31 వేల కోట్లు

'రైతు భరోసా' విధివిధానాలకు మంత్రివర్గ ఉపసంఘం

భట్టి, తుమ్మల, శ్రీధర్‌బాబు, పొంగులేటి సభ్యులు

వచ్చే 15 కల్లా నివేదిక, అసెంబ్లీలో అభిప్రాయ సేకరణ

అర్హులైన, నిస్సహాయులైన ప్రతి ఒక్కరికీ వర్తింపు

అధికార ప్రతినిధులుగా శ్రీధర్‌బాబు, పొంగులేటి

ప్రభుత్వ సమాచారం వీళ్లిద్దరే ఇస్తారు: సీఎం రేవంత్

కేసీఆర్ పదేళ్ల రుణ మాఫీ రూ.28 వేల కోట్లేనని వెల్లడి

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. రూ.2 లక్షల లోపు పంట రుణాలన్నింటినీ ఒకే దఫా మాఫీ చేసి, రైతులకు విముక్తి కలిగిస్తామని ప్రకటించింది. ఈ రుణాల మాఫీకి 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు 'కట్-ఆఫ్-డేట్'గా నిర్ణయించింది. ఈ మధ్యకాలంలో తీసుకున్న రుణాలకే మాఫీ వర్తిస్తుంది. రుణ మాఫీ పథకానికి మొత్తం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని క్యాబినెట్ ప్రాథమికంగా అంచనా వేసింది. రైతుబంధు స్థానంలో తీసుకొస్తున్న రైతు భరోసా పథకం అమలు కోసం విధి విధానాలను రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం శ్రీమంతులకు, ఫామ్‌హౌజ్ ఓనర్లకు, జూబ్లీహిల్స్‌లో నివసించే వారికి కూడా అమలైందన్న విమర్శలున్న నేపథ్యంలో దీనిని సామాన్యులకు, నిస్సహాయులకు, అర్హులైనవారికి అందించాలని నిర్ణయించింది. విధివిధానాల రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో

మిగతా 11వ పేజీలో...

జూలై నుంచే రుణమాఫీ!

ముందే వెల్లడించిన 'ఆంధ్రజ్యోతి'

11

మహిళాశక్తి క్యాంటిన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలి

దేశానికి ఆదర్శం కావాలి.. పల్లె రుచులను పట్టణాలకు పరిచయం చేయాలి: మంత్రి సీతక్క

రాష్ట్రంలో తొలిసారిగా సచివాలయంలో ప్రారంభం



శుక్రవారం సచివాలయంలో మహిళ శక్తి క్యాంటిన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క.. చిత్రంలో సీఎస్ శాంతికుమారి



మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి మాజీ స్పీకర్ పోచారం

ఇంటికి వెళ్లి కండువా కప్పిన సీఎం రేవంత్

ఆయనకు సముచిత గౌరవం ఇస్తామని ముఖ్యమంత్రి వెల్లడి

రైతుల సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లో చేరా: పోచారం శ్రీనివాసరెడ్డి

అసెంబ్లీలో 70కి పెరిగిన కాంగ్రెస్ బలం.. అదేబాటలో మరికొందరు?

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్.. 34కు తగ్గిన ఆ పార్టీ బలం

పోచారం ఇంట్లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ శ్రేణుల యత్నం

బాల్క సుమన్ సహా 12 మందిపై కేసులు.. అరెస్టు

హైదరాబాద్, జూన్ 21(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కించుకోలేకపోయిన బీఆర్ఎస్‌కు.. శుక్రవారం ఊహించని షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పోచారంతోపాటు ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. బీఆర్ఎస్ నుంచి 15 మందికి పైగా ఎమ్మెల్యేలు త్వరలోనే

మిగతా 10వ పేజీలో...

కష్టకాలంలో పోచారం పార్టీ మారడం సరికాదు

ఆయన చెప్పిన కారణాలు వింటే సిగ్గేస్తోంది: బీఆర్ఎస్ నేతలు 10

సింగరేణికి అన్యాయం చేయను!

తెలంగాణ బిడ్డగా నాకూ బాధ్యత ఉంది

గనులపై ప్రధానికి నివేదిస్తా: కిషన్‌రెడ్డి

తెలంగాణలోని గనుల మీద సింగరేణికి గుత్తాధిపత్యాన్ని పునరుద్ధరించండి

బ్లాకులన్నీ కేటాయిస్తేనే సింగరేణి మనుగడ

కేంద్రాన్ని కోరిన ఉప ముఖ్యమంత్రి భట్టి

దేశవ్యాప్త బొగ్గు గనుల వేలం ప్రారంభం

సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా?

సంస్థ ప్రైవేటీకరణపై దుష్ప్రచారం: బండి



శుక్రవారం హైదరాబాద్‌లో బొగ్గుగనుల వేలం సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బిడ్డగా సింగరేణికి అన్యాయం చేయబోనని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి భవిష్యత్తు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికే కాకుండా 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వానికి కూడా బాధ్యత ఉంటుందని సింగరేణిపై తెలంగాణ ప్రభుత్వానికే కాకుండా కేంద్రానికి కూడా బాధ్యత ఉంటుందని గుర్తు చేశారు. గనులను ఆదాయం కోసం వేలం వేయడం లేదని, సుప్రీంకోర్టు తీర్పు ఆదేశాల నేపథ్యంలో పారదర్శక విధానాలను పాటించే క్రమంలో వేలం వేస్తున్నామని చెప్పారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో పదో విడత దేశవ్యాప్త బొగ్గుగనుల వేలాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాల వల్ల ఇతర కేంద్ర ప్రభుత్వరంగ

మిగతా 10వ పేజీలో...



9

కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే

తాత్కాలికంగా నిలిపివేసిన ఢిల్లీ హైకోర్టు.. సాక్ష్యాధారాలు పట్టించుకోలేదు

వాదనలకు విచారణ కోర్టు తగిన సమయం ఇవ్వలేదు: ఈడీ

ఐదు గంటల్లో మూడున్నర గంటలకుపైగా ఈడీ లాయరే వాదించారు

అనుకూల తీర్పు ఇవ్వకపోతే జడ్జినే నిందించటం దారుణం

ఈడీ బావిలో పడ్డ కప్పలా తయారైంది.. కేజ్రీవాల్ తరపు లాయర్ల వాదనలు

2-3 రోజుల్లో నిర్ణయం వెలువరిస్తానన్న న్యాయమూర్తి

వామ్మో వైరల్ న్యూమోనియా

ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లతో ఐసీయూలకు!

పెరుగుతున్న కేసుల సంఖ్య.. అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైరల్ జ్వరాల సంఖ్య పెరుగుతోంది. మరీ ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో ఈ కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. గడిచిన రెండు నెలల్లోనే హైదరాబాద్‌లో వైరల్ ఫీవర్ బారిన పడి ఆస్పత్రులకు వచ్చినవారి సంఖ్య 1200కు పైగానే ఉన్నట్టు సమాచారం! వైరల్ ఫీవర్ వస్తే నాలుగైదు రోజుల్లో అదే తగ్గిపోతుందని.. జ్వరానికి పారాసెటమాల్ తప్ప మరే మందులూ అక్కర్లేదని గతంలో వైద్యులు చెప్పేవారు. కానీ.. ఇప్పుడు పరిస్థితి అలా లేదని వైరల్ ఫీవర్లు పదిరోజుల దాకా కూడా ఉంటున్నాయని.. కొందరిలో ఊపిరితిత్తులు ఇన్ఫెక్షన్‌కు గురై న్యూమోనియా బారిన పడుతున్నారని.. వారిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోతుండడంతో ఐసీయూలో చేర్చి చికిత్స చేయాల్సివస్తోందని వైద్యనిపుణులు వెల్లడిస్తున్నారు. వారిలోనూ కొందరికి ఇతర అవయవాల పనితీరు మందగించి.. వెంటిలేటర్, ఎక్మో చికిత్స కూడా చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వైరల్ న్యూమోనియాతో ఆస్పత్రిలో

మిగతా 12వ పేజీలో...

అనుమతుల్లేకుండానే ఆస్పత్రులు!

హైదరాబాద్‌లో సగానికిపైగా ఇలాంటివే..

చాలా నర్సింగ్ హోమ్‌ల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థ లేదు

తాత్కాలిక అనుమతులతోనే నెట్టుకొస్తున్న వైనం

నిపుణులైన వైద్యులు, సిబ్బంది లేకున్నా చికిత్సలు

వైద్య అధికారుల తనిఖీల్లో విస్తుపోయే అంశాలు

12



ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్న ఏకగ్రీవం

సభలో నేడు అధికారిక ప్రకటన..

కొలువుదీరిన శాసనసభ

172 మంది ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

ప్రతిజ్ఞ నెరవేర్చుకున్న టీడీపీ అధినేత

ముఖ్యమంత్రి హోదాలోనే అసెంబ్లీలోకి

మొదటిసారి అసెంబ్లీలోకి పవన్ కల్యాణ్

తొలిసారి ఎన్నికైన లోకేశ్‌కు ఘనస్వాగతం

సభకు అలా వచ్చి ఇలా వెళ్లిపోయిన జగన్

పోలీసుల అదుపులో భారతీరెడ్డి పీఏ!

షర్మిల, సునీత, బాబు, పవన్.. కుటుంబీకులపై సోషల్ మీడియాలో వర్రా రవీంద్రారెడ్డి పోస్టులు

రెండేళ్లుగా నీచభాషలో దుష్ప్రచారం!

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి ఎన్నిక కోసం శుక్రవారం ఉదయం నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిపై టీడీపీ కూటమి పార్టీల నేతలు అయ్యన్న పాత్రుడు తరఫున శుక్రవారం మధ్యాహ్నం ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో టీడీపీ తరఫున లోకేశ్, అచ్చెన్నాయుడు, జనసేన తరఫున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ తరఫు మంత్రి సత్యకుమార్ యాదవ్

మిగతా 7వ పేజీలో...

ఏసీబీ వలకు చిక్కారు!

భూ వివాదంలో లక్ష తీసుకుంటుండగా సూరారం సీఐ..

రైతు నుంచి 70వేలు వసూలు చేస్తుండగా న్యాల్‌కల్ ఆర్ఐ..

12

ఆటోమేటిగ్గా గ్రీన్‌కార్డు!!

అమెరికా కాలేజీల్లో చదివే విదేశీ విద్యార్థులందరికీ లక్కీ చాన్స్!

గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే మంజూరు

మాజీ అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదన

9

52కు కల్తీసారా మృతులు

తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల బాధ్యత ప్రభుత్వానిదే: స్టాలిన్

మరణాలకు బాధ్యులెవరో చెప్పండి

ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

9



యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సరిహద్దులో సైనికుల యోగాసనాలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సారా విషాదం

తమిళనాడు కల్తీసారా ఘటనలో మృతుల సంఖ్య యాభైకి చేరింది. వందమందికి పైగా ఆస్పత్రిలో ఉన్నారు. కల్లకురిచ్చి జిల్లా కరుమాపుల గ్రామంలో జరిగిన ఈ దారుణంలో, మరో ముప్పైమంది పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉందని అంటున్నారు. కుటుంబీకుల, బంధుమిత్రుల రోదనలు, మృతుల సామూహిక దహన సంస్కారాల దృశ్యాలు మనసు కలచివేస్తున్నాయి. జరిగిన ఘోరం మీద విపక్షాలు అధికార పక్షాన్ని తీవ్రంగా విమర్శించడం సహజం. ముఖ్యమంత్రి స్టాలిన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాసన సభలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులను స్పీకర్ బహిష్కరించడం, అన్నాడీఎంకె, బీజేపీ వంటి పార్టీలు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునివ్వడం వంటి రాజకీయ ప్రతిస్పందనలను చూస్తున్నాం. ఈ ఉదంతంపై సీబీఐ విచారణ జరిపించాలని రాష్ట్ర బీజేపీ అమిత్ షాను కోరుతున్నది. రాష్ట్రంలో కల్తీసారా ప్రవాహానికి డీఎంకే నాయకులు, కార్యకర్తలు కారకులని, వారి ఆశీస్సులతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారనీ, సీబీఐ దర్యాప్తుతోనే సమగ్రప్రక్షాళన సాధ్యపడుతుందని బీజేపీ వాదన. సీబీసీఐడీకి ఈ కేసును అప్పగించిన స్టాలిన్ ప్రభుత్వం, జస్టిస్ గోకుల్‌దాస్ నేతృత్వంలో ఒక విచారణ కమిషన్ కూడా నియమించి, ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరుగుతుందని హామీ ఇస్తున్నది.

పారిశ్రామిక విష రసాయనం మిథనాల్ కలిపిన ఈ సారాన్ని నిరుపేదలకు పోసిన కొందరు ఇప్పటికే అరెస్టయ్యారు. కల్తీసారా తయారీ ప్రధానకారకుడిని పదిరోజులక్రితమే పోలీసులు మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నందుకు అరెస్టు చేసి, ఆ తరువాత విడిచిపెట్టారని వార్తలు వచ్చాయి. ఇటువంటి దారుణాలు జరిగినప్పుడు ఊహించని అంశాలు చాలా వెలుగులోకి వస్తుంటాయి. కల్తీమద్యాన్ని తయారుచేసే, విక్రయించే వ్యక్తులు ఏళ్ళ తరబడి ఆ పనిచేయగలుగుతూంటే, వారికి అండగా నాయకులు, పోలీసులు నిలిచే వ్యవస్థ మనది. గత ఏడాది విల్లుపురం, చంగల్పట్టు జిల్లాల్లో ఇదే తరహా దారుణాలు జరిగి పాతిక మందికి పైగా మరణించిన ఘటన ప్రభుత్వాన్ని కానీ, అధికారులను కానీ కదల్చలేకపోయిందని అర్థం. ఇంకా చెప్పాలంటే ఆ ముందు మూడు సంవత్సరాల్లోనూ ఇటువంటి ఘటనలు జరిగాయి, పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయి కూడా. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడెక్కడ కల్తీసారా అమ్మకాలు జరుగుతున్నాయో తాను మార్చిలోనే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని తెలియచేసి హెచ్చరించానని అన్నాడీఎంకె అంటోంది. కల్లకురిచ్చి, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో కల్తీసారా అమ్మకాలపై పత్రికల్లో వరుస కథనాలు వచ్చిన విషయాన్ని కూడా చాలామంది గుర్తుచేస్తున్నారు. పాలకులు, అధికారులు కలసికట్టుగా ప్రదర్శించిన నిర్లక్ష్యం ఇప్పుడు యాభైమంది ప్రాణాలకు ముప్పు తెచ్చింది.

కలక్టర్‌ను బదిలీచేయడం, ఎస్పీని సస్పెండ్ చేయడం, కొందరు అధికారులను తప్పించడం వంటి చర్యలు తాత్కాలిక ఉపశమనాలే. ఏటా ఇటువంటి దారుణాలు జరుగుతున్నప్పుడు కూడా నిర్దిష్టమైన చర్యలు, నియంత్రణలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పేదల ప్రాణాలంటే అందరికీ చులకనే. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదికల్లో కల్తీసారా మరణాల్లో తమిళనాడుకు స్థానం ఉంటుంది. కల్తీమద్యాన్ని తాగి పెద్ద సంఖ్యలో పేదలు ప్రాణాలు పోగొట్టుకుంటున్న ఘటనలు ఇప్పటికీ చాలా రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. యూపీ, బిహార్‌లతో పాటు, గుజరాత్, పంజాబ్ లాంటి ఆర్థిక బలం ఉన్న రాష్ట్రాల్లోనూ ఈ ఘటనలకు తక్కువేమీ లేదు. మిథనాల్ తయారీ మీద చాలా ఆంక్షలు, నియంత్రణలు ఉన్నప్పటికీ, పరిశ్రమల నుంచి అది కల్తీసారా తయారీదారులకు అందుతున్నదంటే పోలీసుల, అధికారుల నిర్లక్ష్యం, ధనదాహం అందుకు కారణాలు.

ప్రభుత్వం విక్రయించే మద్యాన్ని కొనుగోలు చేసే ఆర్థికస్తోమతలేని వారు, ప్రధానంగా దినసరి కూలీలు అతితక్కువ ఖరీదుకు దొరికే ఈ కల్తీసారా తాగి తమ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. కల్తీ మద్యాన్ని నియంత్రించడంతో పాటు ప్రభుత్వం తాను విక్రయించే మద్యం ధరల విషయంమీద కూడా దృష్టిపెట్టాలి. కల్లకురిచ్చి ఘటనలో కన్నుమూసినవారంతా దళితులు, సామాజికంగానూ, ఆర్థికంగానూ వెనుకబడినవారు. జరిగిన ఘటననుంచి పాఠాలు నేర్చుకోవడం, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడటం ప్రభుత్వం విధి.

ఇది ప్రతిపక్షాల లోక్‌సభ!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు 16వ, 17వ లోక్‌సభల్లో లేనట్టి ఒక బలవత్తరమైన పార్లమెంటరీ ప్రతిపక్షాన్ని ప్రభవింపచేశాయి. గత రెండు సార్వత్రిక ఎన్నికల (2014, 2019)ల్లో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నది. అయితే ఆ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరుసగా కేవలం 44, 52 సీట్లు మాత్రమే లభించాయి. తత్కారణంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాను పొందలేకపోయింది. ఇతర బీజేపీ యేతర పక్షాలకు కాంగ్రెస్ కంటే ఇంకా తక్కువ సీట్లు మాత్రమే లభించాయి. తత్ఫలితంగా బీజేపీ, ఎన్నికలకు పూర్వమే ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు, అప్రకటిత మిత్ర పక్షాల (వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్) సంఖ్యా బలం, సభలో అయినదానికీ కానిదానికీ అవి చేసిన ఎడతెగని రభసలో ప్రతిపక్షం వాణి విన్పించకుండా పోయింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే విపక్షం గొంతును పూర్తిగా నొక్కి వేశారు.

పాలక, ప్రతిపక్షాల సంఖ్యా బలాల్లో తీవ్ర తేడా ఉన్న దృష్ట్యా, మహోన్నత పార్లమెంటరీ సంప్రదాయాలను సభలో ఎలా నిలబెట్టుకోవాలనే విషయమై విధ్యుక్త ధర్మ స్ఫూర్తితో ఆలోచించలేదు. కనీస మాత్రంగానైనా ఆ సంఖ్యా బలాల అసమతౌల్యతను పరిగణనలోకి తీసుకోలేదు. ఇక చెప్పేదేముంది? సభా కార్యకలాపాలు సరిగా సాగలేదు. చర్చలు జరగకుండానే బిల్లులు ఆమోదం పొందడం సాధారణమైపోయింది. ఈ శోచనీయ వాస్తవం సభలోని ప్రతిపక్షాలకే కాదు, సభ వెలుపలి చైతన్యశీల పౌరులకూ అర్థమయ్యేందుకు ఎంతో కాలం పట్టలేదు పార్లమెంటు ఉభయ సభలూ సమున్నత రీతిలో పనిచేయడం లేదని నిష్పాక్షిక పరిశీలకులు ఎందరో వాపోయారు.

భారత పార్లమెంటు ఘనమైన సంప్రదాయాలను పునరుద్ధరించేందుకు 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అటు పాలకపక్షం, ఇటు ప్రతిపక్షం రెండిటికీ ఒక మహదవకాశాన్ని కల్పించాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపాన్ని మాత్రమే కాదు, దాని సారాన్ని సైతం సముదాత్తం చేసేందుకు మన ప్రజా ప్రతినిధులకు ఒక గొప్ప అవకాశం లభించింది. 236 మంది సభ్యులతో ప్రతిపక్షం సుదృఢంగా ఉన్నది. దేశ ప్రజల తరఫున ప్రభుత్వ వ్యవహారాలను నిశితంగా విమర్శించేందుకు, సరిదిద్దేందుకు ప్రతిపక్షానికి ఇదొక చక్కని అవకాశం.


సభా కార్యకలాపాలను ప్రతిపక్షాలు అడ్డుకోవడమనేది న్యాయబద్ధమైన పార్లమెంటరీ మార్గమని, అది 'ప్రజాస్వామ్యానికి పూర్తిగా అనుకూలమైనది' అని కీర్తిశేషుడు అరుణ్ జైట్లీ వాదించేవారు. ఆయన పదే పదే చేసిన వాదన ఒక కట్టుకథ. ఆ వాదనకు విరుద్ధమైనదే సత్యం, అదే ప్రజాస్వామ్య సమున్నతికి దోహదం చేసేది.

సరే, కొత్త లోక్‌సభలో ప్రతిపక్షం ఏమి చేయాలి? కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 'న్యాయ్ పత్ర'తో ఉపక్రమించాలి. అందులో ఈ క్రింది హామీలు ఉన్నాయి: 'పార్లమెంటు ఉభయ సభలూ ఒక సంవత్సరంలో 100 రోజుల పాటు సమావేశమయ్యేలా చూస్తాం. గతంలో పరిఢవిల్లిన సమున్నత పార్లమెంటరీ సంప్రదాయాలను ఉభయ సభల్లో పునరుద్ధరించి నిష్ఠాబద్ధంగా పాటించేందుకు నిబద్ధమవుతాము'; 'ఒక వారంలో ఒక రోజును లోక్‌సభలోను, రాజ్యసభలోను ప్రతిపక్షాలు సూచించిన ఎజెండాపై చర్చించేందుకు పూర్తిగా వినియోగించేందుకు వాగ్దానం చేస్తున్నాం'; 'ఉభయ సభల సభాపతులు ఏ రాజకీయ పార్టీలతోను సంబంధాలు నిలుపుకోకుండా, తటస్థంగా ఉండేలా చేసి, 'సభాపతి సంభాషించడు' (స్పీకర్ డజ్ నాట్ స్పీక్) అనే ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ఎల్లెడలా ఆమోదయోగ్యమైన ప్రమాణాన్ని పాటించేందుకు హామీ పడుతున్నాం'. ఈ వాగ్దానాలను నెరవేర్చేందుకు ఇండియా కూటమి దృఢ సంకల్పంతో నిబద్ధమవుతుంది.

పార్లమెంటు ఉభయ సభలూ ఏడాదికి 100 రోజుల చొప్పున సమావేశమవడం, వారంలో ఒక రోజు సభా కార్యకలాపాలను ప్రతిపక్షాల ఎజెండాపై చర్చకు పరిమితం చేయడం, తటస్థ సభాపతులు తదితర అంశాలపై బీజేపీకి ఎటువంటి ఆక్షేపణలు ఉండడానికి వీలులేదు.

నరేంద్ర మోదీ, ఆయన కారణంగా భారతీయ జనతా పార్టీ ఎన్నికల ఫలితాలు కలిగించిన దిగ్భ్రాంతి నుంచి తేరుకున్నట్టు కనిపిస్తున్నారు. బీజేపీకి 370, ఎన్డీఏకు 400కు పైగా సీట్లు తప్పక వస్తాయన్న పాలకపక్ష శ్రేణుల ఆశలు ఘోరంగా వమ్ము అయ్యాయి. బీజేపీకి 240 సీట్లు మాత్రమే దక్కగా ఎన్డీఏకు లభించిన సీట్లు 400కు లోపు మాత్రమే ఉన్నాయి. అయినప్పటికీ బీజేపీ అగ్రనాయకులు విజయోత్సవాలు జరుపుకునేందుకు ప్రయత్నించారు గానీ పార్టీ కార్యకర్తలు వారి ఆనందోత్సాహాలలో పాలు పంచుకోలేకపోయారు. 'మైనారిటీ సర్కార్' అనే (వెటకారపు) ముద్ర బీజేపీ నాయకత్వాన్ని వెంటాడుతూనే ఉంటుంది. దానిని తొలగించుకునేందుకు వారు శతథా ప్రయత్నిస్తారనడంలో సందేహం లేదు. ఈ ప్రయత్నాలలో భాగంగా వైఎస్ఆర్‌సీపీ (నలుగురు సభ్యులు), ఆప్ (3), ఆర్‌ఎల్‌డీ (2), జేడీఎస్ (2), ఎజిపి (1), ఎజెఎస్‌యు (1), హెచ్‌ఎఎమ్ (1), ఎస్‌కేఎమ్ (1)లను బీజేపీ ప్రలోభపెట్టే అవకాశమున్నది. 12 మంది సభ్యులు గల జనతాదళ్ (యునైటెడ్) పార్టీ కూడా అందుకు మినహాయింపు కాబోదు. ఈ పార్టీలలో కొన్ని ఇప్పటికే ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్నాయి. అయినప్పటికీ వాటి సభ్యులను తన పక్షంలో మిళితం చేసుకునేందుకు బీజేపీ వెనుకాడబోదు (శివసేనకు ఏమయిందో ఒకసారి జ్ఞాపకం చేసుకోండి).

రాజ్యాంగం 10వ షెడ్యూలులో అనేక లొసుగులు ఉన్నాయి. వాటి ఆలంబనతో చిన్న పార్టీల ఎంపీలు సురక్షితంగా పార్టీ ఫిరాయింపునకు పాల్పడవచ్చు. తన సంఖ్యా బలాన్ని పెంచుకునేందుకు ఆ లొసుగులను బీజేపీ ఉపయోగించుకోకుండా ఉంటుందా? పాలక పక్షం కుటిల ప్రయత్నాలను ప్రతిఘటించేందుకు కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 ఒక ప్రతిపాదన చేసింది: 'రాజ్యాంగం పదవ షెడ్యూలును సవరించి ఫిరాయింపుల (ఏ పార్టీ తరఫున లోక్‌సభ లేదా శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యే, ఎంపీ)కు పాల్పడినవారు ఆటోమెటిక్‌గా శాసనసభ లేదా లోక్‌సభ సభ్యత్వానికి అనర్హులు అయ్యేలా చూస్తాము'.



ప్రతిపక్షాలు తామే ప్రభుత్వమన్న రీతిలో ప్రవర్తించాలి. పద్దెనిమిదవ లోక్‌సభలో తమకు లభించిన అవకాశాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకుని ప్రభుత్వానికి పాలన సాగవలసిన తీరుతెన్నులను నిర్దేశించాలి. మెజారిటీ కొరవడిన బీజేపీ ప్రభుత్వం, కొత్త శక్తిమంతమైన ప్రతిపక్షానికి ఎలా ప్రతిస్పందించనున్నదో గమనించడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

చెప్పవచ్చినదేమిటంటే రాజ్యాంగం పదవ షెడ్యూలుకు ప్రతిపక్షం ఒక సవరణను ప్రతిపాదించి తీరాలి. పాలక పక్షం ఆ సవరణ బిల్లును వ్యతిరేకించిన పక్షంలో ప్రజలు అధికార పార్టీని తప్పకుండా గర్హిస్తారు. ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించేందుకు పాలకులు పూనుకుంటున్నారన్న వాస్తవం వారికి విశదమవుతుంది. సరే, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో బీజేపీ పాలన చాలా దుర్బలంగా ఉందన్న విషయాన్ని మరి చెప్పనవసరం లేదు. మౌలిక సదుపాయాలను ఇతోధికంగా అభివృద్ధిపరచడంపై ఎవరికీ ఎటువంటి అభ్యంతరముండబోదు. అయితే కొత్త ఉద్యోగాల సృష్టి, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడమే ఆర్థిక విధానాల లక్ష్యంగా ఉండి తీరాలి. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ రెండు విషయాలలోను విఫలమయింది. తత్కారణంగానే ఓటర్ల తీర్పు బీజేపీ, ఎన్డీఏకు వ్యతిరేకంగా వచ్చింది. మరి బీజేపీ నాయకత్వం తన విధానపరమైన పొరపాట్లను సరిదిద్దుకుంటుందా లేదా అనే విషయం పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌లో స్పష్టమవుతుంది.

కాంగ్రెస్ మేనిఫెస్టో 2024ను అనుసరించి ఉద్యోగాల విషయమై మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్, ఇండియా కూటమి తీవ్ర ఒత్తిడి తేవాలి: 'మేము గుత్తాధిపత్యాలను, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం'; 'ప్రభుత్వం నుంచి ప్రతి వ్యాపారవేత్త/ పారిశ్రామికవేత్తకు లభ్యం కాగల ఆర్థిక సహాయం, భౌతిక వనరులు, వ్యాపార అవకాశాలను ఏ ఒక్క కంపెనీ లేదా వ్యక్తి మాత్రమే పూర్తిగా స్వాయత్తం చేసుకోవడానికి వీలు లేకుండా చర్యలు చేపడుతాం'; పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించే వ్యాపార సంస్థలకు అనుకూలంగా మా విధాన ప్రాధాన్యాలు ఉంటాయి'; కేంద్ర ప్రభుత్వంలోను, దాని అనుబంధ ప్రభుత్వరంగ సంస్థలలో 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి'; కార్పొరేట్ కంపెనీలు పన్ను రాయితీలు పొందేందుకు షరతుగా కొత్త "ఎంప్లాయ్‌మెంట్ –లింక్‌డ్ ఇన్సెంటివ్" (ఇఎల్‌ఐ) పథకాన్ని ప్రారంభించాలి'; పట్టణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల పునర్నిర్మాణంలో పట్టణ పేదలకు ఉపాధి కల్పించేందుకు పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభిస్తాం'; 'గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల ద్వారా అమలయ్యే జలవనరుల పునరుద్ధరణ, బంజరు భూముల పునరుజ్జీవన కార్యక్రమాలను ప్రారంభించి నిరక్షరాస్యులు, అనిపుణ యువతకు ఉపాధి కల్పించాలి'.

ప్రతిపక్షాలు తామే ప్రభుత్వమన్న రీతిలో ప్రవర్తించాలి. పద్దెనిమిదవ లోక్‌సభలో తమకు లభించిన అవకాశాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకుని ప్రభుత్వానికి పాలన సాగవలసిన తీరు తెన్నులను నిర్దేశించాలి. మెజారిటీ కొరవడిన బీజేపీ ప్రభుత్వం, కొత్త శక్తిమంతమైన ప్రతిపక్షానికి ఎలా ప్రతిస్పందించనున్నదో గమనించడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

సైద్ధాంతిక బలమే బీజేపీ విజయం

భారతదేశాన్ని 2014 నుంచీ పరిపాలిస్తున్న బీజేపీ దేశంలోనే అత్యంత శక్తిమంతమైన పార్టీగా అవతరించి మూడోసారి అధికార పగ్గాలు చేపట్టింది. సాంస్కృతిక జాతీయ వాద సంస్థగా ఎదిగి, తన విజయప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఉంది. 1984లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కేవలం రెండు పార్లమెంట్ సీట్లను గెలిచిన బీజేపీ, నేడు దాదాపు దేశమంతా విస్తరించింది. పార్లమెంట్‌లోనూ, శాసనసభల్లోనూ సభ్యులపరంగా, ప్రాతినిధ్యం రీత్యా చూస్తే ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా అవతరించి ఉండవచ్చు. సిద్ధాంత రీత్యా బీజేపీని ఇవాళ ఒక విశిష్టమైన పార్టీగా మనం పరిగణించాలి.

బీజేపీని భారత్‌లో రెండో శక్తిమంతమైన పార్టీ వ్యవస్థగా రాజకీయ విశ్లేషకుడు సుహాస్ పాల్శికర్ వివరించారు. 1984లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం సంపూర్ణ ఆధిక్యం సాధించిన తర్వాత, ఆ ఘనత సాధించిన తొలి పార్టీ బీజేపీయే. ఇందిరాగాంధీ తర్వాత, దేశవ్యాప్తంగా అదే స్థాయిలో ప్రజాదరణ కలిగిన నాయకుడు మోదీనే అని సుహాస్ చెప్పారు.

మోదీకి ఉన్న ప్రజాదరణతోపాటు కేంద్రీకృత హిందూ ఓటు బ్యాంకు, సాంస్కృతిక జాతీయ వాదం, అభివృద్ధి, ఆచరణ... తదితర అంశాలే బీజేపీ విజయ రహస్యాలని చెప్పవచ్చు. వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం లేనంతగా నేడు ప్రజల్లో బీజేపీకి మద్దతు పెరిగింది. మోదీ ప్రజాదరణకు గల కారణాలను గమనిస్తే నిబద్ధత గల వ్యక్తిగత జీవితంతో పాటు ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత, నీతి నిజాయితీలతో కూడిన సుపరిపాలన, దృఢమైన నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం వంటివెన్నో చెప్పవచ్చు. భారతదేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా మోదీ గుర్తింపు పొందారు. ఇక కేంద్రీకృత హిందూ ఓటు బ్యాంక్ నిర్మాణం అంశానికి వస్తే, బీజేపీ మేనిఫెస్టోలో భారతీయుల చిరకాల స్వప్నమైన రామమందిర నిర్మాణ సాకారం చేయటంలో ఆ పార్టీ సఫలీకృతం అయింది. ఇది అత్యధిక హిందువులను బీజేపీకి ఓటు వేసేలా చేసింది. మెజార్టీ హిందువుల హక్కులను పక్కన పెట్టే పార్టీలకు ఒక చెంపపెట్టులా సామరస్య వాతావరణంలో మందిర ప్రాణప్రతిష్ఠ అద్భుతంగా జరిగింది. సాధారణ ప్రజల్లోకి రామ మందిరం అంశం వెళ్ళిపోయింది. మూడవ ప్రధాన విషయం బీజేపీ ఒక సైద్ధాంతిక భూమిక ఆధారంగా నిలబడిన, కార్యకర్తల బలం గల విలక్షణ పార్టీ. ఆ సిద్ధాంతం సాంస్కృతిక జాతీయవాదం. తమ సిద్ధాంత మూలాలను బీజేపీ ఏనాడూ విస్మరించలేదు. దాన్లో భాగంగానే ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, రామమందిర పునః నిర్మాణం, సీఏఏ వంటివి సాధించింది.



బీజేపీ ఒక సైద్ధాంతిక భూమిక ఆధారంగా నిలబడిన, కార్యకర్తల బలం గల విలక్షణ పార్టీ. ఆ సిద్ధాంతం సాంస్కృతిక జాతీయవాదం. తమ సిద్ధాంత మూలాలను బీజేపీ ఏనాడూ విస్మరించలేదు. దాన్లో భాగంగానే ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, రామమందిర పునః నిర్మాణం, సీఏఏ వంటివి సాధించింది.

సాంస్కృతిక జాతీయవాద సిద్ధాంతం ఎవ్వరినీ వ్యతిరేకించేది కాదు. అభివృద్ధిలో అందరినీ భాగస్వామ్యం చేసేదే. బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మత మానవతావాదంలో మానవునిపై చర్చ ఉందే గానీ మనుషులను విభజించే అంశాలు లేవు. సమాజంలో కింది స్థాయిలో ఉన్న వ్యక్తులకు సంక్షేమ ఫలాలు చేరాలి, కనీస అవసరాలు తీరాలి అన్నది క్లుప్తంగా ఏకాత్మ మానవతా వాదంలో ఉన్న లక్ష్యం. ఇదే పనిని పదేళ్లుగా బీజేపీ చేస్తుంది. ఇకముందూ చేస్తుంది.

'ఐక్యతపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించడమే బీజేపీ, ఆరెస్సెస్‌ల విజయానికి మూల కారణమని రాజకీయ విశ్లేషకుడు వినయ్ సీతాపతి తన కొత్త పుస్తం 'జుగల్‌బంది: ద బీజేపీ బిఫోర్ మోదీ'లో రాసుకొచ్చారు. 'శక్తిమంతమైన హిందువులు ఓడిపోవడానికి ఒకరికి ఒకరు వెన్నుపోటు పొడుచుకోవడమే కారణం. ఐక్యత లేకపోవడం వల్లే హిందువులు ఓడిపోయారు' అని అని అశోక యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ అయిన సీతాపతి చెప్పుకొచ్చారు. ఇదే పుస్తకంలో బీజేపీకి సైద్ధాంతిక ప్రేరణ ఇచ్చే మాతృసంస్థ గురించి చెప్తూ, 'ఆరెస్సెస్ సభ్యులతో చేయించే కసరత్తులు కేవలం కసరత్తులు మాత్రమే కాదు. వీటిని అందరితో కలిపి చేయిస్తారు. కలసి మార్చ్ చేయడం, పిరమిడ్ ఆకారంలో నిలబడటం లాంటివి చేయిస్తారు. బృంద స్ఫూర్తిని పెంచేందుకు ఆడించే ఆటలను ఆడిస్తారు. ముఖ్యంగా ఐక్యత ప్రాధాన్యం చెప్పడానికే ఇవన్నీ చేయిస్తారు. ఈ ఐక్యత సంస్థకు ఒక సిద్ధాంతం లాంటిది. ఈ మద్దతుదారులు సాధారణ పార్టీల మద్దతుదారుల్లాంటివారు కాదు' అని సీతాపతి చెప్పారు. 'భారత్‌లో 80 శాతానికి పైగా ఉండే హిందువులను ఏకం చేయడమే బీజేపీ లక్ష్యం. అందుకే కులాలకు పార్టీ అంత ప్రాధాన్యం ఇవ్వదు' అని ఆయన ఆ గ్రంథంలో వివరించారు.

భారత్‌లో రాజకీయ పార్టీలను ప్రజాదరణ కలిగిన నాయకులు, సిద్ధాంతాలు, కులాలు ముందుకు నడిపిస్తుంటాయి. అసమ్మతి, అంతర్గత కలహాలు సర్వసాధారణం. పై స్థాయి నాయకుల్లో విభేదాలతో పార్టీలు చీలుతుంటాయి. కాంగ్రెస్ నుంచి వేరుపడిన చాలా మంది నాయకులు ఇలానే ప్రాంతీయ పార్టీలను పెట్టారు. కానీ, బీజేపీలో ఇప్పటివరకు ఇలాంటివేమీ జరగలేదు. డాక్టర్ శ్యామప్రసాద ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అనంతరం అటల్ బిహారీ వాజపేయి, అద్వానీ, ప్రస్తుతం నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా... ఇలాంటి నాయకులందరూ పార్టీని ఐక్యతతో నడిపించారు, నడిపిస్తున్నారు.

బీజేపీని ఒక అసాధారణ పార్టీగా రాజకీయ విశ్లేషకుడు మిలన్ వైష్ణవ్ అభివర్ణించారు: 'హిందూ జాతీయవాద సంస్థల రాజకీయ పార్టీగా బీజేపీని చెప్పుకోవచ్చు. ఈ పార్టీని అనుబంధ సంస్థల నుంచి వేరు చేయడం చాలా కష్టం. ఈ సంస్థల నుంచి బీజేపీకి చాలా మద్దతు వస్తుంది. పార్టీ నుంచి ఎవరూ బయటకు పోకుండా ఈ సంస్థలే కాపాడుతుంటాయి' అని ద కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ ఇన్ వాషింగ్టన్‌లో పరిశోధకుడైన వైష్ణవ్ చెప్పారు. 'బీజేపీ నుంచి అసమ్మతివాదులు బయటకు వెళ్లరని కాదు. అయితే, బయటకు వెళ్లినవారు రాజకీయంగా పెద్దగా విజయం సాధించలేరు. మళ్లీ పార్టీలోకి వచ్చేస్తారు. ఎందుకంటే బీజేపీ ఒక సైద్ధాంతిక పార్టీ. సిద్ధాంతాలే ఈ పార్టీని కలిపి ఉంచుతున్నాయి', అని 'ఐడియాలజీ అండ్ ఐడెంటిటీ' పుస్తక రచయిత, రాజకీయ విశ్లేషకుడు రాహుల్ వర్మ చెప్పారు. రాజకీయాల్ని బీజేపీ అధికారం కోసం చేయదు, దేశం కోసం చేస్తుంది అన్నది రాజనీతి తెలిసిన విజ్ఞుల అభిప్రాయం. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలతో దేశాన్ని ముందుకు తీసుకువెళ్తుందని ఆశిద్దాం.

● కొట్టె మురళీకృష్ణ

నల్సార్‌కు ఇజ్రాయెల్‌తో విద్యా ఒప్పందాలు వద్దు

గాజాలో పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ సైన్యం పాల్పడుతున్న 'జాతి సంహారం'ను హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా నసేయిరత్ శిబిరంపై కిరాతక దాడికి చలించిపోయిన నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులు ఇజ్రాయెల్‌తో విద్యా విషయక సంబంధాలను పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ నల్సార్ వైస్ ఛాన్సలర్‌కు ఒక లేఖ రాశారు. గాజాలో సాగుతున్న మారణకాండ 'జాతి సంహారమే'నని లొవెన్ స్టెయిన్ హ్యూమన్ రైట్స్ ప్రాజెక్ట్, యేల్ లా స్కూల్ ద హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం మొదలైనవి నిర్ద్వంద్వంగా ఖండించాయని ఆ లేఖ పేర్కొంది. ఆ లేఖలో ఇంకా ఇలా ఉంది:

'అక్టోబర్ 7, 2023, మే 2024 మధ్య కనీసం 36,743 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ హతమార్చింది. కనీసం మరో 86,727 మంది తీవ్రంగా గాయపడ్డారు. హతమారిపోయిన పాలస్తీనియన్లలో దాదాపు 15 వేల మంది బాలలే. ఈ నేపథ్యంలో, విద్యా సంస్థల పాత్ర గురించి మేము ఒక అంచనాకు రావడం అనివార్యమయింది. గాజాలో సాగుతున్న ఘాతుకాలలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ భాగస్వాములు అవుతున్న ఇజ్రాయెలీ విద్యా సంస్థలతో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాం. అంతర్జాతీయ అకడమిక్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కింద రెండు ఇజ్రాయెలీ విశ్వవిద్యాలయాలతో నల్సార్‌కు సంబంధాలు ఉన్నాయి. అవి: రాడ్ జినెర్ స్కూల్ ఆఫ్ లా, రెయిష్ మాన్ యూనివర్శిటీ; బచ్‌మన్ స్కూల్ ఆఫ్ లా, టెల్ అవీవ్ యూనివర్శిటీ. టెల్ అవీవ్ యూనివర్శిటీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో గాజాలో దాడులకు సహకరిస్తోంది. గాజాలో ఇజ్రాయెల్ ప్రభుత్వ చర్యలను పూర్తిగా సమర్థిస్తున్న ప్రొఫెసర్ అహరాన్ బరాక్ లో రాడ్జినెర్ స్కూల్ ఆఫ్ లాలో ఆచార్యుడుగా ఉన్నారు. సమున్నతమైన అకడమిక్ విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఈ రెండు యూనివర్శిటీలతో అకడమిక్ సంబంధాలకు స్వస్తి చెప్పితీరాలి. లేనిపక్షంలో మానవ హక్కుల రక్షణ, విద్యా విషయక స్వేచ్ఛ, ప్రగతిశీల ఆలోచన విషయంలో నల్సార్ పేరుప్రతిష్ఠలు సార్థకమైనవి కావని మేమే కాకుండా విశాల సమాజమూ భావించవలసి వస్తుంది.

– ఫైజన్ ముస్తాఫా, మాజీ వైస్‌చాన్సలర్, డాక్టర్ హెచ్.వాగీశన్ ఇత్యాది 12మంది అధ్యాపకులు, నిపుణ వర్మన్, అంశుల్ మరికొందరు పూర్వ విద్యార్థులు, అఖిల పూజారి, బర్ఖా సింగ్ తదితర 362మంది విద్యార్థులు.

చేతగానితనంతో చేవలేని విమర్శలు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం టీఆర్ఎస్ ఆవిర్భవించిన నాటి నుంచి కేసీఆర్ అడుగులో అడుగేసిన అతికొద్ది మందిలో హరీశ్ రావు ఒకరు. నాటి నుంచి నేటి వరకు ఉద్యమంలో ఉన్నా, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆయన ప్రజల పక్షాన నిలిచారు. తెలంగాణ గొంతుకై నినదించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సమైక్య పాలకులపై కలబడ్డారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా, మూడుసార్లు మంత్రి అయినా అధికార దర్పం ఎరుగని నాయకునిగా సాధారణ పౌరుడిలాగానే జనం మధ్య నిలిచారు. రాత్రయినా పగలైనా ప్రజాసేవలో నిమగ్నమయ్యారు. ఈ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ప్రత్యర్థులు సైతం ప్రశంసించే వ్యక్తిత్వం ఆయన సొంతం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2004లోనే హరీశ్ విజన్ ఉన్న నాయకుడని, భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదుగుతారని ప్రశంసించారు. కొత్తతరం నాయకుడైన నారా లోకేశ్ రాజకీయాల్లో తనకు హరీశ్ రావు ఆదర్శమని గతంలోనే చెప్పారు. అసెంబ్లీలో కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనేకసార్లు హరీశ్ రావును ప్రశంసించారు. రాజకీయ నేతలే గాక పద్మశ్రీ గరికపాటి నర్సింహరావు లాంటివారు కూడా తమ ప్రవచనాల్లో హరీశ్ రావు పేరును ప్రస్తావిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తనకిష్టమైన నాయకుడు అని ప్రకటించారు. ఇవన్నీ రికార్డుల్లో ఉన్నాయి. పదవులకు అతీతంగా ఆయన వ్యక్తిత్వం ఎదిగింది. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, ఏ పదవి ఆశ చూపినా పార్టీ మారకుండా నిబద్ధత కలిగిన కార్యకర్తలాగా హరీశ్ రావు పనిచేస్తున్నారు. నేడు ప్రతిపక్షంలో ఉన్నా వివిధ రంగాలకు చెందిన వారు తమ సమస్యల పరిష్కారం కోసం గొంతు వినిపించాల్సిందిగా ప్రతీరోజు ఆయనని కలిసి పోతూనే ఉంటారు. అది ప్రజలకు ఆయనపై ఉన్న విశ్వాసం. ఇది కాంగ్రెస్ నాయకులకు కంటగింపుగా మారింది. దీంతో ఆయన మీద వ్యక్తిగత దాడులకు తెగబడుతున్నారు.

హరీశ్ రావు బీజేపీతో చేతులు కలిపారనే కుట్రపూరిత ప్రచారం పదే పదే చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనను ఆయన ప్రెస్ మీట్ల ద్వారా, అసెంబ్లీలోనూ, జనం మధ్యన శక్తిమంతంగా నిలదీస్తున్నరు. ప్రభుత్వానికి ఆయన ఉనికి భరించరానిదిగా ఉంది. వ్యక్తిత్వ హననం ద్వారా పైచేయి సాధించవచ్చని పుకార్లకు తెగబడుతున్నారు. వాళ్ల వాదన ప్రకారం చూస్తే, మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ సీట్లు కాంగ్రెస్ గెలిచింది. మరి అక్కడ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎలా గెలిచింది? రేవంత్ రెడ్డి గెలిచిన మల్కాజిగిరిలో బీజేపీ భారీ మెజారిటీతో ఎలా గెలిచింది? ఈ రెండు చోట్లా రేవంత్ రెడ్డి బీజేపీని గెలిపించారా?

నిరాధార నిందారోపణలు చేస్తే అవి తిరిగి వారికే గుచ్చుకుంటాయి. ప్రజల గొంతుక అయిన హరీశ్ రావు, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని మొదటి నుంచి గట్టిగానే డిమాండ్ చేస్తున్నారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన బాధ్యతలను వంద శాతం నెరవేరుస్తున్నారు. ఆయన అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, హామీలు అమలు చేయలేక, పరిపాలన చేతకాక చేతులెత్తేసిన ప్రభుత్వ పెద్దలు ఎదురుదాడే అస్త్రంగా ఎంచుకున్నారు. అయితే ఇవేమీ ఆయనకు కొత్తకాదు. ఉద్యమ సమయంలో కూడా గట్టిగా కొట్లాడే హరీశ్ రావుపై సమైక్యాంధ్ర నాయకులు ఇదే విధంగా కుట్రలు చేశారు. కేసులు పెట్టారు. అయినా సరే, వెనకడుగు వేయకుండా ప్రజల కోసం కొట్లాడిన వ్యక్తి ఆయన.

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే రుణమాఫీ సహా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లపై రాసిచ్చారు. ఆగస్టు 15లోగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ అమలు చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ రావు అమరవీరుల స్థూపం వద్ద సవాల్ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు గుండె ఆగినంత పనైపోతున్నది. ఆగస్టు 15 దగ్గర పడుతుండడంతో ఏ హామీనీ అమలు చేయలేకపోయిన రాష్ట్ర ప్రభుత్వం, హరీశ్ రావు ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఆయన గొంతు మూయించే విఫల యత్నం చేస్తున్నది.



ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతున్నా ఇంకా తమను విమర్శించవద్దని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వాదనలో పసలేదు. హరీశ్ రావు మీపై వ్యక్తిగత విమర్శలు చేయలేదు. కేవలం ప్రజల తరఫున హామీలు అమలు చేయమని మాత్రమే కోరారు. మీరు చేయాల్సిన పనిని మాత్రమే గుర్తు చేస్తున్నారు. ఇది తప్పెట్ల అయితది?

ఇటీవలే ప్రభుత్వంలో పదవులు పొందినవారు ముఖ్యమంత్రి ముందు తమ విధేయతను చాటుకోవడం కోసం హరీశ్ రావు మీద విమర్శలకు దిగుతున్నారు. ఇది ఆకాశం మీద ఉమ్మేసిన చందంగా ఉంది. నిజంగా కాంగ్రెస్ నాయకులకు హరీశ్ రావు గొంతు నొక్కాలనే బలమైన కాంక్ష ఉంటే, దానికి సులువైన మార్గం ఉంది. ఆగస్టు 15లోగా ఆరు గ్యారంటీలతో పాటు అన్ని హామీలు అమలు చేయండి. ఆగస్టు 15లోగా ప్రభుత్వం చెప్పినట్లు చేయాల్సిన పనులను మరోసారి గుర్తు చేస్తున్నాం. ఎలాంటి కొర్రీలు పెట్టకుండా రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ చేయండి. మహాలక్ష్మి కింద ప్రతీ మహిళకు నెలకు 2,500 చొప్పున ఆర్థిక సహాయం అందించండి. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15,000 సాయం ఇచ్చేయండి. కౌలు రైతులకు కూడా రైతుభరోసా సాయం అందించండి. వ్యవసాయ కూలీలకు రూ.12,000 సాయం చేయండి. అన్ని రకాల వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయండి. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఇవ్వండి. చెప్పిన మాట ప్రకారం మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చేయండి. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం కానుకగా ఇవ్వండి. ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12,000 సాయం చేయండి. 200 యూనిట్ల లోపు కరెంటు ఫ్రీ అన్నారు. అప్లికేషన్లు తీసుకున్నారు. నామమాత్రంగా కొందరికి జీరో బిల్ ఇచ్చారు. ఇంకా లక్షలాది మంది జీరో బిల్లు కోసం వెయిట్ చేస్తున్నారు. వారందరికీ ఉచిత విద్యుత్ ఇవ్వండి. లక్షలాది మంది ఇండ్ల కోసం దరఖాస్తు చేస్తున్నారు. అందరికీ ఇండ్లు మంజూరు చేసేయండి. రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇస్తామని దరఖాస్తులు తీసుకున్నారు. వారికి గ్యాస్ సిలిండర్ ఇచ్చేయండి. కాలేజీలకు వెళ్లే అమ్మాయిలకు స్కూటీలు కొనివ్వండి. ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వండి. బకాయిపడిన నాలుగు డీఏలు చెల్లించండి.

ఎవరికి ఏ సమస్య వచ్చినా నేనే పరిష్కరిస్తా అని రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతీ రోజు ప్రజావాణి నిర్వహిస్తా అన్నారు. అందుకోసమే ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చామని చెప్పుకున్నారు. రేపటి నుంచే రేవంత్ రెడ్డిని ప్రజాభవన్‌లో కూర్చుని ప్రజావాణి నిర్వహించమనండి. ఇవన్నీ హరీశ్ రావు చేస్తున్న కొత్త డిమాండ్లు కాదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చెప్పిన హామీలు. కేవలం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులే కాదు. ఢిల్లీ నుంచి వచ్చిన మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధి, ప్రియాంకగాంధి లాంటి ఉద్దండులు ష్యూరిటీగా ఉండి ఇచ్చిన గ్యారంటీలు. డిసెంబర్ 9 నాడే రుణమాఫీ చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. హామీలన్నీ వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. కానీ ఇప్పటికే 180 రోజులు దాటింది. ఆగస్టు 15 నాటికి 250 రోజులు దాటుతుంది. అయినా సరే, హరీశ్ రావు మీకు గడువు ఇచ్చారు. ఆ లోగా హామీలన్నీ అమలు చేసి, అప్పుడు మాట్లాడండి. ఎన్ని విమర్శలైనా చేయండి.

ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతున్నా ఇంకా తమను విమర్శించవద్దని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వాదనలో పసలేదు. హరీశ్ రావు మీపై వ్యక్తిగత విమర్శలు చేయలేదు. కేవలం ప్రజల తరఫున హామీలు అమలు చేయమని మాత్రమే కోరారు. మీరు చేయాల్సిన పనిని మాత్రమే గుర్తు చేస్తున్నారు. ఇది తప్పెట్ల అయితది? ప్రతిపక్షం మీద బురద జల్లే ప్రయత్నం చేస్తూ ఎంతకాలం వృథా చేస్తారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసి నిజమైన ప్రజాపాలనను నిరూపించుకోండి. అప్పుడు చెప్పిన మాట ప్రకారం పదవికి రాజీనామా చేయకుంటే హరీశ్ రావును నిందించండి. అలా చేయకుండా ప్రజల తరఫున ఎవరు ప్రశ్నించినా అభాసుపాలవుతారు. హరీశ్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీద్దాం అనుకుంటే అది మీకు ఆత్మహత్యాసదృశమే అవుతుంది. ప్రజలు నిజంగా ఇది ప్రజాపాలన అని అనుకునే తీరున కాంగ్రెస్ ప్రభుత్వం మసులుకుంటే మంచిది.

■ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్
బీఆర్ఎస్ అధికార ప్రతినిధి

పిఓడబ్ల్యు అర్ధ శతాబ్ది ఉత్సవ సభ

ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థినుల చొరవతో 1974లో అభ్యుదయ మహిళా సంఘం (పిఓడబ్ల్యు) ఏర్పడింది. ప్రణాళిక స్ఫూర్తితో ఏర్పడిన నాలుగు ప్రగతిశీల మహిళా సంఘం సంస్థలు రెండు తెలుగు రాష్ట్రాలలో మహిళా సమస్యలపై పోరాటాలు చేస్తున్నాయి. ఈ సంస్థలన్నీ గత నాలుగు దశాబ్దాలుగా స్త్రీలపై బహుముఖ రూపాలలో కొనసాగుతున్న జండర్ వివక్ష, హక్కుల అణచివేత, హింసలకు, పితృస్వామిక ఆధిపత్య సంస్కృతికి వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ప్రశ్నిస్తూ ఉద్యమాలని నిర్మిస్తున్నాయి. అవిభాజ్య తెలుగు రాష్ట్రంలో జరిగిన చారిత్రక సారా, మద్యం వ్యతిరేక ఉద్యమంలో పిఓడబ్ల్యు సంస్థల నాయకత్వంలో మహిళలు పోరాడారు. దళిత మహిళల భూపోరాటాలను, సాయుధముఠా నాయకుల హత్యా రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక ఉద్యమాలను ఈ సంస్థలు నిర్మించాయి. విద్యా, ఉద్యోగ, చట్టసభలలో 50శాతం రిజర్వేషన్ల కోసం, పట్టణ ప్రాంతాలలో పేద ప్రజల నివాస హక్కుల కోసం పోరాటాలు చేశాయి.

భావసారూప్యత కలిగిన మహిళా సంస్థలన్నీ ఒక తాటి మీదకు రావాలనే అభిప్రాయం గత ఏడాది జరిగిన సమావేశంలో వ్యక్తమయింది. ఆ స్ఫూర్తితో 2024 జూన్ 22న జరగబోయే పిఓడబ్ల్యు అర్ధ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను అన్ని సంఘాలు కలిసి ఒకే వేదిక నుంచి ఉమ్మడిగా నిర్వహించాలని నిర్ణయించుకుని, ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నాయి.

ఈ క్రమంలో, నాలుగు పిఓడబ్ల్యు సంస్థల భాగస్వామ్యంతో నేడు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముగింపు సభ జరుగుతుంది. అంతకు ముందు లిబర్టి అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ వరకు ప్రదర్శన ఉంటుంది. అనంతరం జరిగే సభలో ప్రముఖ స్వతంత్ర జర్నలిస్ట్, రచయిత్రి, భాషా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రొ. రమ మేల్కొటే, ప్రొ. శ్యామల, ప్రొ. లక్ష్మీ, కాత్యాయిని (చూపు) తదితర మహిళా మేధావులు పాల్గొని ప్రసంగిస్తారు. అంబిక, పిఓడబ్ల్యు అర్ధ శతాబ్ది సమన్వయ కమిటి, జి. ఝాన్సీ వి. సంధ్య, చంద్ర అరుణ, సుజ్ఞానమ్మ వక్తలుగా పాల్గొంటారు.

– పిఓడబ్ల్యు అర్ధ శతాబ్ది వార్షికోత్సవ సమన్వయ కమిటీ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
శనివారం 22 జూన్ 2024



ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే నిలదీస్తాం..

- అర్హులందరికీ పీఎం కిసాన్ అందేలా చర్యలు
- కొత్తకొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం..
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

5



6

సార్‌కు ఘన నివాళి

ఆచార్య జయశంకర్ సార్ వర్ధంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. బాలసముద్రం ఏకశిలాపార్కు లోని ప్రొఫెసర్ విగ్రహానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. సార్ కుటుంబసభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దాస్యం వినయభాస్కర్ నివాళులర్పించారు.



ధ్యానం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కేయూ క్యాంపస్‌లో..

6

ఉత్సాహంగా యోగా డే

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. పలు చోట్ల జరిగిన కార్యక్రమాల్లో హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారదాదేవితో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, పలువురు జిల్లా అధికారులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పోలీస్ పోస్టింగ్.. పరేషాన్!

ఎన్నికల కోడ్ ముగియటంతో పైరవీలు మొదలు

- పాత స్థానాల్లోకి మళ్లీ వచ్చేందుకు పలువురి ఆసక్తి
- ప్రస్తుత స్టేషన్లలోనే కొనసాగాలి అనుకుంటున్న కొందరు..
- పైరవీల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
- ఎస్ఐల నుంచి ఏసీపీల వరకు ఎవరి ప్రయత్నాల్లో వారు
- ఇదే అదనుగా రంగంలోకి దళారులు
- పోస్టింగుకో రేటు ఫిక్స్..
- నగర శివారుల్లోని స్టేషన్లకు ఫుల్ డిమాండ్
- సిఫారసు లేఖ లేకుంటే ఎంత సిన్సియర్‌గా జాబ్ చేసినా లూప్ లైన్‌కేనని చర్చ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పోలీసుల్లో బదిలీల టెన్షన్ మొదలైంది. ఎన్నికల కోడ్ ముగియడంతో తమను ఎక్కడికి బదిలీ చేస్తారోనన్న ఆందోళన కనిపిస్తోంది. దీంతో సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంచి చోట పోస్టింగ్ ఇప్పిస్తే భారీగా నజరానాలు ఇచ్చేందుకు సిద్ధమవు తున్నారు. ఎస్ఐల నుంచి ఏసీపీల వరకు తాము కోరుకున్న పోస్టింగ్‌ల ఇప్పించేలా పైరవీ చేయా లంటూ తిరుగుతున్నారు. అయితే ఎన్నికలకు ముందు పైరవీలతో పోస్టింగ్ కొట్టిన కొందరు మూడు రోజులు తిరగకముందే ఎన్నికల కోడ్ పేరుతో బదిలీ అయ్యారు. వారిలో చాలామంది నాటి తమ పోస్టులు తిరిగి తమకే ఇవ్వాలని నేతలపై ఒత్తిడి తెస్తుండగా, ప్రస్తుతం డ్యూటీల్లో ఉన్న అధికారులు ఇక్కడే కొనసాగేలా నేతలపై ఒత్తిడి తీసుకొస్తున్నట్టు చర్చ జరుగుతోంది. దీంతో నేతలు ఎవరికి సిఫార్సు లేఖలు ఇస్తారో అనే ఉత్కంఠ నెలకొంది.

ఐఏఎస్, ఐపీఎస్‌లతో బదిలీలు షురూ..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ప్రభుత్వం ఎన్నికల ముందు జిల్లాలో మూడేళ్లకు పైగా పని చేసిన వారిని, సొంత జిల్లాలో పని చేసినవారిని బదిలీ చేసివారి స్థానంలో కొత్త వారిని నియమించింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో పరిపాలనపై దృష్టి పెట్టిన ప్రభుత్వం గత ప్రభుత్వం నియమించిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలను బదిలీలు చేసింది. ఇందులో భాగంగా దీంతో ఈ నెల 15వ తేదీన ఉమ్మడి జిల్లాలోని భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లను బదిలీ చేసింది. వరంగల్ వెస్ట్ (జనగామ), వరంగల్ సెంట్రల్ డీసీపీలకు కూడా స్థానం చలనం జరిగింది. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టడంతో తరువాత కిందిస్థాయి అధికారుల బదిలీలు ఉంటాయనే చర్చ జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్‌తో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోనూ ఎస్ఐ, సీఐ, డీఎస్పీల బదిలీపై అధికార పార్టీ నేతలు దృష్టిసారించారు. దీంతో రెండుమూడు రోజుల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

దళారుల రంగ ప్రవేశం!

బదిలీల పర్వం మొదలవటంతో మంచి పోస్టింగ్ కోసం నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే కొందరు ఎమ్మెల్యేలు, నేతలు ఖాకీల పనితీరు కంటే సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది. సామాజిక వర్గం అధికారులు లేకుంటే సమర్థత, విశ్వసనీయత, పనితీరు, పాత పరిచయాలు తదితర అంశాలను బేరీజు వేసుకుంటున్నారనే అభిప్రాయాలున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాలో ఇచ్చే పోస్టింగుల్లో ఎక్కువ శాతం తమ సామాజిక వర్గానికి చెందిన అధికారులకే సిఫార్సులు చేస్తున్నారనే చర్చ జరుగుతుండగా మరికొన్ని చోట్ల పోస్టింగుకో రేటు ఫిక్స్ చేసి దళారులతో బేరసారాలకు దిగుతు న్నారనే ప్రచారం ఉంది. వరంగల్ నగరం సమీపం లోని ఓ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే పోలీస్ స్టేషన్లకు భారీగా ధర పలుకుతుందనే చర్చ సాగు తోంది. నగరం నడిబొడ్డున ఉన్న ఓ ఏసీపీ పోస్టిం గ్ కోసం పొరుగు జిల్లా మంత్రితో ఓ అధికారి పైరవీలు చేస్తున్నారని సమాచారం. పరకాల నియోజకవర్గం పరిధిలో రెండు స్టేషన్లలో పోస్టిం గుల విషయంలో ముగ్గురు నేతలు వేర్వేరుగా సిఫార్సులు చేస్తున్నారని సమాచారం. నగర పరిధిలో ఉండే నాలుగైదు స్టేషన్లలో పోస్టింగ్ కోసం భారీగా క్యూ కడుతున్నారని తెలుస్తోంది.

మా కుర్చీ మాకే కావాలి..

పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఫిబ్రవరి నెలలో ఉమ్మడిజిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు జరిగాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు సూచించిన వారికి పోస్టింగులు దక్కాయి. ఆ సమయంలో కొందరు నేతలు భారీగా తీసుకుని పోస్టింగులు ఇప్పించారని, కొన్నిస్టేషన్ల ఎస్‌హెచ్‌వోల పోస్టింగులకు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల వరకు చేతులు మారాయని ప్రచారం జరిగింది. అయితే ఫిబ్రవరిలో విధుల్లో చేరిన కొంతమంది అధికారులకు మార్చిలో జరిగిన బదిలీల్లో స్థానచలనం తప్పలేదు. అప్పటికే సిఫార్సు లేఖల కోసం భారీగా సమర్పించుకున్న వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం కోడ్ ముగియటంతో మళ్లీ తమ పాత స్థానాలు తమకే ఇప్పించాలని పట్టుబడుతున్నట్టు సమాచారం. అయితే ఆ పోస్టు ఆ సిఫార్సు లేఖ వరకే అని.. మళ్లీ పోస్టు కావాలంటే ఆలోచిస్తామంటూ వరంగల్ నగర సమీపంలోని ఓ నేత ఖాకీలను ఇంటి చుట్టూ తిప్పుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా వేరే అధికారులకు పోస్టింగులు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దళారులు రంగంలోకి దిగి బేరసారాలు మొదలు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో తమ పాత పోస్టింగ్ వస్తుందా..లేదా అనే టెన్షన్‌లో కొందరు పోలీసులు ఉండగా, ఎన్నికల బదిలీల్లో వచ్చిన అధికారులు కొందరుఅదే స్టేషన్‌లో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట. తమకున్న పరిచయాలతో ఆయా ఏరియాల్లోని కీలకనేతలపై ఒత్తిడి తెస్తున్నారట. ఇలా పోస్టింగుల కోసం జరుగుతున్న ఫైటింగ్‌లో కుర్చీ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ ఖాకీల్లో నెలకొంది.



సిఫారసు లేకుంటే లూప్‌లైన్‌లోకే..

పోలీసు శాఖలో నిజాయితీగా పని చేసే కొంతమంది అధికారులకు లూప్ లైన్ డ్యూటీస్ తప్పటం లేదు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్పీ స్థాయి అధికారి బదిలీ వరకు పైరవీలు నడుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అన్ని శాఖల కంటే పోలీస్ శాఖలోనే అధికంగా బదిలీలపై రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయనే అభిప్రాయాలు ఉన్నాయి. దీంతో నిజాయితీగా విధులు నిర్వహించే కొంతమంది అధికారులు, పైరవీలు చేయటం ఇష్టం లేని అధికారులకు లూప్ లైన్ డ్యూటీలు తప్పవనే చర్చ జరుగుతోంది. అనేక మంది పోలీసు అధికారులు నిజాయితీగా పని చేసినా, రాజకీయ పలుకుబడి లేకపోవటంతో లూప్ లైన్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం సిఫార్సు లేఖలకు కాకుండా బాధ్యతయుతంగా పని చేస్తున్న వారిని గుర్తించి పోస్టింగులు ఇవ్వాలనే డిమాండ్ కొందరు పోలీసుల నుంచి వినిపిస్తోంది.



నిర్మాణ పనుల్లో నిబంధనలు పాటించాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూన్ 21: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులలో నిబంధనలు పాటించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్రవారం గ్రేటర్ పరిధిలోని సాకరాసికుంట, ఎస్సీ కాలనీ, కీర్తిబార్ ప్రాంతాలతో పాటు బొమ్మలగుడి ప్రాంతంలో నిర్మిస్తున్న కమ్యునిటీ హాల్ పనులను స్థానిక అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిర్దేశిత ప్రమాణాల మేరకు చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లిస్తామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ రవికిరణ్, ఏఈ ముజామిల్ పాల్గొన్నారు.



వరంగల్ శాకరాసికుంటలో తనిఖీలు చేస్తున్న కమిషనర్ అశ్విని

బండ్ ప్లాంటేషన్ పనులు ప్రారంభించండి

గ్రేటర్ వరంగల్ పరిధిలోని చెరువు కట్టలపై బండ్ ప్లాంటేషన్ పనులు ప్రారంభించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉద్యానవన విభాగం అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్‌లోని క్రిస్టియన్‌కాలనీలోని నర్సరీ, గొర్రెకుంట సమీపంలోని కట్టమల్లన్న చెరువు, ఏనుమాముల ప్రాంతంలోని మునసలమ్మ కుంట ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి బండ్ ప్లాంటేషన్ ప్రణాళికలపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలంలో చాలాచోట్ల మొక్క లను నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. నగర పరిధిలో కుంటలు, చెరువులు ఆక్రమణకు గురి కాకుండా చెరవు కట్టల పైన మొక్కలను పెంచాలని అందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీఎంలో జూనియర్ డాక్టర్ల నిరసన

- నల్ల దుస్తులు, బ్యాడ్జీలు ధరించి వైద్య సేవలు
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం

వరంగల్ మెడికల్, జూన్ 21: ఉపకార వేతనాలు చెల్లించి, ఎంజీఎం డాక్టర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు నిరసన చేపట్టారు. శుక్రవారం నల్ల దుస్తులు, నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సేవలు అందించారు. అత్యవసర సేవలు మినహా ఎంజీఎంలో అన్ని సేవలను జూనియర్ డాక్టర్లు దూరంగా ఉన్నారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు మాట్లాడుతూ.. డాక్టర్ల కోసం కొత్త హాస్టల్ భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల నుంచి సరైన చర్యలు లేకపోవడంతోనే సమ్మె తప్ప మరో మార్గం లేకుండా పోయిందన్నారు. దీంతో ఈ నెల 24వ తేదీన సమ్మెకు దిగుతున్నట్లు సమ్మె నోటీసు విడుదల చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే నిరవధికంగా సమ్మె కొనసాగిస్తామని జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంజీఎం ఆస్పత్రిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి అందజేశారు.



గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జూనియర్ డాక్టర్లు

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 21: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతు న్న పనులలో ఇంకా ఏవైనా పను లు మిగిలితే నాణ్యతతో వాటిని కూడా వెంటనే పూర్తి చేయాలని జి ల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, చేపట్టాల్సిన కార్యాచరణపై ఎంపీడీఓలు, ఈఈలు, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీపై అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేయడంపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలన్నారు.

పాఠశాలల్లో పెయింటింగ్ పనులు మొదలు కాబోతున్నాయని, అభివృద్ధి పనులు చేస్తున్న సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీఈఓ డాక్టర్ అబ్దుల్ హై, మెప్మా పీడీ భద్రునాయక్, ఎంపీడీఓలు, ఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల చైతన్యంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు



అదనపు గదుల నిర్మాణ శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, జూన్ 21: గ్రామస్థుల చైతన్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయనడానికి ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలే నిదర్శనమని, ఆదిశగా గ్రామాల్లో పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ నిధులు రూ.18 లక్షలతో నిర్మించనున్న ఆదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. మూతపడిన పాఠశాలను గ్రామస్థులు చైతన్యంతో తెరిపించుకోవడమే కాకుండా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా ప్రైవేటు ఉపాధ్యాయులను ఏర్పరుచుకొని మంచి ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ గుర్తింపు పొందిన పాఠశాలను ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండుగా విభజించడంతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు (ఉపాధ్యాయులు) వస్తారని, అందుకు తనవంతుగా ప్రభుత్వం దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకెళ్తానని తెలిపారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. పాఠశాల పనితీరు అద్భుతంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం కృషి చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆదర్శవంతమైన ఈ పాఠశాలలో మౌలిక వసతులకై తన సీడీఎఫ్ నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, నోట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం రత్నకుమార్ అధ్యక్షత వహించగా తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కడుదూరి రాజు, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, అమ్మఆదర్శ కవిటీ ఛైర్మన్ సకీన, ఎస్ఎంసీ మాజీ ఛైర్మన్ పొన్నాల రాజు, నాయకులు సమ్మెట మహేందర్, ఎలిషా, గిరుక రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గుంజేడు శ్రీ ముసలమ్మ గుడి ఆవరణలో భక్తుల కోలాహలం

గుంజేడు శ్రీముసలమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

కొత్తగూడ, జూన్ 21: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టేముందు రైతులు శ్రీముసలమ్మ దేవతను దర్శించుకొని పంటలు బాగా పండాలని మొక్కుకోవడం, వాగు నీటిని తీసుకువెళ్లి వ్యవసాయ భూముల్లో చల్లుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగా రైతుల కుటుంబాలు అధిక సంఖ్యలో ముసలమ్మ జాతరకు తరలివచ్చారు. కుటుంబసమేతంగా ముసలమ్మ దేవతను దర్శించుకున్నారు. దీంతోపాటు పాఠశాలలు ప్రారంభం కావడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కుటంబాలు, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కుటుంబాలు శ్రీముసలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలు తీసుకున్న భక్తులు గుడి వద్ద వాహన పూజలు చేశారు. అనంతరం ఆహ్లాదకరంగా అడవిలో వంట లు చేసుకుని వనభోజనాలు చేశారు. కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడిపారు.

అధికారుల తప్పులు.. టీచర్లకు తిప్పలు..

- ప్రహసనంలా ఉపాధ్యాయుల పదోన్నతులు
- గణితంలో నిబంధన తారుమారు
- సోషల్ అడిక్వసీలో ఒక పోస్టు గల్లంతు
- విద్యార్థులు లేని చోట పీడీలకు స్థానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 21: వరంగల్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రహసనంలా మారింది. అధికారులు చేసిన తప్పులకు పంతుళ్లకు తిప్పలు తప్పడం లేదు. నిబంధనలు అధిగమించడం.. రోస్టర్‌ల ను తప్పుగా చూపించడం.. విద్యార్థులు తక్కువగా ఉన్న చోట పోస్టులను ఓపెన్ చేయడం లాంటి తదితర పొరపాట్లను అధికారులు చేయడం వల్ల పదోన్నతుల్లో కొంత మంది ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితోపా టు రోస్టర్ విధానంలో తలెత్తిన సాంకేతిక కారణంతో గురువారం రాత్రి వరకు ప్రభుత్వ విభాగంలోని పీఈటీ లు, స్థానిక సంస్థల విభాగంలోని ఎల్ఎఫ్ఎల్ హెచ్ ఎంలు, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌ల పదోన్నతుల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. జిల్లాలోని విద్యాశాఖాధి కారులు తప్పుడు జాబితాలను రూపొందించడంతోనే పదోన్నతుల్లో కొందరు ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తుంటే ఉన్నతాధికారుల ఆదే శాల మేరకే జాబితాలను రూపొందించామని డీఈవో వాసంతి పేర్కొన్నారు.

గణితంలో నిబంధన తారుమారు

ప్రభుత్వ విభాగంలోని గణితం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో నిబంధనలను అధికారులు తారుమారు చేశారని సంబంధిత ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ విభాగంలో మొత్తం 5 క్లియర్ వేకెన్సీలతో జాబితాను రూపొందించారు. ఇందులో 70 శాతం పదోన్నతులతో, 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ఒక్క పోస్టును మాత్రమే పదోన్నతితో భర్తీ చేశారు. 4 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అధికారులు నోటిఫై చేయడంతో నిబంధనలను తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలుగురు ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించాల్సి ఉండగా వారికి మొండిచేయి మిగిలింది.

ఎస్సీల పదోన్నతులు

స్థానిక సంస్థల విభాగంలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఎస్సీల విభాగంలో అడిక్వసీ ప్రకారం అధికారులు పదోన్నతులు నిర్వహించలేదని సంబంధిత ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిక్వసీ జాబితాలో 9 పోస్టులకు పదోన్నతి కల్పిస్తున్నట్లు జాబితాను రూపొందించిన అధికారులు 8 మందికి మాత్రమే పదోన్నతి కల్పించడంతో మరో ఉపాధ్యాయుడు పదోన్నతి పొందలేకపోయినట్లు వారు ఆరోపిస్తున్నారు. తమకు అడక్వసీ విషయంలో తనకు పదోన్నతి కల్పించాలని కోరుతూ ఓ ఉపాధ్యాయురాలు డీఈవోకు వినతి పత్రం అందజేశారు.

రోస్టర్ పాయింట్లు తారుమారు

వికలాంగుల రోస్టర్ పాయింట్లలోనూ అధికారులు తారుమారు చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. స్థానిక సంస్థల విభాగంలోని తెలుగు ఎస్ఏ పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్ 6లో వీహెచ్ ఉమెన్‌ను కేటాయించాల్సిన చోట వీహెచ్ మెన్ రోస్టర్‌ను కేటాయించడంతో సదరు మహిళా ఉపాధ్యాయురాలుకు అన్యాయం జరిగినట్లు తెలుస్తోంది. ఆ మహిళా ఉపాధ్యాయురాలు డీఈవో కార్యాలయంలో ఈ విషయమై వినతి పత్రం అందజేశారు.

పోస్టులు బ్లాక్

వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ విభాగంలోని స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉన్నతీకరణలోనూ అధికారులు తప్పులో కాలేశారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా ఉన్న చోట పీడీలు అవసరం ఉండగా అందుకు భిన్నంగా విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో అధికారులు పోస్టులను ఉన్నతీకరణ చేసి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో పోస్టులను బ్లాక్ చేశారు. ఖిలావరంగల్ మండలంలోని పలు పాఠశాలల్లో పీడీలు అవసరం ఉండగా వాటిని బ్లాక్ చేసి వరంగల్ మండల పరిధిలో తక్కువ సంఖ్యలో విద్యార్థులున్న పాఠశాలల్లో పీడీల పోస్టులను ఓపెన్ చేశారు. దీంతో అధికారుల తప్పిదంతో అవసరమున్న పాఠశాలల్లో పీడీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జాబితా

వరంగల్ డీఈవో డి.వాసంతి

పదోన్నతుల ప్రక్రియలో జిల్లాలో రూపొందించిన ప్రతీ జాబితా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రూపొందించాం. నిబంధనల మేరకు రోస్టర్ విధానాన్ని అనుసరిస్తూ సీనియారిటీ జాబితాలతో పాటు అప్‌గ్రేడ్ చేశాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలల్లో పీడీ పోస్టుల విషయంలో జరిగిన పొరపాటును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వాటిని సైతం ఉన్నతాధికారులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

అవసరం లేని చోట అప్‌గ్రెడేషన్

అవసరం లేని చోట అధికారులు ఎల్పీల పోస్టులను అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయుల తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటం, రెండు తరగతులు మాత్రమే ఉన్న చోట్ల రోస్టర్ విధానం పేరుతో అన్యాయంగా అప్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయులు విమర్శలు చేస్తున్నారు. వరంగల్ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో 6, 7 తరగతుల్లో 15 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా అక్కడ ఎల్పీ పోస్టు అప్‌గ్రేడ్ అవసరం లేకున్నా అధికారులు అనవసరంగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తాం..

- అర్హులందరికీ పీఎం కిసాన్ అందేలా చర్యలు
- కొత్తకొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్


కొత్తకొండలో స్వామివారికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

భీమదేవరపల్లి, జూన్ 21: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే నిలదీస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఎడాపెడా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరిస్తోందన్నారు. శుక్రవారం రాత్రి భీమదేవరపల్లి మండలానికి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ముల్కనూర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు ఆధ్వర్యంలో అర్చ కులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామికి కోడె, గుమ్మడికాయ మొక్కులు చెల్లించారు. వీరభద్రస్వామికి ప్రత్యేకంగా అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆలయ ఆవరణలో బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి సహకరించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత అందరూ అభివృద్ధిపై సహకరించుకోవాలన్నారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి పర్యాటక శోభ తీసుకువస్తామన్నారు. ఇందుకు అవసరమయ్యే నిధులను సమీకరిస్తామన్నారు. కొత్తకొండ దేవాలయ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికను రూపొందించాలని ఈవోను కోరారు.

కాగా, రాష్ట్రంలో 2019 తర్వాత వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ పీఎం కిసాన్ యోజన రావడం లేదని విలేకరులు ప్రశ్నించగా, ఈ విషయాన్ని ప్రధాని మోదీ, వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖతో మాట్లాడి విధి విధానాలు రూపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే భీమదేవరపల్లి ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేపీ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, దొంగల కొంరయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గుండెల్లి సదానందంయాదవ్, గోదల సంపత్, బండారి కరుణాకర్, అంబీరు కవిత, ఊసకోయిల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన ఎమ్డీ నజీర్ (47) మార్బుల్ టైల్స్‌లో కూలిపని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 17న కాజీపేట నుంచి హనుమకొండకు వెళ్తున్న క్రమంలో ఫాతిమా నగర్ వద్ద ఒక లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ లారీతో నజీర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నజీర్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎంలో చేర్పించారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నజీర్ భార్య అంజుమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: రాష్ట్రప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్టు 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి సంబంధించి నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తోంది. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3 లక్షలు మించకుండా ఉన్నవారు అర్హులు. జూలై 10వ తేదీలోపు tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్ మోహన్ సూచించారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

లెక్చరర్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూన్ 21: తెలంగాణ మైనారిటీల గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ల పోస్టులు తెలుగు, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంతోపాటు పీజీటీ ఆంగ్లంలో అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 22 నుంచి 25 వరకు సాయంత్రం 4 గంటల లోపు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ : 80749 94073లో సంప్రదించాలని కోరారు.

జూలై 1 నుంచి ఎస్డీఎల్‌సీఈ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 21: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్సీ సైకాలజీ ఫైనల్ ఇయర్-2023 వార్షిక పరీక్షలు జూలై 1 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1, 3, 5, 8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జూలై 9 నుంచి 14 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రాక్టీకల్ పరీక్షలు జరుగుతాయని గ్రూపుల వారిగా కేటయించిన సమయంలో పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీపై తుమ్మలను కలిసిన టెస్కాబ్ చైర్మన్


మంత్రి తుమ్మలకు వివరాలను తెలియజేస్తున్న మార్నేని

హనుమకొండ సిటీ, జూన్ 21: రైతుల రుణమాఫీ అంశం విషయంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. సహకార బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 7,74,833 ఉన్నట్లు మంత్రికి వివరించారు. రైతులకు లబ్ధిచేకూరేలా నిర్ణయాలు తీసుకోవాలని రవీందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే రవీందర్‌రావు, టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య, డీసీసీ బ్యాంకుల చైర్మన్లు పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

వడ్డెపల్లి, జూన్ 21: మానవహక్కులపై జాతీయ స్థాయి. అవగాహన సదస్సు ఆదివారం ఉదయం 11గంటలకు హనుమకొండ ప్రెస్‌క్లబ్ ప్రాంతంలోని ఆదర్శ లా కాలేజీలో నిర్వహించనున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ రాష్ట్రకార్యదర్శి పోలెపాక మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు సంబంధించి న సంస్థ ప్రతినిధులందరూ ఈ అవగాహన సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

హనుమకొండ టౌన్, జూన్21: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసి బాధితులకు శుక్రవారం రాత్రి అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ వెల్లడించారు. సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్స్ గౌస్‌పాషా, వీరేందర్‌ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.


సీకేఎం కళాశాల మైదానంలో అంతర్జాతీయ యోగా వేడుకలకు హాజరైన విద్యార్థులు, నగరవాసులు

యోగాతో రోజును ప్రారంభించాలి

త్రిదండి చిన్నజీయర్ స్వామి

పోచమ్మమైదాన్, జూన్ 21 : ప్రతీ ఒక్కరు యోగాతోనే తమ రోజును ప్రారంభించాలని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా వేడుకలకు ఆయన హాజయర్యారు. తొలుత హాజరైన వారితో యోగాసనాలు చేయించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వతహాగా యోగా పై దృష్టి సారించాలన్నారు. నిరంతరం యోగా చేయడం ద్వారా వ్యాధులు దరి చేరవని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, డాక్టర్ మురళీకృష్ణ, తుమ్మ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న త్రిదండి చిన్నజీయర్ స్వామి

ఎంజీఎంకు తప్పని విద్యుత్ కష్టాలు


ఎక్స్‌రే విభాగం వద్ద రోగులు

వరంగల్ మెడికల్, జూన్ 21: ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చిన రోగులకు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ వార్డులకు విద్యుత్ సరఫరా జరిగితే తప్ప విద్యుత్ ఉండదు. ఎమర్జెన్సీ వార్డుకు జనరేటర్ ద్వారా సరఫరా చేస్తున్నా సకాలంలో సిబ్బంది స్పందించకపోవడంతో అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం ఎంజీఎం క్యాజువాలిటీ విభాగంలోని ఎమర్జెన్సీ ఎక్స్‌రే విభాగంలో సుమారు గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. అంతేకాకుండా పలు వార్డులకు సైతం కరెంట్ వస్తు పోతూ ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


గణపురం మండలం బస్వరాజుపల్లి గ్రామంలో పత్తి విత్తనాలు వేయగా వర్షం లేని కారణంగా మొలకెత్తకపోవడంతో నీళ్లు పోస్తున్న రైతు కుటుంబం

చూస్తూ ఉండలేక..

కరుణ చూపని వరుణుడు.. వానల కోసం ఎదురుచూస్తున్న రైతులు

వర్షాలు ఊరిస్తున్నాయి. అడపాదడపా జల్లులు తప్ప సరైన వానలు లేకపోవడంతో వానాకాలం సాగు పనులు ముందుకు సాగడం లేదు. సాధారణంగా ఏటా జూన్ మొదటి వారంలోనే వర్షాలు ఆరంభమై సమృద్ధిగా కురిసేవి. కానీ, ఈ ఏడాది జూన్ ముగుస్తున్నా ఇంకా సరైన వర్షాలు పడటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేయగా వానలు లేక అవి మొలకెత్తే పరిస్థితి కనిపించడం లేదు. మొలకెత్తినవి కూడా వడబడుతున్నాయి. దీంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకులు, బిందెలతో నీటిని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలోని పలుప్రాంతాల్లో శుక్రవారం పలువురు రైతులు ఇలా మొక్కలకు నీరు పోయడం కనిపించింది.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

హసన్‌పర్తి, జూన్ 21: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా హసన్‌పర్తికి చెందిన రౌతు రమేశ్ ఇటీవల నియమితులయ్యారు. శుక్రవారం రౌతు రమేశ్‌ను మాల మహానాడు నాయకులు బండి రజినికుమార్, పోతరాజు ప్రభాకర్, దావా రవి, దండ్రి శ్రీనివాస్, పప్పుల రమేశ్‌లు శాలు వా, మెమొంటోలతో సన్మానించారు. ఈయనకు పదవి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.


రమేశ్‌ను సన్మానిస్తున్న మాలమహానాడు నాయకులు

యోగాతో ఒత్తిడి దూరం

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూన్21: ఒత్తిడి నివారణకు, శారీరక, మానసిక ఆరోగ్య రక్షణకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. జిల్లా ఆయుష్, యువజన, క్రీడల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో శుక్రవారం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ సత్య శారదా దేవి, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆయుష్ ఆర్డీడీ రవినాయక్ యోగా చేశారు. జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కేయూ క్రీడామైదానంలో ఘనంగా యోగా సాధన చేపట్టారు. కేయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరై యోగా ప్రాధాన్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరి రామచంద్రం, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య, యోగ సెంటర్ డైరెక్టర్ సుంకరి జ్యోతి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్, నెహ్రూ యువ కేంద్రం అధికారి సీహెచ్ అన్వేశ్, భండారి అష్టాంగ యోగా సమితి నిర్వహాకులు భండారి మొగిలయ్య, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ లీగల్: నిరంతర యోగా సాధనతోనే మానసిక ప్రశాంతత, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన జడ్జిలు నిర్మల గీతాంబ, సిహెచ్.రమేశ్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా సాధన కార్యక్రమంలో జిల్లా జడ్జిలు పాల్గొన్నా రు. పతంజలి సంస్థ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు, న్యాయవాది బి.జితేందర్ యోగా సాధన చేయించారు. రెండు జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, మాతంటి రమేశ్‌బాబు, విజేందర్, రమేశ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా ముఖ్యపాత్ర పోషిస్తుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హసన్‌పర్తి ఉన్నతశ్రేణి ఆరోగ్య కేంద్రంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. అలాగే హసన్‌పర్తి హైస్కూల్, సుజాత విద్యానికేతన్ హైస్కూల్, ఎర్రగట్టుగుట్ట వద్ద గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగా డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 66 వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకూబ్‌పాషా, వైద్యాధికారి ప్రభుదాస్, ఎన్‌హెచ్‌ఎం డీపీవో శ్రీనివాస్, ఆప్తాల్మిక్ అధికారి మల్లారెడ్డి, హెచ్ఈవో రమేశ్, సూపర్‌వైజర్ లచ్చు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హంటర్‌రోడ్డులోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పాల్గొని జిల్లా కార్యవర్గం, కార్యకర్తలతో కలిసి యోగా చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ సత్యనారాయణ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

● హనుమకొండ కలెక్టరేట్: ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో 10వ యోగా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎన్సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థినీ విద్యార్థులు యోగా దినోత్సవంలో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. హనుమకొండ కాపువాడలోని గోల్డెన్ ఓక్ స్కూల్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యోగా మాస్టర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగాసనాలు వేయించారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: యోగాతో మానసిక ప్రశాంతతో పాటు శరీర ధృఢత్వం వస్తుందని మోషన్ జూనియర్ కాలేజ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలేజ్‌లో యోగా గురువు అనూజ్ కపూర్ నేతృత్వంలో విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ సురేష్, సిబ్బంది మురళి, శశిధర్, సాగర్, రాజు, అరుణ్, రవళి, శిల్ప, మమత తదితరులు పాల్గొన్నారు.

● యోగా సాధనతో మానసిక వికాసం విలసిల్లుతుందని శివాని పాఠశాల సెక్రెటరీ తాళ్లపెల్లి స్వామి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హనుమకొండలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. స్కూల్ డైరెక్టర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిట్ క్యాంపస్ ఇండోర్ గేమ్స్ కాంప్లెక్స్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం నిట్ క్యాంపస్‌లో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి ఫ్యాకల్టీ, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.

● వడ్డెపల్లి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద యోగాను నిర్వహించారు. కార్యక్రమంలో బౌద్ధ భిక్షువు బంతే సద్ద రఖిత, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బూర గాంధీ, యోగా గురువు జంగా గోపాల్‌రెడ్డి, వాకర్స్ ప్రతినిధులు యోగా డే ను నిర్వహించారు.


బీజేపీ నాయకులతో కలిసి యోగా చేస్తున్న రావు పద్మ


నిట్‌లో యోగాసనాలు వేస్తున్న డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి


శివాని పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



మోషన్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

● కాజీపేట : కాజీపేట ఫాతిమానగర్ సెయింట్ గ్యాబ్రియేల్ ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు చేశారు.

యువతకు ఉపాధి శిక్షణ

మడికొండ, జూన్ 21: వృత్తి శిక్షణ కోర్సును నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు రాసమల్ల మహేశ్ తెలిపారు. మడికొండ వ్యాసపురి కాలనీలోని వేదవ్యాస పబ్లిక్ స్కూల్ ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సేవాభారతి, గోద్రేజ్ సంస్థల ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఎయిర్ కండీషనర్, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, మైక్రోవేవ్ ఓవెన్ తదితర గృహోపకరణ వస్తువుల రిపేరులో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం యువతకు గోద్రేజ్, ఎల్‌జీ, రిలయన్స్ వంటి ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈనెల 24 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం అవుతాయని ఆసక్తి గల యువత మడికొండలోని సేవాభారతి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్. 90599 07740 నెంబర్‌లో సంప్రదించాలని మహేశ్ కోరారు.

జువైనల్ హోంకు తరలింపు

హనుమకొండ టౌన్, జూన్21: డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ మైనర్‌ను శుక్రవారం జువైనల్ హోమ్‌కు తరలించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మరో ఇద్దరికి న్యాయమూర్తి రమేశ్ రూ.1,100 జరిమానా విధించారన్నారు.

నేడు రైల్వే పెన్షనర్లకు ఉచిత కంటి పరీక్షలు

కాజీపేట, జూన్ 20: కాజీపేట రైల్వే పెన్షనర్ల కార్యాలయంలో రైల్వే పెన్షనర్లకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సంగమయ్య, కార్యదర్శి కె.వి.రావు, కోశాధికారి ఐలయ్య తెలిపారు. శరత్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి హనుమకొండ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్నవారికి ప్రత్యేక రాయితీపై కంటి శుక్లములకు ఆపరేషన్‌లు చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని రైల్వే పెన్షనర్‌లు, కాలనీ వాసులు ఉపయోగించుకోవాలని కోరారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

మడికొండ, జూన్ 21: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం కాజీపేట మండలం కడిపికొండలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 11 గంటలకు సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి శుక్రవారం తెలిపారు. ఏదేని పాఠశాలలో 4వ తరగతి చదువుతూ 9 యేళ్ల లోపు వయస్సు కలిగిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ, స్టడీ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని ఎంఈవో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూన్21: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు యాదవ్‌నగర్ సబ్‌స్టేషన్ బుద్దనగర్ ఫీడర్ పరిధిలోని రెడ్డికాలనీ, కొత్తూర్, కుమార్‌పల్లి, నగరభవన్, పాలజెండా, సెయింట్ జోసెఫ్ స్కూల్ ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

మడికొండ, జూన్ 21: 45వ డివిజన్ కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముచ్చు సాంబయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శుక్రవారం సాంబయ్యను కలిసి పరామర్శించారు. కడిపికొండకు చెందిన కాంగ్రెస్ నాయకుడు దామెరుప్పుల చిన్న వీరయ్య శుక్రవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే కడిపికొండకు చేరుకొని వీరయ్య భౌతిక కాయంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, నాయకులు పోలెపల్లి బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

జీఐఆర్ అమలుకు గల అవకాశాలను పరిశీలించండి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 21: జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఆర్) అమలుకు గల అవకాశాలను పరిశీలించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శుక్రవారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో జియో విస్త టెక్నాలజీ అధికారులతో కలిసి మాట్లాడారు. నిర్వాహణ తీరును కంపెనీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతినిదులు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు జీఆర్ఐ విధానం అమలు వల్ల కలిగే లాభాలను వివరించారు. రోడ్ల నెట్‌వర్క్, నీటి సరఫరా, డ్రైనేజీల స్థితిగతులతో పాటు 66 డివిజన్‌లలో ప్రజల అవసరాలు తెలుసుకునేందుకు ఈ సాంకేతికత బాగా ఉపయోగపడుతుందని అన్నారు. సమావేశం లో జియో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌లు అశోక్‌శర్మ, కాంత్రినగర సీపీ వెంకన్న, ఐటీ రమేష్ పాల్గొన్నారు.

జిల్లా క్రీడా సమాఖ్యను సందర్శించిన డీడీ చంద్రారెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 21: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) చంద్రారెడ్డి శుక్రవారం హనుమకొండలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ)ను సందర్శించారు. అనంతరం జిల్లా క్రీడల అధికారి జి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ క్రీడాంశాలకు చెందిన కోచ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రారెడ్డి పాల్గొని క్రీడల అభివృద్ధి, రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ వసతుల గురించి అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్‌ను, జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్, స్పోర్ట్స్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సమావేశంలో డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, కొత్త ప్రశాంత్, ఎం.డి.అఫ్జల్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, రాయబారపు నవీన్, ఓనపాకల శంకర్, రాజు, ప్రభుదాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బొడ్డు చింతలపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి


ఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న బొడ్డు చింతలపల్లివాసులు

బాలసముద్రం, జూన్ 21: గీసుగొండ మండలం బొడ్డుచింతలపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆర్టీసీ ఆర్ఎం విజయభానుకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. గతంలో బొడ్డుచింతపల్లి మీదుగా తక్కళ్లపాడు వరకు బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం బస్సు నిలిపివేయడంతో విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు వరంగల్ రావడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నార న్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి సైతం ఈ సమస్యను తీసుకెళ్లామని ఆర్ఎంకు వివరించారు. కాంగ్రెస్ నాయకులు కేదాసి మోహన్, జన్నారపు నాగరాజు, ఇందూరి రవి, ఆదిరెడ్డి, సౌరం మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన యూటీఎఫ్ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 21: కలెక్టర్ పి.ప్రావీణ్యను టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కలిశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రావీణ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని కలెక్టర్‌ను వినతిపత్రం అందజేసినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సీహెచ్. రవీందర్‌రాజు, పెండెం రాజు, కోశాధికారి డి. కిరణ్‌కుమార్, కార్యదర్శి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై విద్యార్థుల నిరసనలు



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

కేయూ క్యాంపస్, జూలై 21: నీట్ - 2024 యూజీ ప్రవేశ పరీక్షల్లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ శుక్రవారం కేయూలో పీడీఎస్‌యూ నేతృత్వంలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. కేయూ మొదటి గేటు ఎదుట ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేసి ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ప్లకార్డులు పట్టుకుని ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నీట్ పరీక్ష-2024పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రక్షాళన చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పీడీఎస్‌యూ నేతృత్వంలో పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు నర్సింహ, సూర్య, శివ, సందీప్, తరుణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్వీ నేతృత్వంలో..

కేయూ పరిపాలన భవనం ఎదుట శుక్రవారం ఎన్‌టీఏ అవకతవకలపై టీఆర్ఎస్వీ నేతృత్వంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పరీక్షలను నిర్వహించాల్సిన కేంద్ర పరీక్షల నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అసమర్థంగా పనిచేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు జెట్టి రాజేందర్, కుర్సా అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్, డాక్టర్ పాలమాకుల కొమురయ్య, దేవేందర్, హంస అధ్యక్షుడు గుండు సురేశ్, ప్రభాకర్, తిరుపతి, రమేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అడ్డుకోవాలి

కేయూ క్యాంపస్, జూలై 21: ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అడ్డుకోవాలని బీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ అన్నారు. శుక్రవారం కేయూలో ఏబీఎస్ఎఫ్ వర్సిటీ అధ్యక్షుడు దూడపాక నరేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంద నరేశ్ హాజరై మాట్లాడుతూ.. జిల్లాలో విచ్చలవిడిగా ప్రైవేట్ విద్య సంస్థలు భారీగా ఫీజులను వసూలు చేస్తున్నాయని అన్నారు. ఫీజుల దోపిడీని విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడంలో లేదని మండిపడ్డారు. ఇరుకు గదుల్లో తరగతుల నిర్వహణతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. డొనేషన్లు, పుస్తకాలు, యూనిఫామ్, ఇతర సామగ్రి పేరుతో అధికంగా డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి మచ్చ పవన్‌కల్యాణ్, కేయూ ఉపాధ్యక్షుడు హర్షం చరణ్, భరత్, అశోక్, కిరణ్, నవీన్, సురేశ్, వినయ్, జితేశ్, మంజునాథ్ పాల్గొన్నారు.


అక్రమ కేసు నమోదు

వేలేరు(ధర్మసాగర్) జూన్ 21: పంచాయితీకి వెళ్లినందుకు ఎంపీపీ సమ్మిరెడ్డి తనపై అక్రమంగా వేలేరు పీఎస్‌లో కేసు నమోదు చేయించారని గుడ్లసాగర్‌కు చెందిన గాదె రాజిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం వేలేరు మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పంచాయితీకి వెళ్లిన క్రమంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి తనను సమ్మిరెడ్డి తిట్టారని తెలిపారు. గుడ్లసాగర్ గ్రామంలో తనకు సర్వేనంబర్ 2/ఎఫ్/1లో 38 గుంటల భూమి పట్టా ఉన్నప్పటికీ ఇది ప్రభుత్వ భూమి అని సమ్మిరెడ్డి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. గ్రామంలో భూములు అమ్మినా, కొనుగోలు చేసిన వారి నుంచి అక్రమంగా డబ్బులు తీసుకుంటునాడని, అలాగే దళిత బంధు పేరుతో దళితుల నుంచి డబ్బులు తీసుకొని వారికి తిరిగి ఇవ్వడం లేదని రాజిరెడ్డి తెలిపారు.

యూనిఫాంలు పంపిణీ

ఐనవోలు, జూన్ 21: పంథినిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలవికాస వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. రూ.2లకే 20 లీటర్ల శుద్ధిచేసిన నీటిని అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు యూనిఫాంలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఆనందం, అనురాధ, మాజీ ప్రజాప్రతినిధులు, బాల వికాస ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కాగా, మండలకేంద్రానికి చెందిన బొల్లెపల్లి నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బాధిత కుటుంబసభ్యులను పరామార్శించి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడితో ప్రాణహాని


మాట్లాడుతున్న భూ బాధితులు

ధర్మసాగర్, జూన్ 21: బీజేపీకి చెందిన మాజీ మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డితో తమకు ప్రాణహాని ఉందని ధర్మసాగర్‌కు చెందిన రైతులు బొల్లం వీరస్వామి అలియాస్ వెంకటేశ్వర్లు, గంకిడి తిరుపతిరెడ్డి, ముక్కా రాఘవులు ఆరోపించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మసాగర్ గ్రామానికి చెంది న రైతు వీరస్వామి మాట్లాడుతూ.. మడికొండ శివారులో సర్వేనంబర్ 1912/ఏలో తనకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. 35 ఏళ్ల కిందట కొనుగోలు చేశామని, కాస్తు, కబ్జాలో ఉన్నామని వీరస్వామి తెలిపారు. ఈ భూమిలో వ్యవసాయం చేసుకుంటుండగా ఇటీవల పని నిమిత్తం అమెరికాకు వెళ్లామని తెలిపారు. తిరిగి వచ్చే సరికి తన భూమిని శ్రీనివాస్‌రెడ్డి భూమి సంబంధించిన దా రితో పాటు ఎకరం భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. దీంతో మడికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పెద్దల సమక్షంలో సర్వే చేయించాలని మాట్లాడుకున్నామని తెలిపారు. అయినప్పటికీ గత మూడేళ్ల నుంచి శ్రీనివాస్‌రెడ్డి తమ భూ మిని దున్నుకోనివ్వకుండా, తనను చంపుతామని బెదిరిస్తున్నాడని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 17న తన భూమి వద్దకు వెళ్లగా శ్రీనివాస్‌రెడ్డి కర్రతో తనపై దాడి చేయడంతో తలపగిలి గాయమైందన్నారు. అంతేకాకుండా తనను చంపుతామని శ్రీనివాస్‌రెడ్డితో పాటు వారి కుటుంబసభ్యులు తన వెంట పడుతున్నారని వీరస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. మడికొండ పీఎస్‌కు వెళ్లగా పోలీసులు ఎంజీ ఎంకు చికిత్స నిమిత్తం తరలించారని చెప్పారు. భూ కబ్జాలకు పాల్పడుతున్న శ్రీనివాస్‌రెడ్డిపై అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

జయశంకర్ సార్‌కు నివాళులు

బాలసముద్రం, జూన్ 21: బాలసముద్రంలోని ఏకశిలాపార్కులో శుక్రవారం ఆచార్య జయశంకర్ సార్ 13 వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ విగ్రహానికి వారి కుటుంబసభ్యులతో కలిసి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, తోట వెంకట రాజ్‌కుమార్, బంక సంపత్, వీరగంటి రవీందర్, మాధవిరెడ్డి, ఆనంద్, సతీష్, రమేష్, ఆంజనేయులు, సురేందర్, స్వప్న, రవిప్రసాద్, మేరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

● జయశంకర్ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ నివాళులర్పించారు. ఏకశిలా పార్కులో విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకల్లో పాల్గొని జయశంకర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్ధోజు విద్యాసాగర్, దేవాచారి, ఎర్రోజు భిక్షపతి, శృంగారపు వెంకన్న, నర్సింహాచారి, బ్రహ్మాచారి, సారంగపాణి, అంజనేయులు, శ్రీధర్, సూర్యప్రకాష్, రమేష్, విద్యసాగర్, రాజు, బాలాజీ పాల్గొన్నారు

జయశంకర్ సార్ బాటలో నడుస్తాం

రాంనగర్: తెలంగాణ ఉద్యమంలో దిక్సూచిగా నిలిచిన జయశంకర్ సార్ చూపిన బాటలో పయనిస్తామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ తెలిపారు.


జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న వినయభాస్కర్

హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జయశంకర్ 13వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వినయభాస్కర్‌తోపాటు పలువురు నేతలు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏకశిల పార్కులోని జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ శ్వాస, ధ్యాసగా జీవించిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో దిక్సూచిగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు మర్రి యాదవరెడ్డి, లక్ష్మీనారాయణ, జోరిక రమేశ్, నయీమ్, జనార్ధన్‌గౌడ్, సారంగపాణి, పులి రజనీకాంత్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన ఏపీ అసెంబ్లీ

172 మంది ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం.. ప్రతిజ్ఞ నెరవేర్చుకున్న టీడీపీ అధినేత.. సీఎం హోదాలోనే అసెంబ్లీలోకి

- మొదటిసారి అసెంబ్లీలోకి పవన్ కల్యాణ్
- సభకు అలా వచ్చి ఇలా వెళ్లిపోయిన జగన్

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభ కొలువుదీరింది. దాని తొట్టతొలి సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొత్త ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సహా మొత్తం 172 మంది శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన, బీజేపీ, వైసీపీ సభ్యులు అందరూ ప్రమాణం చేశారు. టీడీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు వ్యక్తిగత కారణాలతో మొదటి రోజు సభకు హాజరు కాలేకపోయారు. వారు శనివారం ప్రమాణం చేస్తారు. కాగా ప్రభుత్వం నిర్ణయించుకున్న ముహూర్తం ప్రకారం ఉదయం 9.26 గంటలకు సభ ప్రారంభమైంది. తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పవన్, లోకేశ్ సభలోకి వస్తుండగా.. కూటమి ఎమ్మెల్యేలంతా కరతాళ ధ్వనులతో స్వాగతం పలికారు. సభలోకి రాగానే వారిద్దరూ ఒకింత ఉద్వేగానికి గురయ్యారు. ఇక.. సీఎంగానే సభలోకి అడుగుపెడతానని రెండున్నరేళ్ల క్రితం శపథం చేసిన చంద్రబాబు దానిని నెరవేర్చుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలోనే సభలోకి వచ్చారు. అసెంబ్లీ ప్రధాన ద్వారం ముందు మెట్ల వద్ద నడుం వంచి నమస్కరించి, పూలు చల్లి లోపల అడుగు పెట్టారు. కరతాళ ధ్వనులతో కూటమి ఎమ్మెల్యేలంతా ఆయన్ను ఘనంగా స్వాగతించారు. 'ప్రజాస్వామ్యం గెలిచింది', 'గౌరవ సభలోకి స్వాగతం', 'బాస్ ఈజ్ బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. బాబు సభలోకి రాగానే పవన్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడంతో సభ మరోసారి చప్పట్లతో మార్మోగింది. జాతీయ గీతాలాపనతో ప్రొటెం స్పీకర్ సభను ప్రారంభించారు. 9.51 గంటలకు మొదట చంద్రబాబు ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి పవన్ ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం లోకేశ్ తన తండ్రి చంద్రబాబుకు పాదాభివందనం చేశారు. మంత్రులు ప్రమాణం చేసిన తర్వాత ఆలస్యంగా సభలోకి వచ్చిన జగన్.. తమ ఎమ్మెల్యేల పక్కన కూర్చున్నారు. కూటమి ఎమ్మెల్యేల్లో బీజేపీకి చెందిన విష్ణుకుమార్‌రాజు ఒక్కరే ఆయన వద్దకు వెళ్లి పలుకరించారు. మహిళా సభ్యుల తర్వాత జగన్ ప్రమాణం చేశారు. అనంతరం బయటకు వెళ్లిపోయారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా ప్రమాణం చేసిన తర్వాత వెళ్లిపోయారు. మిగతా వైసీపీ ఎమ్మెల్యేలు సభలోనే ఉన్నారు. కాగా.. ఉదయం సభలో అడుగుపెట్టినప్పటి నుంచి సభ వాయిదాపడేవరకు పవన్ సభలోనే గడిపారు. సభ నిర్వహణ, కార్యకలాపాలను ఆసాంతం పరిశీలించారు. ప్రమాణస్వీకారం చేసిన ప్రతి ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం అనంతరం ఆయన వద్దకు వచ్చి నమస్కారం చేయడంతో ఆయన కూడా వారందరికీ అభినందనలు తెలిపారు. ప్రొటెం స్పీకర్ సభను వాయిదా వేసిన తర్వాత ఎమ్మెల్యేలంతా ఆయన వద్దకు చేరారు. చాలా మంది సభలోనే ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు దిగారు. పవన్ కూడా ఓపిగ్గా అందరితో మాట్లాడుతూ ఫొటోలు దిగారు.



అసెంబ్లీలో బాబు, పవన్ ఆలింగనం

చంద్రబాబు శపథం నెరవేరింది: భువనేశ్వరి

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు శపథం నెరవేరినందుకు ఆయన సతీమణి నారా భువనేశ్వరి సంతోషాన్ని వ్యక్తం చేశారు. నాటి శాసనసభలో శపథం చేసిన చంద్రబాబు.. నేడు అదే సభలో ముఖ్యమంత్రి హోదాలో అడుగు పెట్టడంపై భువనేశ్వరి శుక్రవారం స్పందించారు. 'నేడు గౌరవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు' అంటూ ఒక వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. 'నిజం గెలిచింది... ప్రజాస్వామ్యం నిలిచింది... తెలుగు ప్రజలకు ప్రణామం' అని భువనేశ్వరి పేర్కొన్నారు.

మద్యం మత్తులో.. మహిళతో అసభ్య ప్రవర్తన

- ఆరుగురిపై కేసు నమోదు

ఖానాపూర్, జూన్ 21: కోడిగుడ్ల కోసం వెళ్తున్న ఓ వివాహిత పట్ల కొందరు ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించారు. ఆమెను కాపాడేందుకు వచ్చిన వారిపై దాడి చేశారు. ఈ ఘటన నిర్మల్ జిల్లాలో గురువారం జరిగింది. కడెం మండలం ఉప్పరిగూడెంలో ఓ వివాహిత అంగన్‌వాడీ కేంద్రానికి బయల్దేరింది. మార్గమధ్యలో చెరువు కట్టపై నుంచి వెళ్తుండగా.. అక్కడే మద్యం తాగుతున్న గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులతో పాటు వారి స్నేహితులు మరో ముగ్గురు కలిసి ఆమెను వెంబడించారు. ఆమెతో అసభ్యకరంగా మాట్లాడుతూ దురుసుగా ప్రవర్తించారు. దీంతో భయంతో ఆమె పరుగులు తీసింది. విషయాన్ని తన బాబాయ్, తమ్ముడికి ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఘటనా స్థలానికి వచ్చిన వారు మహిళను అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. వివాహిత బంధువులపై అల్లరి మూక దాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

ఇదేం సభా మర్యాద?

- సభ్యులు ప్రమాణం చేస్తుండగా మధ్యలోనే జగన్ జంప్
- మందడం గుండా రావడానికి ముఖం చెల్లక అసెంబ్లీకి వెనుక దారిలో వచ్చిన మాజీ సీఎం

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): ఏపీలో అధికారానికి దూరమైనా.. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శాసనసభకు, తోటి శాసనసభ్యులకు ఏ మాత్రం గౌరవం ఇవ్వలేదు. సభ్యుల ప్రమాణ స్వీకారం ముగియక ముందే.. ఎమ్మెల్యేగా తాను మాత్రం ప్రమాణం చేసేసుకుని సభ నుంచి వెళ్లిపోయారు. సభలోకి ఆలస్యంగా వచ్చిన జగన్.. కొద్దిసేపు వెనుక వరుసలో అప్పటికే ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలతో పాటు కూర్చున్నారు. తన పేరును ప్రమాణ స్వీకారం కోసం పిలవగానే వేదిక వద్దకు వెళ్లారు. తడబడుతూ ప్రమాణం చదివారు. 'శాసనసభ్యునిగా ఎన్నికైన జగన్‌మోహన్ అనే నేను' అని తొలుత చదివారు. అంతలోనే సర్దుకుని.. 'జగన్మోహన్‌రెడ్డి అనే నేను' అని చదివారు. ప్రమాణం ముగిశాక బయటకు వెళ్లిపోయారు. కాసేపు గతంలో డిప్యూటీ స్పీకర్‌కు కేటాయించిన చాంబర్లో కూర్చుని నిష్క్రమించారు. సభ మర్యాదలు, సంప్రదాయాల మేరకు సహచర సభ్యుల ప్రమాణ స్వీకారం పూర్తయి.. ప్రొటెం స్పీకర్ సభను వాయిదావేసేవరకు సభ్యులందరూ సభలోనే ఉంటారు. ఈ మర్యాదను జగన్ పాటించలేదు.

అటు రావడానికి ముఖం చెల్లక..

తాడేపల్లి నివాసం నుంచి శుక్రవారం ఉదయం 8.45 గంటలకు జగన్ అసెంబ్లీకి బయల్దేరారు. సీడ్ యాక్సెస్ రోడ్ నుంచి నేరుగా హైకోర్టుకు వెళ్లే దారిలోకి వెళ్లి.. దొడ్డిదోవన అసెంబ్లీ రోడ్డులోకి వచ్చారు. కరకట్ట మీదుగా మందడం గ్రామానికి వచ్చేందుకు ఆయనకు ముఖం చెల్లలేదు. మూడ్రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అటు వస్తున్నప్పుడు మందడం ప్రజలు దారిపొడవునా పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. తానూ ఇదే దారిలో అసెంబ్లీకి వెళితే పూలు చల్లడం మాట అటుంచితే.. రాజధాని ప్రజల నుంచి అవమానాలు ఎదురవుతాయని భావించారో.. లేదంటే ముఖం చెల్లకేమో.. వెనుక దారిలో అసెంబ్లీకి వచ్చారు.

నేటి సభాపతి ఎన్నికకూ దూరం

స్పీకర్‌గా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఈ విషయాన్ని ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సభలో లాంఛనంగా ప్రకటిస్తారు. ఆ వెంటనే సభలోని అన్ని పార్టీల నేతలు స్పీకర్‌ను సభాధ్యక్ష స్థానానికి తోడ్కొని వెళ్లడం సంప్రదాయం. అయితే జగన్ ఈ కార్యక్రమంలో పాల్గొనబోవడం లేదు. ఎందుకంటే ఆయన శనివారం పులివెందులకు వెళ్తున్నారు. ఇది నూతన సభాపతినే గాక.. యావత్ సభనే అవమానించినట్లేనని టీడీపీ వర్గాలు అంటున్నాయి.

జగన్‌కు సముచిత గౌరవం

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి శాసనసభలో సముచిత రీతిలో గౌరవం లభించింది. వైసీపీకి 11 సీట్లు మాత్రమే రావడంతో జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా లభించలేదు. అయితే తమ నేతకు సభలో కొంత ప్రాధాన్యమివ్వాలని వైసీపీ శాసనసభాపక్షం సభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌కు లేఖ రాసింది. ఆయన ఆ విషయం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జగన్ పట్ల ఉదారంగా, గౌరవంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. ఎమ్మెల్యేలు తమ వాహనాలను శాసనసభ ప్రాంగణం బయటే ఉంచి అక్కడ దిగి నడుచుకుంటూ రావాలి. కానీ జగన్ తన వాహనంలోనే సభ ప్రాంగణంలోకి రావడానికి అనుమతించాలని చంద్రబాబు సూచించారు. దీంతో సభా భవనం ప్రధాన ద్వారం వరకూ ఆయన వాహనాన్ని అనుమతించారు. ఎమ్మెల్యేగా ప్రమాణం చేసే సమయంలో ఆయన మిగిలిన సభ్యులతోపాటు అక్షర క్రమంలో తన పేరు వచ్చినప్పుడు మాత్రమే ప్రమాణం చేయాల్సి ఉంటుంది. అయితే ఆ విషయంలో కూడా ఆయనకు చంద్రబాబు మినహాయింపు ఇచ్చారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రమాణం తర్వాత ఆయనతో చేయించాలని సూచించారు. అయితే జగన్ ఆలస్యంగా సభలోకి వచ్చారు. దీంతో ఆయన వచ్చినప్పుడు ఇతర ఎమ్మెల్యేలను కాసేపు ఆపి.. జగన్‌కు అవకాశమిచ్చారు. కాగా, జగన్ సభకు వచ్చినప్పుడు హుందాగా వ్యవహరించాలని, వ్యతిరేక నినాదాలు వంటివి చేయవద్దని చంద్రబాబు ముందే టీడీపీ ఎమ్మెల్యేలకు సూచించారు.

ఏపీ స్పీకర్‌గా అయ్యన్న ఏకగ్రీవ ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు పాల్గొన్నారు. ఒకటే నామినేషన్ దాఖలు కావడంతో అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవ ఎన్నిక ఖరారైంది. శనివారం సభలో ఆయన ఎన్నికను అధికారికంగా ప్రకటిస్తారు. ఆయన ఎన్నికతో ఈసారి శాసనసభ సమావేశాలు ముగియనున్నాయి. శాసనసభ శనివారం ఉదయం పదిన్నరకు ప్రారంభం కానుంది. ముగ్గురు ఎమ్మెల్యేలు శుక్రవారం తమ ప్రమాణ స్వీకారం చేయలేదు. శనివారం ఉదయం మొదట ఆ ముగ్గురితో చేయిస్తారు. ఆ తర్వాత పదకొండు గంటలకు స్పీకర్ ఎన్నిక జరుగుతుంది.

అసెంబ్లీలోకి ఏడోసారి... స్పీకర్‌గా...

బీఏ చదివిన అయ్యన్న 1983లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 10 సార్లు అసెంబ్లీకి, రెండు సార్లు (1996, 98లో) పార్లమెంట్‌కు పోటీ చేశారు. 1983, 1985, 1994, 1999, 2004, 2014, 2024 ఎన్నికల్లో... మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1996లో లోక్‌సభ సభ్యుడిగా ఒకసారి గెలిచారు. ఐదు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా పని చేశారు. 1985-87 మధ్య ఎన్టీఆర్ కేబినెట్‌లో సాంకేతిక విద్య, క్రీడల శాఖల మంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన అయ్యన్న 1994-96 మధ్య రోడ్లు, భవనాల శాఖ, 1999-2004 మధ్య అటవీశాఖ, 2014-17 మధ్య పంచాయతీరాజ్‌శాఖ, 2017-19 మధ్య రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఇప్పుడు 7వ సారి అసెంబ్లీలో అడుగుపెట్టి స్పీకర్‌గా ఎన్నికయ్యారు.



సభను హుందాగా నడుపుతా: అయ్యన్న

స్పీకర్ అనేది పదవి కాదు, బాధ్యత అని నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సభాపతి పదవి రాజకీయాలకు అతీతం. సభలో శాసనసభ్యులందరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తా. ప్రతిపక్ష పార్టీ సభ్యులకూ తగిన అవకాశం ఇస్తా. సభను హుందాగా నడుపుతా.' అని అన్నారు.

రేప్ చేసి.. కర్రలతో కొట్టి చంపేసి

- బాపట్ల జిల్లాలో యువతిపై హత్యాచారం
- బహిర్భూమికి వెళ్లినప్పుడు దుర్ఘటన
- సీఎం దిగ్భ్రాంతి.. రూ.10 లక్షలు పరిహారం

బాపట్ల, అమరావతి (ఆంధ్రజ్యోతి), చీరాల, జూన్ 21: బహిర్భూమికి వెళ్లిన యువతిపై గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై కర్రలతో తలపై మోది అత్యంత పాశవికంగా హత్య చేశారు. ఈ దారుణం ఏపీలోని బాపట్ల జిల్లా చీరాల మండలంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఓ గ్రామానికి చెందిన యువతి(21) శుక్రవారం తెల్లవారుజామున సమీపంలోని రైలుపట్టాల వైపు బహిర్భూమికి వెళ్లింది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం కర్రలతో ముఖంపై బాది హత్యచేశారు. చెవులకున్న కమ్మలు లాక్కెళ్లారు. ఎంతసేపటికీ కుమార్తె ఇంటికి రాకపోవటంతో అనుమానం వచ్చిన తండ్రి వెళ్లి చుట్టుపక్కల వెతికారు. రైలు పట్టాల సమీపంలో కుమార్తె విగతజీవిగా కనిపించింది. మృతురాలిది చేనేత కుటుంబం. ఎనిమిదేళ్ల క్రితం నెల్లూరు జిల్లా నుంచి వలస వచ్చింది. బాధితురాలు ఇంటర్ చదువు ఆపేసి. మిషన్ నేర్చుకుని కుటుంబానికి చేదోడుగా ఉంటోంది. కాగా, సీఎం చంద్రబాబు ఆదేశాలతో పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

తీవ్రంగా స్పందించిన సీఎం చంద్రబాబు

యువతి హత్యాచారం విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. వెంటనే ఘటన స్థలానికి వెళ్లి బాధితులకు ధైర్యం చెప్పాలని అసెంబ్లీలో ఉన్న హోంమంత్రి వంగలపూడి అనితను ఆదేశించారు. దీంతో హోంమంత్రి వెంటనే గ్రామానికి చేరుకుని.. హతురాలి తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం చీరాల ఏరియా వైద్యశాలలో బాధితురాలి మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. యువతిపై హత్యాచారం చేసిన నిందితులను 48 గంటల్లో పట్టుకుని కోర్టులో హాజరు పరచాల్సిందిగా పోలీసులను ఆదేశించినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. బాధిత కుటుంబానికి సత్వర సాయం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారాన్ని హోంమంత్రి అనిత చీరాల ఎమ్మెల్యే కొండయ్యకు అందించి ఆ కుటుంబానికి ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత ఆయన బాధిత కుటుంబాన్ని కలిసి ఆ రూ.10లక్షల చెక్కును అందజేశారు.

పోలీసుల అదుపులో భారతీరెడ్డి పీఏ!

అమరావతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతీరెడ్డి అండతో గత ఐదేళ్లుగా సోషల్ మీడియాలో చెలరేగిపోయిన ఆమె వ్యక్తిగత సహాయకుడు వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులు, టీడీపీలోని మహిళా నేతలను అతడు చాలా నీచంగా ట్రోల్ చేశాడు. జగన్‌తో విభేదించిన నేరానికి ఆయన చెల్లెళ్లు షర్మిలారెడ్డి, వివేకానందరెడ్డి కుమార్తె సునీతపైనా ఇతడు దారుణమైన వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. సభ్యత ఉన్నవారెవరూ చదవడానికి వీల్లేని భాషలో అతడి పోస్టులు ఉండేవి. ఇలా ఎన్నో చండాలపు పోస్టులు పెట్టిన రవీంద్రారెడ్డిని.. పులివెందులలో వైఎస్ఆర్ అభిమానులు తన్నేందుకు సిద్ధమయ్యారు. దీంతో అతడు భయపడిపోయి.. 'అబ్బే అదంతా మార్ఫింగ్' అంటూ పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేసి డ్రామాకు తెర తీశాడు. అతడి నీచ భాషను సహించలేక వివేకా కుమార్తె సునీత హైదరాబాద్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ మహిళావిభాగం అధ్యక్షురాలు (ప్రస్తుత హోం మంత్రి) వంగలపూడి అనిత, టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఉండవల్లి అనూషపై అనుచిత వ్యాఖ్యలతో హల్‌చల్ చేశాడు. ఆస్పత్రిలో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఒక జనసేన బీసీ నాయకురాలిపై నీచమైన వ్యాఖ్యలు చేశాడు. అతడిపై ఏపీ పోలీసులకు గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయింది. అతడు తనపై పెట్టిన పోస్టుతో ఆగ్రహించిన అనిత అప్పట్లో సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. అనిత హోం మంత్రి అయిన వెంటనే విలేకరుల సమావేశంలో రవీంద్రారెడ్డిపై విరుచుకు పడ్డారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం నాడు పులివెందుల-కదిరి మధ్యలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోంది.



రవీంద్రారెడ్డి

చెల్లితో రాజీకి తల్లిని కోరిన జగన్

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

అమరావతి, జూన్ 21(ఆంధ్రజ్యోతి): తన ఓటమికి చెల్లెలు షర్మిలే కారణమని జగన్ గ్రహించారని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మాట్లాడారు. 'చెల్లెలు షర్మిలతో రాజీ చేయాలని జగన్ తన తల్లిని కోరాడు. అప్పుడు జగనే కాంగ్రెస్‌లో చేరాలని షర్మిల చెప్పేసింది. త్వరలోనే వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డి అరెస్టు అవుతారు. తర్వాత కడపలో జరిగే ఉప ఎన్నికల్లో భూపేశ్‌రెడ్డి టీడీపీ తరఫున పోటీ చేసి గెలుస్తారు. ఓదార్పు యాత్ర కోసం జగన్ తక్కువలో తక్కువ 14 కారణాలు వెతుకుతారు. ఏ దారి దొరక్కపోతే ఓదార్చడానికి జగన్ బాధితులను సృష్టించుకుంటారు. బీజేపీలో చేరేందుకు స్వయంగా మిథున్‌రెడ్డే బీజేపీ అగ్ర నాయకత్వంతో టచ్‌లోకి వెళ్లారు. తనతో పాటు బీజేపీలో చేరాల్సిందిగా తన తండ్రి పెద్దిరెడ్డి మీద కూడా ఆయన ఒత్తిడి తెస్తున్నారు. వైసీపీ ఖాళీ కావడం ఖాయంగా కనిపిస్తోంది. బీజేపీ ఒప్పుకుంటే అవినాశ్‌రెడ్డి మినహా వైసీపీ ఎంపీలంతా పార్టీ మారడానికి రెడీగా ఉన్నారు. బీజేపీ నాయకత్వం మాత్రం వాళ్ల అక్కర్లేదని అంటోంది' అని ఆదినారాయణరెడ్డి అన్నారు.

నటి వరలక్ష్మి శరత్‌కుమార్ త్వరలోనే వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. కొన్ని రోజులుగా సినీ ప్రముఖులను కలసి తన పెళ్లికి ఆహ్వానిస్తున్నారు. శుక్రవారం ఆమె తన కాబోయే భర్త నికోలయ్ సచ్‌దేవ్‌తో కలసి అల్లు అర్జున్‌కు పెళ్లి పత్రిక అందించారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను వరలక్ష్మి సోషల్ మీడియాలో షేర్ చేశారు.



'నోర్మూసుకొని వెళ్లు'



'ఎవరు ఏమనుకున్నా డోంట్ కేర్ నా జీవితం నా ఇష్టం' అంటారు శ్రుతీ హాసన్. తన వ్యక్తిగత జీవితం గురించి ఎవరైనా అమర్యాదకరంగా మాట్లాడినా లైట్ తీసుకోకుండా అప్పటికప్పుడు ఘాటుగా సమాధానమిస్తుంటారు శ్రుతి. తాజాగా ఆమె సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించారు. ఈ క్రమంలో ఓ నెటిజన్ 'దక్షిణాదియాసలో ఏదైనా చెప్పండి' అని ఆమెను అడిగారు. బదులుగా శ్రుతి 'మాపై జాతి వివక్షను చూపించొద్దు. ఇడ్లీ, దోశ, సాంబార్ లాంటి పేర్లతో మమ్మల్ని పిలవడం సరికాదు. ఎలా పడితే అలా పిలుస్తుంటే సరదాగా తీసుకోం. దక్షిణాది భాషలో ఏదైనా చెప్పమన్నావు కదా 'నోర్మూసుకోని వెళ్లు'' అని తమిళంలో బదులిచ్చారు. అయితే అనంత్ అంబానీ పెళ్లి వేడుకల్లో షారూఖ్‌ఖాన్ రామ్‌చరణ్‌ను వేదికపైకి ఆహ్వానించే క్రమంలో 'ఇడ్లీ వడ' అని పిలిచాడు. ఆ సంఘటనను దృష్టిలో ఉంచుకొనే ఇప్పుడు శ్రుతి ఇలా స్పందించి ఉంటారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం శ్రుతీహాసన్ 'సలార్ 2', 'డకాయిట్', 'చెన్నై స్టోరీ' చిత్రాల్లో నటిస్తున్నారు.



ఈసారి కూడా ఓటమి లేదు

'ఇప్పటిదాకా ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు, ఈ సారి కూడా ఓడిపోను, బాగా ప్రిపేరయ్యి వచ్చాను... చూసుకుందాం రా' అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నారు ప్రభాస్. భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ' చిత్రం కోసం ప్రభాస్ చెప్పిన డైలాగ్ ఇది. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా డేరింగ్ స్టంట్స్ చేశారు. కమల్‌హాసన్ పూర్తిగా సరికొత్త లుక్‌లో ఆశ్చర్యపరిచారు. బుజ్జితో కలసి ప్రభాస్ చేసిన సాహసాలు, పోరాట ఘట్టాల్లో దిశా పటానీ మెరుపులతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రభాస్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.



ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతం

ఇటీవలే ముంబైలో 'కల్కి' చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అమితాబ్ బచ్చన్ నిర్మాత సి. అశ్వనీదత్ పాదాలకు నమస్కరించబోగా, ఆయన సున్నితంగా వారించారు. ఆ తర్వాత అమితాబ్ పాదాలకు అశ్వనీదత్ నమస్కరించారు. అమితాబ్ లాంటి దిగ్గజ నటుడు తన వయసు, స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి నిర్మాతకు ఎంతో గౌరవం ఇస్తూ పాదాభివందనం చేయడం ఆయన సంస్కారం, గొప్ప మనసుకు నిదర్శనం అని నెటిజన్లు కొనియాడారు. ఆ సంఘటనపై నిర్మాత అశ్వనీదత్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అసలు అమితాబ్ ఆ రోజు ఈవెంట్‌లో అలా చేస్తారని తాను ఊహించలేదని చెప్పారు. 'నేను తేరుకొని ఆయనకు ప్రతి నమస్కారం చేయడానికి కొంచెం సమయం పట్టింది. అమితాబ్ బచ్చన్ భారతీయ సినిమా యోధుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వానికి మరోసారి అభివందనం చేస్తున్నాన'ని తెలిపారు.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా రజనీకాంత్



తమిళ అగ్రహీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్ యాక్షన్ బాట పట్టారు. 'విక్రమ్', 'జైలర్' చిత్రాలతో వీరిద్దరూ తమిళంలోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాలు అందుకున్నారు. దీంతో తదుపరి చిత్రాలు కూడా ఇదే జానర్లో చేస్తున్నారు. మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్' కూడా యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండబోతోంది. అలాగే శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'భారతీయుడు 2' చిత్రంలో పోరాట ఘట్టాలపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. 'జైలర్' ఊపులో రజనీకాంత్ సైతం ఇలాంటి చిత్రాలకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ జ్ఞానవేల్ రాజా దర్శకుడు ఇందులో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. చిత్రీకరణ చివరి దశలో ఉంది. 'వేట్టయాన్' తర్వాత రజనీకాంత్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రం చేస్తున్నారు. అయితే రజనీకాంత్ ఈ సినిమాలో కూడా ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గానే కనిపించనున్నారని కోలీవుడ్ టాక్. మానవ అక్రమ రవాణాను అడ్డుకునే నిజాయితీపరుడైన పోలీస్ ఆఫీసర్‌గా, క్రిమినల్స్‌ను ఏరివేసేందుకు ఎంతకైనా తెగించే ఖాకీగా ఆయన శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారట. ఇది రజనీకాంత్ 171వ చిత్రం. సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సత్యరాజ్ కీలకపాత్ర పోషిస్తున్నారు.



పీరియాడిక్ యాక్షన్ డ్రామా


'విరుపాక్ష', 'బ్రో' చిత్రాల తర్వాత సాయిదుర్గ తేజ్ నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. చుట్టూ ల్యాండ్ మైన్లు, మధ్యలో ఎడారి భూమిలో ఓ పచ్చని చెట్టు.. ఉన్న ఈ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుందని పోస్టర్ చూడగానే అర్థమవుతుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'గ్రాండ్ స్కేల్‌లో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో సాయి పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం' అని చెప్పారు.

నాకై నేనే తప్పిపోయా

తమిళ హీరో విజయ్ ఆంటోనీ నటిస్తున్న తాజా చిత్రం 'తుపాన్'. పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జానర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి విజయ్ మిల్టన్ దర్శకుడు. ఇంతకుముందు విజయ్ ఆంటోనీతో 'రాఘవన్', 'హత్య' చిత్రాలను నిర్మించిన కమల్ బోరా, డి.లలిత, ప్రదీప్, పంకజ్ బోరా ఈ సినిమాను తీస్తున్నారు. ఈ చిత్రం కోసం భాష్యశ్రీ రాసిన 'వెతికా నేనే నా జాడే నిలిచి.. నాకు నేనై తప్పిపోయా' అంటూ సాగే పాటను హరి దఫూషియా సంగీత దర్శకత్వంలో మాష్మీ నేహా పాడారు. 'తుపాన్' చిత్రానికి ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని దర్శక నిర్మాతలు చెప్పారు. మేఘా ఆకాశ్ ఈ చిత్ర కథానాయిక.



షారూఖ్‌తో హ్యాట్రిక్ చిత్రం



షారూఖ్‌ఖాన్, దర్శకుడు ఫర్హాన్ అక్తర్ కలయికలో త్వరలోనే మరో చిత్రం రాబోతోందనే మాట కొన్నాళ్లుగా బాలీవుడ్ మీడియాలో వినిపిస్తోంది. దీనిపై ఫర్హాన్ అక్తర్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. కచ్చితంగా తమ కలయికలో ఓ చిత్రం ఉంటుందని చెప్పారు. గతంలో వీరిద్దరి కలయికలో 'డాన్ 2, లక్ బై ఛాన్స్' చిత్రాలు వచ్చాయి. మరోసారి వీరి కాంబినేషన్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. 'డాన్ 3'లో షారూఖ్ నటిస్తారని అభిమానులు భావించారు. అయితే ఆయన స్థానంలో రణ్‌వీర్‌సింగ్ రావడం షారూఖ్ అభిమానులను నిరాశ పరిచింది. ఈ నేపథ్యంలో తమ కాంబినేషన్‌లో త్వరలోనే ఓ చిత్రం వస్తుందని ఫర్హాన్ చెప్పారు. బాద్ షా అభిమానుల అంచనాలకు తగ్గట్టుగా ఈ చిత్రం ఉంటుందన్నారు. 'డాన్ 3' పూరయ్యాక ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది.



మా ఊరు శ్రీకాకుళం..


'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు, ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం' పాటను దర్శకుడు హరీశ్ శంకర్ విడుదల చేశారు. శ్రీకాకుళం గొప్పతనం వివరిస్తూ రామజోగయ్య శాస్త్రి రాసిన పాటను మంగ్లీ పాడారు. సునీల్ కశ్యప్ స్వరపరిచారు. ఈ సందర్భంగా హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా టైటిల్ ఫన్నీగా ఉంది. మోహన్ రచయితగా నాకు చాలా కాలం నుంచి తెలుసు. పాట విజువల్స్ బాగున్నాయి. మంగ్లీ బాగా పాడింది. వెన్నెల కిశోర్ నుంచి ఒక డిఫరెంట్ సినిమా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా' అన్నారు. ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, ఫొటోగ్రఫీ: మల్లికార్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేశ్ రామ్, సమర్పణ: లాస్య రెడ్డి.

ఫ్రెండ్స్‌తో పెళ్లి పార్టీ



బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షిసిన్హా పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. ఈనెల 23న ఆమె తన ప్రియుడు జహీర్‌ను పెళ్లాడబోతున్నారు. పెళ్లికి ముందు తన స్నేహితురాళ్లకు సోనాక్షి సిన్హా పార్టీ ఇచ్చారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ముంబై శివార్లలోని విలాసవంతమైన రిసార్ట్‌లో వివాహ కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం హల్దీ వేడుకను నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు బాలీవుడ్ మీడియా తెలిపింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు కొద్దిమంది మాత్రమే ఈ పెళ్లికి హాజరవుతున్నారు. తన కూతురు సోనాక్షి పెళ్లి విషయం తనకు చెప్పనేలేదన్న శత్రుఘ్నసిన్హా ఆ తర్వాత మాత్రం ఈ పెళ్లికి హాజరవుతున్నట్లు తెలిపారు. జహీర్, ఆయన కుటుంబ సభ్యులతో శత్రుఘ్న సిన్హా దిగిన ఫొటోలను సోనాక్షి సోషల్ మీడియాలో షేర్ చేశారు.

బుజ్జిమేక.. బుజ్జిమేక



గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'పొట్టేల్'. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రధారులు. సాహిత్ మోత్ఖూరి దర్శకుడు. ఇప్పటివరకూ విడుదలైన మూడు పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా నాలుగో పాటను శుక్రవారం విడుదల చేశారు. 'బుజ్జి మేక.. బుజ్జిమేక' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, కాలభైరవ పాడారు. శేఖర్‌చంద్ర స్వర పరిచారు. పాటలో విజువల్స్ ఆకట్టుకొనేరీతిలో ఉన్నాయి. హార్ట్ టచింగ్ సాంగ్‌గా దర్శకుడు చిత్రీకరించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ నడిగే నిర్మాతలు.

రివర్స్ లవ్‌స్టోరీ



ఆంగ్లంలో 'లవ్' అనే నాలుగు అక్షరాలను రివర్స్ చేస్తే 'ఈవోల్' అని వస్తుంది. ఆ టైటిల్‌తో ఓ రివర్స్ లవ్‌స్టోరీ వస్తోంది. సూర్య శ్రీనివాస్, శివ బొడ్డురాజు హీరోలుగా, జెన్నిఫర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో దర్శకనిర్మాత రామ్ యోగి వెలగపూడి శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ 'ఇద్దరు స్నేహితుల మధ్య కుదిరిన అవగాహన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. వాణిజ్య విలువలతో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించాను. హైదరాబాద్, వైజాగ్‌లో షూటింగ్ జరిగింది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఫొటోగ్రఫీ: తేడా బ్యాచ్ సినిమా టీమ్, ఎడిటింగ్: విజయ్.

తక్కువ శ్రమతో గరిష్ఠ ప్రయోజనం

ప్రపంచ శ్రేయస్సుకు యోగా ఓ సాధనం.. యోగా దినోత్సవంలో మోదీ!



యోగా దినోత్సవ వేడుకల్లో భారత సైనికులు



శ్రీనగర్‌లో మోదీ యోగాసనాలు

శ్రీనగర్, జూన్ 21: "ప్రపంచవ్యాప్తంగా యోగా అభ్యాసకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. నేను సమావేశమైన ప్రతి దేశాధినేత యోగా ప్రయోజనాల గురించి మాట్లాడుతున్నారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని పెంపొందించి.. వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడే మార్గం ఇది. అనేక సవాళ్లకు పరిష్కారం చూపుతుంది. తక్కువ శ్రమతో గరిష్ఠ లాభం పొందే విధానం యోగా" అని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం ప్రపంచ శాంతికి యోగాను ఓ సాధనంగా చూస్తున్నారని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన 101 ఏళ్ల చార్లెట్ చోపిన్ ఎన్నడూ భారత్‌ను సందర్శించలేదని, కానీ, యోగా విశిష్టతను తెలుసుకుని జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఫ్రాన్స్‌లో యోగా వ్యాప్తికి కృషి చేసిన ఆమెను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించామని వివరించారు. శుక్రవారం ప్రపంచ పదో యోగా దినోత్సవం సందర్భంగా శ్రీనగర్‌లోని షేర్-ఎ-కశ్మీరీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ప్రఖ్యాత దాల్ సరస్సు ఒడ్డున 7 వేలమందితో ప్రధాని ఆసనాలు వేసేలా తలపెట్టిన కార్యక్రమ వేదిక వర్షం కారణంగా మారింది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, 2015లో యోగా గురించి తొలిసారి ప్రస్తావించామని, అప్పటినుంచి క్రమంగా మార్పు మొదలైందన్నారు. సమాచార విప్లవ కాలంలో ప్రజలకు ఏకాగ్రత కుదరడం లేదని.. దానికి పరిష్కారమే యోగా అని ప్రధాని చెప్పారు. విశ్వవ్యాప్తమైన యోగా గురించి తెలుసుకునేందుకు భారత్‌కు వేలాదిమంది విదేశీయులు వస్తున్నారని చెప్పారు. కేరళ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో యోగా టూరిజం జరుగుతోందని పేర్కొన్నారు. వ్యక్తిగత శిక్షకులను పెట్టుకుని మరీ సాధన చేస్తున్నారని, సంస్థల్లోనూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఓ విధంగా యోగా సరికొత్త జీవనోపాధులు సృష్టించిందని చెప్పారు. కాగా, యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొని ఆసనాలు వేశారు. ఐఎన్ఎస్ విక్రమాదిత్య యుద్ధ నౌకపైనా యోగాసనాలు వేశారు. అమెరికాలోని ప్రఖ్యాత న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో భారత కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో వేలమంది ఆసనాలు సాధన చేశారు.

లోకం తీరు



కల్తీసారా మృతులు 52

చెన్నై, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కరుణాపురం కల్తీసారా మృతుల సంఖ్య శుక్రవారం 52కు పెరిగింది. మరో 112 మంది బాధితులు పుదుచ్చేరి, విల్లుపురం, కళ్లకుర్చి, సేలం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇందులో 20 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు ప్రకటించారు. కాగా కళ్లకుర్చిలో కల్తీసారా విక్రయాల వ్యవహారానికి సంబంధించి పోలీసులు మొత్తం ఆరుగురిని అరెస్టు చేశారు. కల్తీసారా కారణంగా 52 మంది మృతి చెందిన ఘటన శుక్రవారం అసెంబ్లీలో ప్రకంపనలు రేపింది. ఈ ఘటనకు బాధ్యత వహించి స్టాలిన్ సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అన్నాడీఎంకే ఎమ్మెల్యేలంతా నల్లచొక్కాలు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. నినాదాలు చేశారు. దీంతో సభ గందరగోళంగా తయారవడంతో స్పీకర్ అప్పావు అన్నాడీఎంకే, పీఎంకే సభ్యులను సభ నుంచి మార్షల్స్ చేత గెంటేయించారు. కాగా, కల్తీసారా దుర్ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన పిల్‌పై విచారణ చేపట్టిన మద్రాస్ హైకోర్టు.. ఈ మరణాలకు ఎవరు బాధ్యులని ప్రభుత్వాన్ని నిలదీసింది. కల్తీసారాను అరికట్టేందుకు తీసుకున్న చర్యలేంటో చెప్పాలని ఆదేశించింది.

పిల్లల బాధ్యత ప్రభుత్వానిదే: స్టాలిన్

కళ్లకుర్చిలో కల్తీసారా తాగి మృతి చెందిన వారి పిల్లల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని సీఎం స్టాలిన్ ప్రకటించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు డిగ్రీ చదివే వరకు అయ్యే విద్యా సంబంధిత ఫీజులు, హాస్టల్ ఫీజులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి, సంరక్షకుడి పెంపకంలో ఉండే పిల్లలకు ప్రతి నెలా రూ.5వేల చొప్పున, వారికి 18 యేళ్ల వయస్సు వచ్చే వరకు ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేశారు. అంతేగాక పిల్లల పేరుమీద రూ.5లక్షలు డిపాజిట్ చేసి, వారికి 18 యేళ్ల వయస్సు వచ్చినప్పుడు వడ్డీతో సహా ఆ మొత్తాన్ని అందిస్తుందని తెలిపారు.

నెట్ ప్రశ్నపత్రం లీక్ చేసిన చానెళ్లను నిషేధించాం: టెలిగ్రాం

న్యూఢిల్లీ, జూన్ 21: యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాల లీకేజీలో భాగస్వాములైన చానెళ్లపై కఠిన చర్యలు తీసుకున్నట్లు టెలిగ్రాం సంస్థ తెలిపింది. "పరీక్ష ప్రశ్నపత్రాలను సర్క్యులేట్ చేసిన అన్ని చానెళ్లను నిషేధించాం. పేపర్ లీకేజీపై ప్రభుత్వ సంస్థల విచారణకు పూర్తిగా సహకరిస్తాం. చట్టాలకు అనుగుణంగా పనిచేస్తాం" అని టెలిగ్రాం సంస్థ ప్రతినిధి శుక్రవారం తెలియజేశారు. చట్టబద్ధమైన ప్రభుత్వ సమాచారం సర్క్యులేషన్‌కు సంబంధించి తమ హెల్ప్‌డెస్క్‌కు ఎప్పుడు ఫిర్యాదు అందినా న్యాయపరమైన తనిఖీలు చేసి, ఐటీ చట్టం 2000 ప్రకారం దాన్ని తొలగిస్తామని వెల్లడించారు. యూజీసీ-నెట్‌ను ఈ నెల 18న దేశవ్యాప్తంగా రెండు విడతల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. 9 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. అయితే నెట్ ప్రశ్నపత్రాలు డార్క్‌నెట్‌లో అందుబాటులోకి వచ్చాయని, వాటిని టెలిగ్రాంలో సర్క్యులేట్ చేశారని పరీక్ష జరిగిన మరుసటి రోజే యూజీసీకి ఫిర్యాదు అందాయి. దీంతో పరీక్షను రద్దు చేశారు.

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్ష వాయిదా

న్యూఢిల్లీ, జూన్ 21 : నీట్ పేపర్ లీకేజీపై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీయే) మరో పరీక్షను వాయిదా వేసింది. ఈ నెల 25, 27 తేదీల్లో నిర్వహించాల్సిన జాయింట్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ అండ్ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీఎస్ఐఆర్-యూజీసీ నెట్)ను వాయిదా వేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అత్యున్నత విద్యా సంస్థల్లో సైన్స్ కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు అర్హత పరీక్షగా ఎన్టీయే ప్రతీ ఏటా జూన్, డిసెంబరులో సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ నిర్వహిస్తుంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో జూన్ విడత పరీక్షను వాయిదా వేసినట్టు వెల్లడించింది. యూజీసీ-నెట్ పరీక్షను రద్దు చేసిన రెండ్రోజులకే ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం.

ప్రియాంకకు మద్దతుగా మమత ప్రచారం

కోల్‌కతా, జూన్ 21: కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనున్న ప్రియాంక గాంధీ తరఫున ప్రచారం చేయడానికి టీఎంసీ అధినేత్రి మమత వెళ్లనున్నారు. రెండు పార్టీల మధ్య సఖ్యత కుదిరింది. లోక్‌సభ ఎన్నికల రెండు పార్టీల మధ్య దూరం పెరగడంతో గాంధీ కుటుంబం తరఫున ప్రత్యేక దూతగా సీనియర్ నాయకుడు పి.చిదంబరం ఇటీవల కోల్‌కతా వచ్చి రాష్ట్ర సచివాలయంలో మమతతో చర్చలు జరిపారు. తర్వాత పరిస్థితుల్లో మార్పులు కనిపించాయి. మమత పట్ల బద్ధ విరోధిగా వ్యవహరించిన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి కూడా మెత్తబడ్డారు. మమతతో తనకు ఎలాంటి వ్యక్తిగత విద్వేషాలు లేవని స్పష్టం చేశారు. రాజకీయంగానే ఆమెను వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. కాగా, నూతన క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలని ప్రధాని మోదీకి మమత లేఖ రాశారు.

జమ్మూకశ్మీర్‌లో ఓటర్ల జాబితా సవరణ

న్యూఢిల్లీ, జూన్ 21: హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలను మొదలు పెట్టామని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆయా రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాను సవరించనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. జూలై 1వ తేదీ వరకూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు స్పష్టం చేసింది. హరియాణా, మహారాష్ట్రల ప్రస్తుత అసెంబ్లీ కాల పరిమితి నవంబరు 3, 25 వరకూ ఉంది. జార్ఖండ్ అసెంబ్లీ కాల పరిమితి జనవరి 5, 2025 వరకూ ఉంది. జమ్మూకశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన తరువాత కొత్త అసెంబ్లీని ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా, కేంద్ర ప్రభుత్వం 2019, ఆగస్టులో ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించింది. ఆ ప్రక్రియ తరువాత జరగబోయే ఈ ఎన్నికలు ఆ రాష్ట్రానికి తొలి ఎన్నికలు అవుతాయి.

హిందూజాలకు స్విట్జర్లాండ్ కోర్టు జైలు శిక్ష

జెనీవా, జూన్ 21: బ్రిటన్‌లో అత్యంత సంపన్నుల్లో ఒకరిగా పేరుగాంచిన హిందూజా కుటుంబంలోని ప్రకాష్ ఆయన భార్య కమల్, కుమారుడు అజయ్, కోడలు నమ్రతకు స్విట్జర్లాండ్ క్రిమినల్ కోర్టు శుక్రవారం నాలుగు నుంచి నాలుగున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రవాస భారతీయులైన వీరికి జెనీవాలో విలాస భవనం ఉంది. పిల్లల సంరక్షణ, ఇంటి పని కోసం అందులో భారతీయులను నియమించుకున్నారు. వారితో రోజుకు 18 గంటలు పనిచేయిస్తూ, వేతనంగా రూ.667 (ఏడాదికి రూ.2.43 లక్షలు) మాత్రమే చెల్లిస్తున్నారని, ఈ మొత్తం హిందూజాల పెంపుడు కుక్కపై వెచ్చిస్తున్నదాని (రూ.8.30 లక్షలు) కంటే తక్కువని, సిబ్బంది పాస్‌పోర్ట్‌లను స్వాధీనం చేసుకున్నారని కేసు నమోదైంది. స్వల్ప వేతనాలపై రాజీ కుదిరినా.. పాస్‌పోర్ట్‌లను స్వాధీనం చేసుకోవడాన్ని స్విట్జర్లాండ్‌లో మానవ అక్రమ రవాణాగా పరిగణిస్తారు. దీంతో హిందూజాలకు శిక్ష పడింది.

రోహిణి సింధూరి భూములు ఆక్రమించారని ఫిర్యాదు

బెంగళూరు, జూన్ 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. తమ ట్రస్టు పేరిట ఉన్న భూములను ఆక్రమించారని ఆమెపై ప్రముఖ బాలీవుడ్ సింగర్ లక్కీ అలి కర్ణాటక లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. న్యూ యలహంక టౌన్ పరిధిలో తమ ట్రస్టు భూమిని రోహిణి సింధూరి మద్దతుతో ఆమె భర్త సుధీర్ రెడ్డి, మరిది మధుసూదన్ రెడ్డి ఆక్రమించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తద్వారా రోహిణి సింధూరి తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గతంలో ఐఏఎస్ అధికారి డీకే రవి ఆత్మహత్య సందర్భంలో సింధూరిపై పలు ఆరోపణలు వచ్చాయి. ఇటీవల ఐపీఎస్ అధికారిణి రూపా మౌద్గల్, రోహిణి సింధూరి మధ్య తలెత్తిన వివాదం సుప్రీం కోర్టు దాకా వెళ్లిన విషయం తెలిసిందే.

గర్భస్రావాలకు యూఏఈలో చట్టబద్ధ అనుమతి

దుబాయ్, జూన్ 21: గర్భస్రావ చట్టంలో కీలక మార్పులు చేస్తూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొంది. అత్యాచారానికి గురయినవారు, వావివరసలు లేకుండా అక్రమ సంబంధాలు పెట్టుకోవడం ద్వారా గర్భం దాల్చిన మహిళలకు ఊరట కలిగించింది. అలాంటి వారు గర్భస్రావం చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. మహిళల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. అయితే ఇందుకు కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అత్యాచారానికి, అక్రమ సంబంధానికి బలయిన వెంటనే వారు తొలుత సంబంధిత అధికార్లకు తెలియజేయాల్సి ఉంది. దీన్ని రుజువు చేస్తూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం నుంచి నివేదిక తీసుకురావాలి. పిండం వయసు 120 రోజులకు మించనప్పుడు మాత్రమే అబార్షన్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఏడాది పాటు యూఏఈలో నివసించే వారికే ఇది వర్తిస్తుంది.

హజ్ యాత్రలో 98 మంది భారతీయుల మృతి

న్యూఢిల్లీ, జూన్ 21: ఈ ఏడాది సౌదీ అరేబియాలో హజ్ యాత్ర సందర్భంగా వేర్వేరు కారణాలతో 98 మంది భారతీయులు మరణించినట్టు కేంద్రప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. ఈ ఏడాది 1,75,000 మంది భారతీయ యాత్రికులు హజ్ కోసం మక్కాను సందర్శించినట్టు తెలిపింది. కాగా, సౌదీ అరేబియాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో హజ్ యాత్రలో వడదెబ్బతో పది దేశాలకు చెందిన 1,081 మంది యాత్రికులు చనిపోయినట్టు తెలిసింది.

నీట్ పరీక్ష నిర్వహణలో అడుగడుగునా లోపాలు

పలు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల్లేవు.. ప్రశ్నపత్రాలు ఉంచే గదులకు భద్రత కరువు

- పరిశీలకుల థర్డ్ పార్టీ రివ్యూలో వెల్లడి
- నీట్ కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీం నో
- 1563 మంది అభ్యర్థులకు రేపు మళ్లీ పరీక్ష



నీట్‌కు వ్యతిరేకంగా యూపీలో నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, జూన్ 21: 'నీట్' పరీక్ష నిర్వహణలో అడుగడుగునా లోపాలున్నాయని థర్డ్ పార్టీ రివ్యూలో తేలింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కలిపి దాదాపు 4 వేల కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. రివ్యూలో భాగంగా వాటిలో 399 కేంద్రాల్లో థర్డ్ పార్టీ పరిశీలకులు తనిఖీలు చేశారు. నిబంధనల ప్రకారం.. నీట్ పరీక్ష జరిగే ప్రతి గదిలోనూ పనిచేసే రెండు సీసీ కెమెరాలు ఉండాలి. ఆ సీసీ కెమెరాలను ఢిల్లీలోని ఎన్టీఏ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి.. అక్కడున్న నిపుణులు పర్యవేక్షిస్తారు. కానీ.. థర్డ్ పార్టీ తనిఖీ చేసిన 399 సెంటర్లకు గాను 186 కేంద్రాల్లోని (46%) తరగతి గదుల్లో పనిచేసే సీసీ కెమెరాలు లేవు. అలాగే, ప్రశ్నపత్రాలను ఉంచే స్ట్రాంగ్ రూములకు గార్డులతో పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయాల్సి ఉండగా.. 68 కేంద్రాల్లో (16%) అలాంటి ఏర్పాట్లు కనిపించలేదని వెల్లడైంది. 83 కేంద్రాల్లో.. ఉండాల్సిన బయోమెట్రిక్ సిబ్బందికి బదులుగా వేరే వ్యక్తులు ఉన్నట్టు గుర్తించారు. కాగా.. నీట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. నీట్ నిర్వహణలో జరిగిన అక్రమాల నేపథ్యంలో.. ఆ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌ను కూడా.. జూలై 8న చేపట్టే మిగతా పిటిషన్లతో కలిపి విచారిస్తామని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలపాలని కేంద్రానికి జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి (ఎన్టీఏ) నోటీసులిచ్చింది. అయితే, విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది.. జూలై 6 నుంచి నిర్వహించతలపెట్టిన నీట్ కౌన్సెలింగ్‌ను రెండు రోజులపాటు వాయిదా వేసేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. మొత్తం నీట్ పిటిషన్లన్నీ కలిపి 8వ తేదీన విచారించాలని ధర్మాసనం నిర్ణయించినందున, అప్పటిదాకా వాయిదా కోరుతున్నట్టు వివరించారు. ఈ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది.

మళ్లీ రాయనివ్వండి ప్లీజ్..

'హైపర్ హైడ్రోసిస్'(విపరీతంగా చెమటలు పట్టడం) అనే ఆరోగ్య సమస్య కారణంగా తాను మే 5న జరిగిన నీట్ పరీక్ష సరిగ్గా రాయలేకపోయానని.. 1563 మంది విద్యార్థులకు మళ్లీ జూన్ 23న పరీక్ష నిర్వహించడానికి ఎన్టీఏ సిద్ధమైనందున.. తనకు కూడా ఆరోజు మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పించాలంటూ హైదరాబాద్‌కు చెందిన ఒక విద్యార్థి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం విచారణకు స్వీకరించింది. ఎగ్జామ్ సెంటర్‌లోకి కర్చీఫ్‌ను కూడా తీసుకెళ్లనివ్వలేదని.. దీనివల్ల తన క్లయింట్ పరీక్షా కేంద్రంలో పెన్నును సరిగ్గా పట్టుకోలేకపోయాడని విద్యార్థి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో.. ఆ విద్యార్థి అభ్యర్థనపై ఏదో ఒక నిర్ణయం తీసుకుని, (శుక్రవారం) సాయంత్రం నాలుగు గంటల్లోగా అతడికి ఆ విషయాన్ని తెలుపాలని కోర్టు ఎన్టీఏను ఆదేశించింది. ఇదిలా ఉండగా, 1563 మంది అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను ఉపసంహరించుకుని, వారికి మళ్లీ పరీక్ష పెడతామని కోర్టుకు తెలిపిన ఎన్టీఏ.. అందుకు ఏర్పాట్లు చేసింది. మేఘాలయ, హరియాణా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, చండీగఢ్‌లోని కేంద్రాల్లో.. రకరకాల కారణాల వల్ల వీరందరికీ పరీక్ష రాయడం ఆలస్యమైంది. ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లో ఏడు కేంద్రాల్లో ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్టు ఎన్టీఏ అధికారి ఒకరు తెలిపారు.

నిరసనల వెల్లువ..

నీట్, యూజీసీ-నెట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో.. విద్యార్థి సంఘాలు, విపక్షాలూ వరుసగా రెండోరోజు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. కాంగ్రెస్ పార్టీ అన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. నీట్ పేపర్ లీక్ అంశాన్ని పార్లమెంటులో తాను లేవనెత్తుతానని ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ, ఆయన మంత్రుల చేతగానితనం కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. "గడిచిన ఏడేళ్లలో 70 పేపర్లు లీకయ్యాయి. రెండు కోట్ల మంది యువత ఆ లీకుల వల్ల నష్టపోయారు" అని రాహుల్ ఆ వీడియోలో అన్నారు. బీజేపీ పాలనలో పేపర్‌లీక్‌లు జాతీయ సమస్యగా మారాయని కాంగ్రెస్ నేత ప్రియాంక మండిపడ్డారు.

ఆటోమేటిగ్గా గ్రీన్‌కార్డు

- అమెరికా కాలేజీల్లో చదివే విదేశీ విద్యార్థులందరికీ లక్కీ చాన్స్!
- గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే మంజూరు
- మాజీ అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదన



వాషింగ్టన్, జూన్ 21: అమెరికా అధ్యక్ష ఎన్నికల ముంగిట మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త వలస విధానాన్ని ప్రతిపాదించారు. అమెరికా కళాశాలల్లో చదివే విదేశీ విద్యార్థులందరికీ గ్రీన్‌కార్డు(శాశ్వత నివాస కార్డు)లు మంజూరుచేస్తామని ప్రకటించారు. గ్రాడ్యుయేషన్ పూర్తికాగానే ఆటోమేటిగ్గా గ్రీన్ కార్డు అందుకునేలా పాలసీ తీసుకొస్తానని తెలిపారు. దీనివల్ల చైనా, భారతీయ విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుంది. వాస్తవానికి ఈ కొత్త పాలసీ ఆయన గత వైఖరికి భిన్నంగా ఉంది. ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా స్వదేశీ విధానం.. 'బై అమెరికన్.. హైర్ అమెరికన్'ను కఠినంగా అమలు చేశారు. అత్యంత నైపుణ్య సిబ్బంది, విద్యార్థుల వలసలపై కఠిన ఆంక్షలు విధించారు. ఇప్పుడు ప్రవాస భారతీయులు, చైనీయుల మద్దతు కూడగట్టుకునేందుకు వైఖరి మార్చారని అంటున్నారు. గురువారం ఆయన వెంచర్ క్యాపిటలిస్టులు, టెక్ ఇన్వెస్టర్లతో పాడ్‌క్యాస్ట్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. జూనియర్ కాలేజీలు సహా అమెరికాలో ఏ కాలేజీలో చదివినా డిప్లొమాలో భాగంగా గ్రీన్‌కార్డు కూడా అందుతుందన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలవడం కోసం నిపుణులందరూ అమెరికాలోనే నివసించడం అవసరమని పేర్కొన్నారు. అయితే, అమెరికా ప్రయోజనాలకు నష్టం కలిగించే కమ్యూనిస్టులు, ర్యాడికల్ ఇస్లామిస్టులు, హమాస్ మద్దతుదారులు, అమెరికా విద్వేషకులు, నేరాభియోగాలు ఉన్నవారికి ఇది వర్తించదని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రతిపాదన చట్టమైతే.. గ్రీన్‌కార్డుల సంఖ్య భారీగా పెరుగుతుందని.. ఏటా 10 లక్షల మంది చైనా, భారత్ విద్యార్థులకు అమెరికా విద్యావకాశాలు కల్పిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్ ఆకస్మికంగా కొత్త పాలసీ ప్రతిపాదించడానికి ముఖ్యమైన కారణమే ఉంది. అధ్యక్షుడు, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ గత మంగళవారం కొత్త వలస కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. దీనిప్రకారం అమెరికన్ పౌరులను వివాహమాడేవారికి చట్టబద్ధమైన నివాస హక్కు, పౌరసత్వ హక్కు కల్పిస్తామన్నది దాని సారాంశం. ఇది బైడెన్‌కు, అధికార డెమోక్రాటిక్ పార్టీకి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చే అవకాశం ఉండడంతో.. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ ఆటోమేటిక్ గ్రీన్‌కార్డు విధానం ప్రతిపాదించారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి.

కేజ్రీవాల్ బెయిల్‌పై స్టే

తాత్కాలికంగా నిలిపివేసిన ఢిల్లీ హైకోర్టు

- 2-3 రోజుల్లో నిర్ణయం వెలువరిస్తామన్న న్యాయమూర్తి



న్యూఢిల్లీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు స్థానిక కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. దీంతో శుక్రవారం తిహాడ్ జైలు నుంచి విడుదల కావాల్సిన కేజ్రీవాల్ జైలులోనే ఉండిపోయారు. గురువారం రాత్రి కేజ్రీవాల్‌కు బెయిల్ లభించిన నేపథ్యంలో శుక్రవారం ఉదయమే ఈడీ.. విచారణ కోర్టు ఆదేశాలను హైకోర్టులో సవాల్ చేసింది. జస్టిస్ సుధీర్‌కుమార్ జైన్ దీనిపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఈడీ తరఫున వాదనలు వినిపించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు.. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన విచారణ కోర్టు న్యాయాధికారి నియయ్‌బిందుపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనకు పూర్తిగా వాదనలు వినిపించటానికి అవకాశం ఇవ్వలేదన్నారు. తాము అప్పటికే సమర్పించిన పత్రాలను కూడా న్యాయాధికారి పరిశీలించలేదని, ఆ పత్రాలు చాలా ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించారని చెప్పారు. కేసును త్వరగా ముగించేద్దామన్న ఆదుర్దాతో న్యాయాధికారి వ్యవహరించారని ఆరోపించారు. అహేతుకంగా, ఏకపక్షంగా ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈడీ ప్రత్యక్ష సాక్ష్యాలు సమర్పించలేదన్న కోర్టు అభిప్రాయం సరైనది కాదని, మాగుంట శ్రీనివాసులురెడ్డి కేజ్రీవాల్‌ను కలిసినప్పుడు రూ.వంద కోట్లు డిమాండ్ చేశారని, ఈ విషయం మాగుంట వాంగ్మూలంలో ఉందన్నారు. గోవా అసెంబ్లీ ఎన్నికల కోసం రూ.45 కోట్లు మళ్లించారని సాక్ష్యాలతో నిరూపించినా క్రింది కోర్టు విస్మరించిందని అన్నారు. ఈ వాదనలను కేజ్రీవాల్ తరఫు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, విక్రమ్ చౌదరి ఖండిస్తూ వాదనలు వినిపించారు. విచారణ కోర్టులో ఈ కేసుపై ఐదు గంటల పాటు విచారణ జరిగితే.. అందులో 3 గంటల 45 నిమిషాల సమయం న్యాయాధికారి ఈడీకి ఇచ్చారని చెప్పారు. దేశంలోని పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ ఈడీకి పట్టదని, బెయిల్ గురించి చట్టం స్పష్టంగా చెబుతోందని, కానీ, ఈడీ వ్యవహారం 'నా మాట వినకుంటే జైలుకే' అన్నట్లుగా ఉందన్నారు. అనుకూల తీర్పు ఇవ్వకపోతే జడ్జినే నిందించడం దారుణమన్నారు. విచారణ కోర్టు ఇచ్చిన ఆదేశాలను అహేతుకం అని ఈడీ న్యాయవాది అభివర్ణించటాన్ని తప్పుబడుతూ.. బావిలో కప్పలా తయారైన ఈడీకి అలా అనిపిస్తున్నట్టుంది అని ఎద్దేవా చేశారు. ఈ కేసుకు సంబంధించి కేజ్రీవాల్‌కు ఒక్క పైసా లభించినట్లుగా కూడా ఈడీ ఇప్పటివరకూ ఒక్క ఆధారమూ సేకరించలేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ సుధీర్ కుమార్ జైన్.. ఈ కేసుకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి 2-3 రోజుల్లో నిర్ణయం వెలువరిస్తానని చెప్పారు. అప్పటి వరకూ విచారణ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 24వ తేదీలోపు ఇరుపక్షాలు లిఖితపూర్వక వాదనలు సమర్పించాలన్నారు. కేసును జూలై 10కి వాయిదా వేశారు.

ఢిల్లీ మంత్రి అతిషి నిరాహార దీక్ష

ఢిల్లీలో రోజురోజుకు నీటి సంక్షోభం ముదురుతోంది. హరియాణా నుంచి దక్కాల్సిన నీటి వాటాను డిమాండ్ చేస్తూ ఆ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అతిషి దక్షిణ ఢిల్లీలోని భోగల్‌లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు. అంతకుముందు సునీత కేజ్రీవాల్, మంత్రి సౌరభ్ భరద్వాజ్, ఎంపీ సంజయ్ సింగ్ ఇతర పార్టీ నేతలతో కలసి రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. అతిషి దీక్ష ప్రారంభించిన అనంతరం.. కేజ్రీవాల్ జైలు నుంచి పంపిన సందేశాన్ని సునీత చదివి వినిపించారు. అతిషి చేపట్టిన దీక్ష విజయవంతమవుతుందని కేజ్రీవాల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

యెడియూరప్పకు ఎలా?

ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక మాజీ సీఎం యెడియూరప్పకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ యాంటిసిపేటరీ బెయిల్ లభించిందని, కిడ్నాప్ కేసు ఎదుర్కొంటున్న హెచ్‌డీ రేవన్నకు బెయిల్ లభించిందని.. కానీ, కేజ్రీవాల్, హేమంత్ సోరేన్‌లకు లభించలేదని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కపిల్ సిబల్ పేర్కొన్నారు. దేశంలో నియంతృత్వం అన్ని హద్దులనూ దాటిందని కేజ్రీవాల్ భార్య సునీత విమర్శించారు.

దడ పుట్టిస్తున్న ధరలు!

భారత్‌లో ఆహార ధరోల్బణం.. మండిపోతున్న కూరగాయల రేట్లు

- పాలు, పప్పు దినుసుల ధరలు పైపైకి
- వర్షాభావం, వేడిగాలుల ప్రభావం
- 'నైరుతి' ముందే వచ్చినా జోరందుకోని సాగు
- ఆగస్టు వరకూ ధరలు తగ్గుదల లేనట్టే!



న్యూఢిల్లీ, జూన్ 21: భారత్‌లో ఆహార ధరోల్బణం నెలకొంది. కూరగాయలు, పప్పుదినుసులు, పాలు.. ఏది కొందామన్నా ధరలు దడ పుట్టిస్తున్నాయి. ప్రతికూల వాతావరణం, వర్షాభావం, తీవ్రమైన వడగాడ్పుల కారణంగా కూరగాయలు, తృణధాన్యాల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దీంతో గతేడాది నవంబరు నుంచి దేశంలో వార్షిక ఆహార ద్రవ్యోల్బణం 8శాతంగా ఉంది. ఈ ఏడాది రుతుపవనాలు ముందే వచ్చినప్పటికీ ఈ నైరుతి సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందనే అంచనాలు ఉన్నా ఆగస్టు వరకు ద్రవ్యోల్బణం తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఆహార ఉత్పత్తుల ధరల పెరుగుదల కారణంగా వినియోగదారులు అధికంగా ఖర్చుచేయాల్సి వస్తోంది.

ఆహార ద్రవ్యోల్బణానికి కారణం?

గతేడాది కరువు, ఈ ఏడాది ఇంకా కొనసాగుతున్న వడగాడ్పులతో పప్పుదినుసులు, కూరగాయలు, తృణధాన్యాల ఉత్పత్తి, సరఫరా గణనీయంగా తగ్గింది. దీంతో ధరలు పెరిగిపోయాయి. దీని నుంచి ఉపశమనం కోసం ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించినా, దిగుమతులపై సుంకాలు తగ్గించినా పెద్దగా ప్రభావం చూపడంలేదు. సాధారణంగా వేసవిలో కూరగాయల ఉత్పత్తి తక్కువ ఉంటుంది. ఈ ఏడాది అది మరింత ఎక్కువగా కనిపిస్తోంది. దేశంలోని దాదాపు సగం ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4-9 శాతం అధికంగా నమోదవుతున్నాయి. దీనివల్ల పండించిన, నిల్వ చేసిన కూరగాయలు త్వరగా పాడైపోతున్నాయి. ఈ ఏడాది అధిక వేడి, నీటి ఎద్దడి కారణంగా నారు పోయడానికి, నాట్లు వేయడానికి ఆటంకం ఏర్పడింది. ఉల్లి, టమాటా, వంకాయ, ఆకుకూరల సాగుకి వేడి వాతావరణం ఆటంకం కలిగిస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం వార్షిక ద్రవ్యోల్బణం కూరగాయలకు 28శాతం, పప్పుధాన్యాలకు 17శాతం, తృణధాన్యాలకు 8.6శాతం, మాంసం, చేపలకు 8.2శాతం, సుగంధ ద్రవ్యాలకు 7.8శాతం, గుడ్లకు 7.1శాతంగా ఉంది.

రుతుపవనాలు వచ్చినా ఎందుకీ పరిస్థితి?

నైరుతి రుతుపవనాలు ఈసారి ముందే భారత్‌లోకి ప్రవేశించాయి. దేశమంతా వేగంగానే పురోగమించాయి. అయితే ఆరంభంలో ఉన్న వేగం ఆ తర్వాత క్షీణించింది. దీంతో ఈ నైరుతి సీజన్‌లో ఇప్పటి వరకు 18శాతం లోటు వర్షపాతం నమోదైంది. రుతుపవనాల బలహీనతకు వడగాడ్పులు తోడవడంతో పంటలసాగు ఆలస్యమవుతోంది. ముఖ్యంగా వరి, పప్పుధాన్యాలు, కూరగాయలు, సోయాబీన్స్ సాగుపై తీవ్ర ప్రభావంపడింది. జూలై తొలివారంలో వర్షాలు పెరిగితే లోటు వర్షపాతం నుంచి బయటపడొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా రుతుపవనాలు పుంజుకుని దేశవ్యాప్తంగా విస్తరించి వర్షాలు కురిస్తే ఆగస్టు నుంచి కూరగాయల ధరలు తగ్గే అవకాశం ఉంది. అయితే జూలై, ఆగస్టు నెలల్లో వరదలు లేదా ఎక్కువ రోజులు కొనసాగే పొడి వాతావరణం పంట ఉత్పత్తులపై ప్రభావం చూపొచ్చు. దీంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా ఉండదు కాబట్టి పాలు, తృణధాన్యాలు, పప్పు దినుసుల ధరలు ఇప్పట్లో తగ్గే అవకాశం కనిపించడం లేదు. గోధుమల ఉత్పత్తి క్షీణించినా ప్రభుత్వం దిగుమతి చేసుకునే చర్యలు తీసుకోలేదు. దీంతో వాటి ధరలు మరింత పెరిగే చాన్స్ ఉంది. ధాన్యం కనీస మద్దతు ధరను ప్రభుత్వం 5.4 శాతం పెంచడంతో బియ్యం ధరలు పెరగొచ్చు. గతేడాది కరువుతో కంది, మినుములు, శనగల సరఫరా తగ్గింది. ఈ సీజన్‌లో ఆ పంటలు పండి మార్కెట్‌కు చేరేవరకు వాటి ధరలు తగ్గే అవకాశం ఉండదు. ఆహార ద్రవ్యోల్బణం నేపథ్యంలో కొన్ని ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు విధించడం, దిగుమతులకు సుంకా న్ని తగ్గించడంవంటి చర్యలను కేంద్రం చేపట్టింది. ధరల తగ్గుదలకు ఇది కొంతమేర సహాయపడుతుంది.



ఏరువాక పౌర్ణమి సందర్భంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో కాడెడ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న రైతులు

ఏరువాక పున్నమ.. సాగుకు పోదమా!

చేనులో విత్తనాలు అలికే రోజుకన్నా రైతుకు శుభప్రదమైన రోజు ఇంకేముంటుంది? మరి.. దుక్కులు దున్నేందుకు, విత్తనాలు అలికేందుకు రైతన్నకు ఉపయోగపడేవి కాడెడ్లే కదా! నాగలికి అలపట, దాపట ఎడ్లను కట్టి శివారు దిశగా రైతన్న లాంచనంగా కదిలేది ఏరువాక పున్నమ రోజే! శుక్రవారం ఏరువాక పున్నమను రైతన్నలు వేడుకగా జరుపుకొన్నారు. ఎడ్లను చెరువుల వద్దకు తీసుకెళ్లి.. శుభ్రంగా స్నానం చేయించి.. ఇంటికి తెచ్చి భక్ష్యాలు, కోడిగుడ్లు, జొన్న గటక తినిపించారు. అనంతరం మెడలో గణగణ మోగే గంటలు, కాళ్లకు పెద్ద పెద్ద గజ్జెలు, కొమ్ములకు కొప్పులు, ముఖానికి రంగురంగుల పంతాళ్లు, ఒంటికి రంగులను పూసి కాడెడ్లను అందంగా అలకరించారు. ఆపై రైతన్నలంతా కలిసి తమ కాడెడ్లను మేళతాలాలతో వీధుల్లో ఊరేగించారు. ఎడ్లు కదులుతుంటే గంటలు, గజ్జెల చప్పుళ్లతో ఊర్లలో జాతర శోభ కనిపించింది. తర్వాత ఎడ్లను గ్రామాల్లోని ప్రధాన ఆలయానికి తీసుకెళ్లి ప్రదక్షిణ చేయించారు. తర్వాత వాటితో శివార్లకు కదిలి.. చక్కగా పంటలు పండాలని కోరుకుంటూ తమ చేలల్లో భూతల్లికి పూజలు చేశారు. అనంతరం కాడెడ్లను అదిలిస్తూ లాంచనంగా నాగటి చాళ్లు తీశారు! సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో రైతులు శుక్రవారం వేడుకను కన్నుల పండుగగా నిర్వహించారు. -మేళ్లచెర్వు

రిజర్వేషన్లపై సీలింగ్‌ను ఎత్తివేయాలి: వీహెచ్

న్యూఢిల్లీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై ప్రస్తుతం ఉన్న 50% సీలింగ్‌ను ఎత్తివేయాలని, ఇందుకోసం కేంద్రప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టాలని కాంగ్రెస్ మాజీ ఎంపీ వీ హనుమంతరావు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన అభిప్రాయపడ్డారు. బిహార్‌లో 65శాతం రిజర్వేషన్లను అక్కడి హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. పట్నా హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేయాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు వీహెచ్ విజ్ఞప్తి చేశారు. కేంద్రప్రభుత్వం వెంటనే సమగ్ర కులగణన చేపట్టాలని వీహెచ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

గనుల వేలంతో సింగరేణికి ఉరే: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బొగ్గు గనులను వేలం వేయడం అంటే.. సింగరేణి సంస్థకు ఉరి వేయడం లాంటిదేనని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రయోజనాల పట్ల కాంగ్రెస్, బీజేపీ నేతలకు సోయిలేదని విమర్శించారు. సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో పదవి తీసుకొని హైదరాబాద్‌లో దిగిన మొదటి రోజే కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ద్రోహంచేసే పని మొదలుపెట్టారని ఆయన విమర్శించారు. తెలంగాణకు తలమానికమైన సింగరేణిని దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని, ఆ సంస్థకు కాకుండా వేలంద్వారా ఇతరులకు బొగ్గుగనులు అప్పగిస్తే.. ఆ సంస్థ మనుగడకు ఆటంకం ఏర్పడుతుందని మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్ ఆరోపించారు.

తెలంగాణ వ్యతిరేకిని రాష్ట్ర గవర్నర్‌గా నియమించే అవకాశం

» ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహావిష్కరణలో కోదండరాం

షాద్‌నగర్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణను వ్యతిరేకించే వారిని రాష్ట్ర గవర్నర్‌గా నియమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రొఫెసర్ కోదండరాం ఆందోళన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఆయన వర్ధంతి సందర్భంగా శుక్రవారం కోదండరాం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకొనేందుకు కుట్రలు జరుగుతున్నాయని, కలిసికట్టుగా ఎదుర్కోవాలని కోరారు. కార్పొరేట్ సంస్థల కోసమే సింగరేణిలోని బొగ్గును వేలం వేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని ఆరోపించారు. ప్రొఫెసర్ జయశంకర్‌ను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవమానించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగుతోందని చెప్పారు.

అన్నారం బ్యారేజీలో సాంకేతిక పరీక్షలు

కాటారం/మహదేవపూర్ రూరల్, జూన్ 21: అన్నారం (సరస్వతి) బ్యారేజీలో అత్యాధునిక సాంకేతిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. పుణేకు చెందిన కేంద్ర జల, శక్తి పరిశోధన కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణుల బృందం బ్యారేజీ డౌన్ స్ట్రీమ్‌లో 34వ గేట్ వద్ద శుక్రవారం పరీక్షలను ప్రారంభించింది. జియో ఫిజికల్ శాస్త్రవేత్త ధనుంజయ్‌నాయుడు నేతృత్వంలోని బృందం జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలను చేపట్టింది. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు సీడబ్ల్యూపీఆర్ఎస్ నిపుణులు అన్నారం బ్యారేజీలో వివిధ పరీక్షలను నిర్వహించి, లోపాలను తెలుసుకుని.. బ్యారేజీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను నివేదించనున్నారు. బ్యారేజీ సీకెంట్ పైల్స్ స్థితిగతులు, కాంక్రీట్ పటుత్వాన్ని తెలుసుకోవడానికి నిపుణుల బృందం వారం రోజుల పాటు 26వ గేట్ నుంచి 45వ గేట్ వరకు అప్, డౌన్ స్ట్రీమ్‌లో జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలు, నాన్ డిస్ట్రక్టివ్ పరీక్షలు చేయనున్నట్లు ధనుంజయ్‌నాయుడు తెలిపారు. మరోవైపు వరంగల్ నిట్ నిపుణుల బృందం సూచనల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు లీకేజీలు, సీపేజీలు లేకుండా చేయడానికి కెమికల్ గ్రౌటింగ్ పనులు చేపట్టారు.

ఆర్టీసీ విలీన తేదీని ప్రకటించాలి

» సీఎంకు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ వినతి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్ఆర్టీసీ కార్మికులకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. 2013 పీఆర్‌సీ 50 శాతం బాండ్ బకాయిలను చెల్లించకపోవడంతో కండక్టర్లు, ఇతర గ్యారేజీ సిబ్బంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు కె.రాజిరెడ్డి, డి.గోపాల్, ఇ.వినాయక రెడ్డి, బి.ఎస్.రాజు, దశరథ తదితర ప్రతినిధులు పేర్కొన్నారు. ఆర్టీసీని లాభసాటిగా నిర్వహించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 3 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేనందున తెల్ల రేషన్ కార్డును అందించడంతో పాటు ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ డిపోలో అధికారుల నియంతృత్వ వైఖరి, వేధింపులకు నిరసనగా కార్మికులు చేపట్టిన పోరాటానికి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సంఘీభావం ప్రకటించింది.

ఉస్మానియా అంటే హైదరాబాద్‌కి షాన్..

» ఆస్పత్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది: దామోదర

» ఉస్మానియా ఆస్పత్రిలో పలు ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి

మంగళ్‌హాట్, హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి అంటే హైదరాబాద్‌కీ షాన్ అని, అలాంటి షాన్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై సీఎంతో చర్చిస్తామని, హెల్త్ పాలసీపై త్వరలో కీలక ప్రకటన చేస్తామని పేర్కొన్నారు. రూ.16.68 కోట్లతో ఉస్మానియా ఆస్పత్రిలో చేపట్టిన పలు పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. రూ.13.97 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎంఆర్ఐ స్కాన్ యంత్రం, రూ.2.16 కోట్లతో నిర్మించిన ఆధునిక కిచెన్, రూ.55 లక్షలతో జనరల్ మెడికల్ బ్లాక్‌లో నిర్మించిన ఓపీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రూ.5.90కోట్లతో చేపట్టిన మార్చురీ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పెద్దపెద్ద భవనాలు, విగ్రహాల నిర్మాణంపై దృష్టి పెట్టిన గత పాలకులు ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణాన్ని గాలికొదిలేశారని అన్నారు. సీఎంతో చర్చించి ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ శంకుస్థాపనకు త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో 1951లో నిర్మించిన జీఎన్ఎం నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనాన్ని తిరిగి నిర్మిస్తామన్నారు. ముఖ్యంగా హెల్త్ పాలసీపై త్వరలో కీలకమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రైమరీ, సెకండరీ హెల్త్ విభాగాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉందని తెలిపారు.



నూతన ఎంఆర్ఐని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర

కష్టకాలంలో పోచారం పార్టీ మారడం సరికాదు:బీఆర్ఎస్

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): "అధికారంలో ఉన్నపుడు పలు పదవుల్లో కొనసాగిన, సీనియర్ నేత పోచారం శ్రీనివాసరెడ్డి కష్టకాలంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం సరికాదు. ఇలాంటి వారిని చూసి తెలంగాణ సమాజం గందరగోళంలో పడుతోంది" మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌గా, వ్యవసాయ శాఖ మంత్రిగా, కేసీఆర్ ఆయనకు ఎంతో గౌరవం ఇచ్చారని, ఆయన కుమారునికి డీసీసీబీ చైర్మన్ పదవి కూడా కల్పించారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పిన కారణాలు వింటే సిగ్గేస్తోందని బీఆర్ఎస్ నేతలు బాజిరెడ్డి గోవర్ధన్, జాజుల సురేందర్ అన్నారు. రేవంత్ వ్యవసాయానికి చేస్తున్న మేలును దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్‌లో చేరుతున్నానని పోచారం చెప్పడం ఆత్మవంచనేనని విమర్శించారు. ఇసుక దందాలు నడుస్తలేవనే ఆయన పార్టీ మారారని బీఆర్ఎస్ వారు ఆరోపించారు.

కాంగ్రెస్‌లోకి పోచారం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో చేరుతారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నా... పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేరనున్నారన్న అనుమానం బీఆర్ఎస్ నాయకత్వానికి సైతం రాలేదు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయశాఖ మంత్రిగా, స్పీకర్‌గా వ్యవహరించిన ఆయన... అనూహ్యంగా సీఎం రేవంత్‌రెడ్డిని తన నివాసానికి ఆహ్వానించి, ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బలరాం నాయక్ తదితరులు పోచారం నివాసానికి వెళ్లి పార్టీలోకి లాంచనంగా ఆహ్వానించారు. అక్కడికక్కడే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డికి రేవంత్ పార్టీ కండువాలు కప్పారు.

నాడు శాసనసభాపక్షాన్ని విలీనం చేసి...

2018 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన 19 మంది ఎమ్మెల్యేల్లో 12 మంది టీఆర్ఎస్ఎల్పీలో విలీనమైన సంగతి తెలిసిందే. ఆ 12 మంది ఎమ్మెల్యేలు శాసనసభాపక్షంగా ఏర్పడి టీఆర్ఎస్ఎల్పీలో విలీనం అయ్యారు. ఆ సమయంలో స్పీకర్‌గా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ విలీనానికి ఆమోద ముద్ర వేశారు. 2023 ఎన్నికల్లో 64 సీట్లు సాధించి.. కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరగా.. తాజాగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆ జాబితాలో చేరారు. ఆనాడు స్పీకర్ హోదాలో టీఆర్ఎస్ఎల్పీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల విలీనానికి ఆమోద ముద్ర వేసిన పోచారం.. తాజా పరిస్థితుల దృష్ట్యా ఆయనే కాంగ్రెస్ గూటికి చేరడం విశేషం. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 64 సీట్లు రాగా.. మిత్రపక్షం సీపీఐకి వచ్చిన ఒక సీటుతో కలిపి ఆ పార్టీ బలం 65గా ఉంది. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలవడంతో ఆ సంఖ్య 66కు చేరింది. తాజాగా చేరిన పోచారం సహ ఇప్పటికే చేరిన ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కలిపితే అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 70కి చేరినట్లయింది. కంటోన్మెంట్ సిటింగ్ సీటును కోల్పోవడంతో సాంకేతికంగా బీఆర్ఎస్ బలం 38 సీట్లకు పడిపోయింది. ఇందులో నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరడంతో సభలో ఆ పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య 34కు తగ్గిపోయింది. ఈ మేరకు 2018 నాటి ఫార్ములానే అమలు చేసి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎల్పీలో అధికారికంగా చేర్చుకునే ఆలోచనలో కాంగ్రెస్ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 38 కాగా.. విలీన ప్రక్రియ జరగాలంటే 26 మంది కాంగ్రెస్‌కు మద్దతు తెలపాల్సి ఉంటుంది. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు మద్దతు తెలపగా.. మరో 22 మందిని ఆకర్షించి, శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

పోచారానికి సముచిత గౌరవం

భవిష్యత్తులో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సముచిత గౌరవం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా ఆయనను కలిశామని, పెద్ద వారిగా అండగా నిలబడాలని కోరామన్నారు. రైతుల సంక్షేమం కోసమే పోచారం.. కాంగ్రెస్‌లో చేరారని, ఈ దిశగా ఆయన సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళ్తామన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రేవంత్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజా ఆమోదయోగ్యంగా ఉన్నాయన్నారు. రైతాంగానికి రేవంత్ చేస్తున్న మంచి కార్యక్రమాలకు అండగా ఉండాలనే కాంగ్రెస్‌లోకి వచ్చానన్నారు. కొత్త ప్రభుత్వంలో సమస్యలు సహజమని, రేవంత్‌రెడ్డి వాటిని ధైర్యంగా అధిగమిస్తున్నారని కొనియాడారు. రేవంత్‌కు మరో 20ఏళ్లు రాష్ట్రానికి నాయకత్వం వహించే సామర్థ్యం ఉందన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేయాలని ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు.

పోచారం నివాసం వద్ద హైడ్రామా

బంజారాహిల్స్: పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసం వద్ద శుక్రవారం హైడ్రామా చోటు చేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని పోచారం నివాసానికి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారన్న సమాచారంతో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మరికొంత మంది బీఆర్ఎస్ నేతలు అక్కడకు చేరుకున్నారు. చర్చలు ముగించుకొని రేవంత్‌రెడ్డి బయటకు వస్తుండగా.. ఇంట్లోకి వెళ్లేందుకు బాల్క సుమన్ ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు బాల్క సుమన్‌ను అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. బాల్కసుమన్‌తో పాటు మన్నె గోవర్ధన్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, అంజనేయగౌడ్, కదారి స్వామి యాదవ్, తుంగ బాలు, డి.రాజు, కె.జంగయ్య, వరికుప్పల వాసు, సి.దశరథ్, బాలరాజ్ యాదవ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వీరికి నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

త్వరలోనే బీఆర్ఎస్ ఖాళీ

కేసీఆర్ విధానాలే ఆ పార్టీని ముంచాయి

మీడియాతో చిట్‌చాట్‌లో దానం నాగేందర్

కేసీఆర్, కేటీఆర్ తప్ప ఎవ్వరూ మిగలరు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి మరో 20 మందికిపైగా ఎమ్మెల్యేలు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వెల్లడించారు. బీఆర్ఎస్ ఖాళీ అయ్యే అవకాశం ఉందన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. కేసీఆర్ విధానాలే బీఆర్ఎస్ పార్టీని ముంచాయన్నారు. ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ యాదవ్, ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డి, వివేకానంద్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్ తదితరులు అతి త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు వెల్లడించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, వ్యూహకర్త సునీల్ కనుగోలు రెండు, మూడు రోజులుగా చర్చలు జరుపుతున్నారన్నారు. మరోవైపు.. హరీశ్‌రావుతో కలిసి కొందరు బీజేపీలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అయోమయంలో పడిందని, ప్రమాదం నుంచి బయటపడే పనిలో ఎమ్మెల్యేలు ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్, కేటీఆర్ తప్ప ఎవరూ మిగలరని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ విధానాలు నచ్చి.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమపార్టీలో చేరుతున్నారన్నారు. తాము కూడా సంఖ్యాబలాన్ని పెంచుకునేందుకు వారిని తీసుకుంటున్నామని చెప్పారు. రాజకీయ అవసరాలను బట్టి పార్టీలో చేరికలు ఉంటాయని, నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగబోదని భరోసా ఇచ్చారు.



సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్

పదేళ్ల రాష్ట్ర ప్రగతిపై బురదచల్లడం మానాలి

ప్రభుత్వం అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలి

'అంబేడ్కర్ అభయ హస్తం'కు నిధులివ్వాలి: కేటీఆర్

హైదరాబాద్/సిరిసిల్ల, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): "పదేళ్లలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించి కొత్తగా ఏర్పడే రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ప్రపంచప్రఖ్యాత మ్యాగజైన్ 'ది ఎకానమిస్ట్' కథనాన్ని ప్రచురించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి ప్రస్థానంపై బురద చల్లడం మాని ఇప్పటికైనా అభివృద్ధి యజ్ఞాన్ని ముందుకు తీసుకు వెళ్లాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఒక అభివృద్ధి మోడల్‌గా తయారైందంటూ కథనంలోని లెక్కలను శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన వెల్లడించారు. అలాగే.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన సమయంలో స్థాపిత విద్యుత్ సామర్థ్యం 7.8 గిగా వాట్ల నుంచి 19.3 గిగా వాట్లకు పెరిగిందని తెలిపారు. 9ఏళ్లలో ఐటీ ఎగుమతులు నాలుగు రెట్లు పెరిగాయని, ఐటీ ఉద్యోగాలు మూడు రెట్లు పెరిగి 9 లక్షలకు చేరుకున్నాయన్నారు. బీఆర్ఎస్ సాధించిన అభివృద్ధిని ఎలాంటి అడ్డంకులు లేకుండా కాంగ్రెస్ సర్కారు ముందుకు తీసుకువెళ్లాలని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దళితులకు ఇచ్చిన హామీ ప్రకారం 'అంబేడ్కర్ అభయ హస్తం'కు నిధులు కేటాయించి చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు.

బొగ్గు బ్లాకుల వేలం అప్పుడు వద్దన్నారు.. ఇప్పుడు సమర్థిస్తారా?

'కేంద్రం బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపేయాలని, 4 బొగ్గు బ్లాకులను సింగరేణి కాలరీస్‌కు బదిలీ చేయాలని గతంలో ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో డిమాండ్ చేశారు. అదే ప్రక్రియ ఇప్పుడు జరుగుతుంటే ముఖ్యమంత్రి హోదాలో సమర్థిస్తారా..?' అని రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. సీఎం హోదాలో తెలంగాణ ప్రజలను పూర్తిగా నిరుత్సాహపరుస్తూ, వేలంలో పాల్గొనేందుకు డిప్యూటీ సీఎంను పంపారని విమర్శించారు. వేల మంది కార్మికుల పొట్టగొట్టి.. వందేళ్ల సంస్థ భవిష్యత్తును చీకట్లోకి నెట్టి.. పూలబొకేలతో నిస్సిగ్గుగా పోటోలకు ఫోజులిస్తున్నారని భట్టి, కిషన్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సింగరేణికి అన్యాయం చేయను!

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలతో పోలిస్తే బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి వెనుక బడిందని చెప్పారు. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచుకుంటూ దిగుమతులను క్రమంగా తగ్గించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెల్ల కాగితాలపై రాస్తే బొగ్గు గనులు కేటాయించే వారని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. గనుల కేటాయింపులో కోలిండియాకు ఇచ్చినట్లు సింగరేణికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఒడిశాలోని నైనీ బ్లాకులో బొగ్గు ఉత్పత్తి కోసం అక్కడ కొలువైన బీజేపీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని ప్రకటించారు. పదేళ్ల కిందట కరెంట్ కోసం తెలంగాణలో పారిశ్రామికవేత్తలు ధర్నాలు చేసేవారని, రోజుకు కొన్ని గంటలే కరెంటు ఇచ్చేవారని, వ్యవసాయానికి కూడా కరెంట్ సరిగా అందేది కాదని కిషన్‌రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో అనుసరించిన విధానాల వల్లే విద్యుత్ రంగంలో సాధికారత సాధించి, కరెంటు కొరత తీరిందని వ్యాఖ్యానించారు. బొగ్గు బ్లాకుల వేలంతో కేంద్రానికి వచ్చే ఆదాయమంటూ ఏమీ లేదని, మొత్తం ఆదాయం రాష్ట్రానికే వస్తుందని మంత్రి చెప్పారు.

రాష్ట్రంలో బ్లాక్‌లకు వేలం వద్దు: భట్టి

కోల్‌బెల్ట్‌లో సింగరేణి గనుల మధ్యలో ఉన్న బ్లాకులను వేలం వేసే ప్రయత్నాలను విడనాడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గనుల అభివృద్ధి చట్టం 17(ఏ) సెక్షన్-2 ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలకు ఉదారంగా గనులు కేటాయించే అధికారం కేంద్రానికి ఉంటుందని చెప్పారు. శుక్రవారం గనుల వేలం ప్రారంభం సందర్భంగా భట్టి మాట్లాడుతూ, సింగరేణి తెలంగాణకే ఆయువుపట్టు లాంటిదని చెప్పారు. 2015లో గనుల అభివృద్ధి చట్టం తెచ్చే వరకు 136 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణికి రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లన్నింటి మీద గుత్తాధిపత్యం ఉండేదని భట్టి గుర్తు చేశారు. చట్టం వచ్చాక దానికి గండి పడిందని తెలిపారు. సింగరేణి అన్వేషించిన గనులను కూడా ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆక్షేపించారు. ఇప్పటికే రెండు గనుల వేలం పూర్తయిందని, సత్తుపల్లి గనిని అవంతిక సంస్థకు, కోయగూడెం బ్లాకును అరో ఇన్‌ఫ్రాకు కట్టబెట్టారని భట్టి విచారం వ్యక్తం చేశారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న సింగరేణి సంస్థ ఇప్పుడు 39 బొగ్గు గనులతో 42 వేల మంది కార్మికులతో నడుస్తోందని చెప్పారు. ఉన్న గనుల్లో బొగ్గు నిల్వలు లేక కొన్ని మూత పడనున్నాయని చెప్పారు. రానున్న ఐదేళ్లలో 8 భూగర్భ గనులు, మూడు ఓపెన్ కాస్ట్ గనులు మూత పడబోతున్నాయని, ఆ తర్వాత మరో ఐదేళ్లలో 5 భూగర్భ గనులు, 6 ఓపెన్‌కాస్టులు మూతపడతాయని వివరించారు. 2037-38 నాటికీ మరో 5 గనులు మూత పడనున్నాయన్నారు. రానున్న 15 ఏళ్లలో సింగరేణి మరింత కుదించుకుపోయి 12 గనులు, 8 వేల మంది కార్మికులు మిగులుతారని చెప్పారు. సింగరేణి సంస్థకు గోదావరి, ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో ఉన్న 1400 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలపై గుత్తాధిపత్యాన్ని పునరుద్ధరించాలని భట్టి డిమాండ్ చేశారు. కిషన్‌రెడ్డి ప్రధానిని కలిసేందుకు అనుమతి తీసుకుంటే ముఖ్యమంత్రితో పాటు అన్ని పార్టీల నేతలను తీసుకొని వచ్చి కలుస్తామన్నారు. తెలంగాణ ప్రాంత బిడ్డగా కిషన్‌రెడ్డి సింగరేణికి న్యాయం చేయాలని కోరారు. రానున్న రోజుల్లో 4000 మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్‌కు, మరో 4 వేల మెగావాట్ల ఎన్టీపీసీకి, సింగరేణి నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల ప్లాంట్‌కు 24 మిలియన్ టన్నుల బొగ్గు అవసరం ఉందని ప్రస్తావించారు వేలమంది సింగరేణి కార్మికులు, పరోక్షంగా ఆధారపడిన లక్షల మంది తెలంగాణ ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సింగరేణి సంస్థకు గనులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వేలంపాటలో రెండు గనులు గెలుచుకున్న సంస్థలు ఇవ్వజూపిన ఆదాయం కన్నా 0.5 శాతం అదనంగా ఇవ్వడానికిసింగరేణి సిద్ధంగా ఉందని చెప్పారు. గనుల అభివృద్ధి చట్టాన్ని వెంటనే సవరించి తక్షణమే గనులు కేటాయించాలని కోరారు. మంత్రి కిషన్‌రెడ్డికి ఇదే అంశంపై వినతిపత్రాన్ని అందించారు.



హైదరాబాద్‌లో జరిగిన 10వ కమర్షియల్ కోల్ మైనింగ్ వేలం కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి

సింగరేణి అక్రమాలపై.. సీబీఐ విచారణ కోరే దమ్ముందా..?

సంస్థ ప్రైవేటీకరణపై పార్టీల దుష్ప్రచారం.. మోదీ వల్లే యోగాకు ఖ్యాతి: బండి సంజయ్

కరీంనగర్/హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఇల్లందకుంట: సింగరేణిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా..? అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. సింగరేణిలో అవినీతిపై సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తేలేదని ప్రధాని మోదీ ప్రకటించిన తర్వాత కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతం, కేంద్రం వాటా 49 శాతం ఉంటుందని.. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించడం అసాధ్యమని స్పష్టం చేశారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం సింగరేణిలో అంతులేని అవినీతి చేసిందని.. కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోందని సంజయ్ ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ కృషి వల్లే అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. యోగాతో అన్ని రోగాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కాగా, కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం సంజయ్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో గూండాయిజం, కబ్జాలు చేసినోళ్లను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని విమర్శించారు.

సింగరేణి ప్రైవేటీకరణకు కేసీఆర్ యత్నం: ఎస్.కుమార్

సింగరేణిని ప్రైవేటీకరించేందుకు మాజీ సీఎం కేసీఆర్ ప్రయత్నించారని.. అందులో భాగంగానే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేందుకు ఆయన సింగరేణికి అనుమతి ఇవ్వలేదని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కుమార్ మాట్లాడారు. కేంద్రం సింగరేణిని ప్రైవేటీకరించబోతోందని ఎన్నికల ముందు కేసీఆర్ తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల ఫలితాలపై త్వరలో సమీక్షలు నిర్వహిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.



కరీంనగర్‌లో యోగాసనాలు వేస్తున్న బండి సంజయ్

ఆచార్య జయశంకర్‌కు సీఎం రేవంత్ నివాళి

» తెలంగాణ కోసం జీవితాన్నే త్యాగం చేశారు: గుత్తా


జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంత కర్త, ఆచార్య జయశంకర్ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి జయశంకర్ అని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్ పాల్గొన్నారు.

మహిళాశక్తి క్యాంటిన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలి

» పల్లె రుచులను పట్టణాలకు పరిచయం చేయాలి: సీతక్క

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలు నిర్వహించే మహిళాశక్తి క్యాంటిన్లు ఒక బ్రాండ్‌గా ఎదగాలని, వాటిని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తొలిసారిగా సచివాలయంలో ఏర్పాటు చేసిన మహిళాశక్తి క్యాంటిన్లను సీఎస్ శాంతికుమారితో కలిసి మంత్రి సీతక్క శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో 151 మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యం మేరకు ముందుకు సాగుతామన్నారు. స్థానికంగా లభ్యమయ్యే వనరులు, వస్తువుల ఆధారంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మహిళాశక్తి బిజినెస్ మోడల్‌ను రూపొందించి.. ఆర్థిక సహకారం లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ చేతి వంటలా మహిళాశక్తి క్యాంటిన్లు నాణ్యతకు మారుపేరుగా నిలవాలని, పల్లె రుచులు, ఇప్పపువ్వు లడ్డూలు, నన్నారి వంటి సంప్రదాయ ఆహార పానీయాలను పట్టణాలకు పరిచయం చేయాలని సూచించారు.

అర్చక, ఉద్యోగుల వేతనాలకు 41.68 కోట్లు

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు ప్రభుత్వం రూ. 41.68 కోట్లు మంజూరు చేసింది. మే, జూన్ నెలల వేతనాల చెల్లింపునకు ఈ నిధులు మంజూరు అయ్యాయి. ఈమేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయాల ధూపదీపం నిర్వాహకులకు గౌరవ భృతి చెల్లింపునకు రూ. 16.32 కోట్లు మంజూరు చేస్తూ వేరేగా ఉత్తర్వులు వెలువడ్డాయి.

పప్పు దినుసుల బోర్డు ఏర్పాటు చేయండి

» కేంద్రమంత్రి చౌహాన్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పప్పు దినుసుల బోర్డు ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తద్వారా రైతులను పప్పు ధాన్యాల సాగుకు ప్రోత్సహించినట్లు అవుతుందని అన్నారు. తాండూరులో ఉత్పత్తి చేసే కందులకు ప్రపంచంలోనే విశిష్ట స్థానం ఉన్నదని, ఇక్కడి మార్కెట్‌కు ఏడాదిలో 4లక్షల క్వింటాళ్ల కందిపప్పు వస్తుందని మంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్.. ఢిల్లీ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుమ్మలతోపాటు పది రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులు ఇందులో పాల్గొని పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ పప్పు ధాన్యాలు సేకరించే క్రమంలో 25శాతం ఉన్న పరిమితిని ఎత్తివేసి.. 100% కనీస మద్దతు ధరకు సేకరించాలని, తద్వారా రైతులను ప్రోత్సహించినట్లు ఉంటుందని, మార్కెట్లో ఎదురయ్యే ఒడిదొడుకులను రైతులు తట్టుకోగలుగుతారా అని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ పురోగతిని కూడా తుమ్మల వివరించారు. ఆయిల్‌పామ్ రైతులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని, గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పందిస్తూ.. తుమ్మలను ఢిల్లీకి ఆహ్వానించారు. సమగ్ర సమాచారంతో వస్తే అన్ని అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుందామని హామీ ఇచ్చారు.

అక్రమ మైనింగ్‌తో రూ.300కోట్లు కూడబెట్టారు

» ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడి ఇళ్లు, కార్యాలయాల్లో సోదాల అనంతరం ఈడీ వెల్లడి

» రూ.19లక్షలు, బ్యాంకు లాకర్ల తాళాలు స్వాధీనం

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్ రెడ్డి అక్రమ మైనింగ్‌తో రూ.300 కోట్లు కూడబెట్టారని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 39.08 కోట్ల రాయల్టీ ఎగవేశారని ఈడీ అధికారులు తెలిపారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించి రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఆయన తమ్ముడి ఇళ్లు, కార్యాలయాల్లో మొత్తం 10 ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఈడీ ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. ఈ తనిఖీలకు సంబంధించిన వివరాలను అధికారులు శుక్రవారం వెల్లడించారు. సోదాల్లో లెక్కల్లో చూపని రూ.19లక్షల నగదుతోపాటు ఎమ్మెల్యే ఆయన సోదరులకు బినామీలుగా భావిస్తున్న వారి ఇళ్లలో దొరికిన ఆస్తుల పత్రాలతోపాటు మొబైల్ ఫోన్లు, బ్యాంకు లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమ మైనింగ్‌తో సంపాదించిన డబ్బును బినామీల పేర్లతో రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. కాగా, త్వరలోనే ఆయా బ్యాంకులకు లేఖలు రాసి లాకర్లు తెరిచేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. వాటిని తెరిస్తే మైనింగ్ గుట్టు వీడే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొత్తం వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ హైదరాబాద్ విభాగం అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్ నేతలను వేధిస్తున్న ప్రభుత్వాలు: హరీశ్

పటాన్‌చెరు, జూన్ 21: ఈడీ, ఐటీల పేరుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, నాయకులను భయభ్రాంతులకు గురిచేసి లొంగదీసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు పటాన్‌చెరులోని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి కుటుంబాలను శుక్రవారం కలిసి ధైర్యం చెప్పి సంఘీభావం తెలిపారు. వారి ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఈడీ, ఐటీలను ప్రయోగించినా, ఎంత ఒత్తిడి చేసినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లొంగే ప్రసక్తే లేదన్నారు. మహిపాల్‌రెడ్డి వద్ద ఎలాంటి అక్రమాస్తులు లేవని ఈడీ సోదాల్లో తేలిందన్నారు. ప్రతీ ఆస్తికి లెక్కలు చూపించి ప్రభుత్వానికి ఐటీ చెల్లింపులు చేస్తున్న మహిపాల్‌రెడ్డి ఎవరి ముందు తలవంచరని పేర్కొన్నారు.

24 నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్-1 ప్రిలిమ్స్ ఓఎంఆర్ ఆన్సర్ షీట్లు

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పోస్టుల ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన ఓఎంఆర్ జవాబు పత్రాలను అభ్యర్థులకు అందుబాటులోకి తీసుకురావాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఈ నెల 24 నుంచి ఓఎంఆర్ జవాబు పత్రాలను వెబ్‌సైట్‌లో ఉంచనున్నట్టు అధికారులు తెలిపారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 3.02 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.

రుణమాఫీకి రాజముద్ర

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసింది. సంఘంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు సభ్యులుగా ఉంటారు. జూలై 15 లోగా నివేదిక ఇవ్వాలని కమిటీని మంత్రివర్గం ఆదేశించింది. నివేదికను శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో చర్చకు పెట్టి, సభ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని, ఆ తర్వాతే పథకాన్ని ఆచరణలో పెట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ పాలనకు సంబంధించిన ఏదైనా సమాచారాన్ని మీడియాకు వెల్లడించడానికి ఇద్దరు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను అధికార ప్రతినిధులుగా నియమించింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటల నుంచి రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో పంట రుణాల మాఫీ, రైతు భరోసాపై కీలక నిర్ణయాలు తీసుకున్నది. సమావేశ వివరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాహుల్‌గాంధీ 2022 మే 6న వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో భాగంగా రూ.2 లక్షల రుణ మాఫీని అమలు చేస్తున్నట్లు రేవంత్ ప్రకటించారు. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండుగ చేయాలన్న పార్టీ ఆలోచన మేరకు మాఫీని చేపడుతున్నట్లు చెప్పారు. సోనియా, రాహుల్, ఖర్గేలు మడమ తిప్పని నేతలని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 2004లో కరీంనగర్ గడ్డ మీద తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చిన సోనియాగాంధీ దాన్ని నిలబెట్టుకోవడానికి ఎంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారో అందరికీ తెలుసన్నారు. ఆ క్రమంలో ఉత్పన్నమైన రాజకీయ సంక్షోభంతో కాంగ్రెస్ ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నప్పటికీ సోనియా తన మాటను నిలబెట్టుకున్నారని చెప్పారు. సోనియా లాంటి కమిటెడ్ నాయకత్వం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ కూడా వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని మాట ఇచ్చారని ప్రస్తావించారు. ఇది అలవికాని హామీ అని ఎంతమంది అన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని అంశాలను క్యాబినెట్ చర్చించిందని, వివిధ బ్యాంకులలో ఉన్న రుణ వివరాలను సేకరించి, క్రోడీకరించి, రుణ మాఫీ చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డాక రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పదేళ్ల వ్యవధిలో రెండుసార్లు మాఫీ చేసినప్పటికీ మొత్తం 28 వేల కోట్లు మాత్రమేనన్నారు. తొలి విడత మాఫీలో రూ.16 వేల కోట్లు, మలి విడత మాఫీలో రూ.12 వేల కోట్ల రుణాలను రద్దు చేసిందని రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. కేసీఆర్ చివరిసారిగా 2018 డిసెంబరు 11 వరకు కట్-ఆఫ్-డేట్ తీసుకుని రుణ మాఫీ చేసినందున తమ ప్రభుత్వం ఆ మర్నాటి నుంచి 2023 డిసెంబరు 9 వరకు కట్-ఆఫ్-డేట్‌గా తీసుకుంటోందని చెప్పారు. రుణ మాఫీకి రూ.31 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశామని, ఆ మేరకు నిధులు సేకరించి, తెలంగాణ రైతాంగాన్ని రుణ విముక్తులను చేస్తామని ప్రకటించారు. మొత్తం ఒకే దఫాగా రూ.2 లక్షల రుణమాఫీ జరిగిపోతుందని వెల్లడించారు. గత ప్రభుత్వం నాలుగు విడతల్లో, వడ్డీలు చెల్లిస్తామంటూ రకరకాల ప్రకటనలు చేసి, వాయిదాలపై వాయిదాలు వేసుకుంటూ రైతులను, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. పలువురు రైతుల ఆత్మహత్యలకు కారణమైందని విమర్శించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారానికి వచ్చిన ఎనిమిది నెలల్లోపే పంట రుణాల మాఫీ నిర్ణయాన్ని తీసుకుందని గుర్తు చేశారు. తాము అధికారానికి వచ్చిన తొలి ఆరు నెలల్లో రెండు నెలలు ఎన్నికల కోడ్‌తోనే గడిచి పోయిందని ప్రస్తావించారు. రాష్ట్ర మంత్రివర్గం మొత్తం ఒక సామాజిక బాధ్యతతో, చిత్తశుద్ధితో ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. రుణ మాఫీని కేబినెట్ ఆమోదించిన శుక్రవారం రోజు తన జీవితంలో చరిత్రాత్మకమైన రోజు అని ట్విటర్ వేదికగా కూడా రేవంత్ చెప్పారు.


మంత్రివర్గ భేటీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన భట్టి

'రైతు భరోసా'కు విధివిధానాలు

రైతు భరోసా పథకానికి విధివిధానాలను రూపొందించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ సర్కారు హయాంలో అనర్హులకు రైతు బంధు సొమ్ము ఇచ్చారని, జాతీయ రహదారులకు ఇచ్చారని, శ్రీమంతులకు, జూబ్లీహిల్స్‌లో నివసించే వారికి, ఫామ్‌హౌజ్‌లలో నివసించేవారికి ఇచ్చారని రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. గజ్వేల్‌లోని ఫామ్‌హౌజ్‌కు కూడా కేసీఆర్ రైతు బంధు సొమ్ము తీసుకున్నారనే విధంగా రకరకాలుగా మాట్లాడుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు మాట్లాడుకుని ఒక నిర్ణయానికి వచ్చామని రేవంత్ తెలిపారు. పథకం పారదర్శకంగా ఉండాలని, భాగస్వాములందరితో చర్చించి, అందరి సూచనలు, సలహాల మేరకు నిస్సహాయులకు అందించాలని, ప్రభుత్వ సంక్షేమాన్ని సామాన్యులకు చేరవేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. మంత్రివర్గ ఉప సంఘం రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాలు, రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలతో సలహాలు, సూచనలు తీసుకుని రైతు భరోసాకు విధివిధానాలను పారదర్శకంగా తయారు చేస్తుందన్నారు. జూలై 15 లోపు నివేదిక వస్తుందని, వచ్చే శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో పెట్టి, అందరు శాసనసభ్యుల అభిప్రాయాలను తీసుకుని, విధివిధానాలను ఖరారు చేస్తామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం ఆధారంగా పని చేయాలని తమ క్యాబినెట్ భావిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి చెప్పారు.

మంత్రులు రాజకీయాలు మాట్లాడొచ్చు

ప్రభుత్వ పాలనకు సంబంధించిన వివిధ రకాల సమాచారమివ్వడానికి, అపోహలను నివృత్తి చేయడానికి ఇద్దరు మంత్రులను అధికార ప్రతినిధులుగా నియమించాలని కేబినెట్ నిర్ణయించిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీల సొంత మీడియాలో కొన్ని విషయాలను చిలవలు పలవలు చేసి, ప్రభుత్వంపై అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. మంత్రులను లేనిపోని విషయాలపై ఏదో ఒకటి మాట్లాడించి, దానికి ప్రచారం కల్పించి ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. అందుకే, మంత్రివర్గ నిర్ణయాలతోపాటు ప్రభుత్వానికి సంబంధించిన కీలక విషయాలను మీడియాకు బ్రీఫ్ చేయడానికి శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు బాధ్యత అప్పటిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి సంబంధించిన ఎలాంటి సమాచారమైనా, అపోహలు తలెత్తినప్పుడు ఇచ్చే వివరణలైనా... ఈ ఇద్దరు మంత్రులే ఇస్తారన్నారు. వీరిచ్చేదే అధికారిక సమాచారమని రేవంత్ స్పష్టం చేశారు. మీడియా కూడా అనుమానాల నివృత్తికి వీళ్లిద్దరినే సంప్రదించాలని చెప్పారు. రాజకీయ అంశాలపై ఏ మంత్రి అయినా మాట్లాడతారని, ప్రభుత్వ పాలనకు సంబంధించి మాత్రం ఈ ఇద్దరు సమాచారం ఇస్తారని వివరించారు. రుణ మాఫీకి నిధులెలా అని విలేఖర్లు అడగ్గా, "తినబోతూ రుచులెందుకు.. నలభీమ పాకం వండే భట్టి విక్రమార్కకు నిధుల విషయం తెలుస్తుంది. ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేసి తీరతాం" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నిధుల సమీకరణకు సంబంధించి లోతైన సమాచారం కావాలంటే ఆర్థిక మంత్రిని అడగాలన్నారు. రుణ మాఫీ ఏ ప్రాతిపదికన చేస్తామన్నది తమ అంతర్గత అంశమని చెప్పారు. అర్హులు, అనర్హుల గురించి విధివిధానాలు తయారవుతాయన్నారు. మాఫీ నియమ నిబంధనలను మంత్రివర్గం ఆమోదించిందని, త్వరలో జీవో వెలువడుతుందని రేవంత్ ప్రకటించారు. గడువులోగా చేయాలన్నదే తమ తాపత్రయమని, కేసీఆర్‌లాగా ఐదేళ్లలో చేయాలంటే ఇంత హడావుడి పడాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

జూలై నుంచే రుణమాఫీ!

» ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ ప్రక్రియను జూలై నుంచే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. జూలై 17న తొలి ఏకాదశి పర్వదినం ఉంది. ఆ లోపే రుణమాఫీ పక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. తక్కువ బకాయిలు ఉన్న రైతులతో ప్రారంభించి.. క్రమంగా పెంచుతూ రుణమాఫీ చేస్తారు. అయితే గత ప్రభుత్వం విడతలవారీగా రుణ మాఫీ చేసింది. కానీ, ఐదేళ్లలో కూడా మాఫీ కొలిక్కిరాలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం విడతలవారీ ప్రక్రియకు స్వస్తి పలికి.. ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ చేయాలని నిర్ణయించింది. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా, 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు రుణమాఫీకి కట్-ఆఫ్-డేట్‌గా తీసుకుంటోందని సీఎం చెప్పారు. ఈ విషయాన్ని కూడా ఆంధ్రజ్యోతి ముందే చెప్పింది.

భూమి అమ్మాలని బెదిరిస్తున్నాడు.. లేదంటే చంపేస్తానంటున్నాడు!

» పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యల్లేవు

» ప్రజావాణిలో వికారాబాద్ వాసి ఫిర్యాదు

వికారాబాద్, బేగంపేట, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమర్‌ఖాన్ అనే భూకబ్జాదారు తన మేన కోడలు, సోదరుడికి చెందిన భూమిని అమ్మాలని దౌర్జన్యం చేస్తున్నాడని, లేదంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడని వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చెన్‌గోముల్‌కు చెందిన నరేశ్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెన్‌గోముల్‌లో తన మేనకోడలు, తన సోదరుడి పేరిట ఐదున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఆ భూమిపై కన్నేసిన ఉమర్‌ఖాన్ తనకు భూమిని అమ్మాలని ఆరేళ్లుగా బెదిరిస్తున్నారని, లేదంటే తమను చంపేస్తామంటున్నాడని ప్రజావాణి అధికారులకు తెలిపారు. ఉమర్‌ఖాన్‌పై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఉమర్‌ఖాన్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ భూమిలో అర ఎకరా తీసుకునైనా న్యాయం చేయాలని అధికారులను కోరారు.

నర్సరీ తొలగించాలంటూ ఫిర్యాదు

రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూమి అని ఉంది... వెంచర్ వేసినప్పుడు ఎఫ్‌టీఎల్ లేదు.. రికార్డుల్లో అప్పుడు లేని ప్రభుత్వ భూమి ఇప్పుడెలా అవుతుంది అంటూ బేగంపేట మాతాజీనగర్ సమీపంలోని ప్రైడ్ ఇండియా వెంచర్‌లో ప్లాట్లు కొన్న బాలాజీనగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం ఈ వెంచర్‌లో ఉన్న ఇళ్లను నోటీసులు ఇవ్వకుండా జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేయడమేకాకుండా ఆ స్థలంలో జీహెచ్ఎంసీ నర్సరీ ఏర్పాటు చేయడంతో వెంచర్‌లో ప్లాట్లు కొన్న యజమానులు ప్రజావాణికి వచ్చారు. ఈ స్థలానికి చెందిన రెవెన్యూ రికార్డులను అధికారులకు అందజేశారు. తమ స్థలంలోని జీహెచ్ఎంసీ నర్సరీని వెంటనే తొలగించేలా అధికారులను ఆదేశించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు.

కాంగ్రెస్ ఐటీఐఆర్‌ను మంజూరు చేస్తే..
మోదీ సర్కార్ రద్దు చేసింది

» తిరిగి తెప్పించాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే

» జనాన్ని రెచ్చగొట్టడం కాదు.. ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టండి

» కాంగ్రెస్‌లో నేతల చేరిక అంశం సీఎం పరిధిలోనిది: తూర్పు జగ్గారెడ్డి



హైదరాబాద్, జూన్ 21(ఆంధ్రజ్యోతి): రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తెప్పించాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లపైనే ఉందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేస్తే.. ఆ తర్వాత వచ్చిన మోదీ సర్కారు దాన్ని రద్దు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఐటీఐఆర్ రద్దుతో రాష్ట్రంలోని దాదాపు 15 లక్షల కుటుంబాలు ఉద్యోగాలకు దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలన్న లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీఐఆర్‌ను మంజూరు చేసిందన్నారు. లక్షలాది కుటుంబాలకు ఉద్యోగాలు, ఉపాధిని అందించే ఐటీఐఆర్‌ను మోదీ సర్కార్ రద్దు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు అడ్డుకోలేకపోయారని విమర్శించారు. "మోదీ సర్కారు ఐటీఐర్‌ను రద్దు చేస్తే.. దానిపైన చర్చే లేదు. ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు తప్ప ఉద్యోగాలపైన చర్చ లేదు. యువత కూడా.. ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదనే దానిపైన కాకుండా రెచ్చగొట్టే వ్యాఖ్యలకే ఆకర్షితులవుతున్నారు. జెండాలు పట్టుకుని జై శ్రీరాం అంటారే గానీ.. బతకడానికి అక్కరకు వచ్చే ఐటీఐఆర్ గురించి మాత్రం పట్టించుకోరు" అని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు గుడులకు వెళ్లి దీపం పెట్టరు కానీ.. గుళ్లు, గోపురాల చుట్టే రాజకీయం తిప్పుతున్నారని విమర్శించారు. బండి సంజయ్.. కేంద్ర మంత్రిగా హైదరాబాద్ గడ్డపైన అడుగు పెట్టగానే నగరానికి ఐటీఐఆర్‌ను తీసుకొస్తానని అనుంటే బాగుండేదన్నారు. కానీ ఆయన భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయాన్ని బంగారు ఆలయం చేస్తానని మాట్లాడారన్నారు. "ఆకలితో ఉన్నవాళ్లకు అన్నం పెట్టు.. సెంటిమెంట్‌తో వారిని రెచ్చగొట్టడం మానుకుని ఉద్యోగాల కల్పనపైన దృష్టి పెట్టు" అని బండి సంజయ్‌కి సూచించారు. తక్షణమే హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేయించాలంటూ కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను డిమాండ్ చేశారు. కాగా.. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరిక అంశం ముఖ్యమంత్రి పరిధిలోనిదన్నారు. శాసనసభ వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకోబోనని చెప్పారు. రాజకీయ వ్యవహారాల్లో తాను ఓ పరిధిని విధించుకున్నానని తెలిపారు. కాంగ్రెస్‌లో పోచారం చేరికపైన అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన స్పందించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తనతో చెప్పాలంటూ 14 నెలల కిందట రాహుల్‌గాంధీ చెప్పారని, ఆయన మాటను తాను జవదాటబోనన్నారు. తనలో ఎన్ని ఆలోచనలు ఉన్నా మౌనంగానే ఉంటానని చెప్పారు. కాగా.. తెలుగు ప్రజలు గుర్తించే అన్ని ప్రాంతాలతో తనకు సంబంధం ఉంటుందని జగ్గారెడ్డి అన్నారు. తెలుగు ప్రజలకు అనుకూలమైన రాజకీయ ప్రకటనలు చేసిన సందర్భాలూ ఉన్నాయన్నారు.

'సమ్మక్కసాగర్'పై పరిశీలన

» ఇచ్చంపల్లి బ్యారేజీపై బెట్టు సడలింపు!

» రాష్ట్ర అభ్యంతరాలతో కేంద్రంలో కదలిక

» ఎన్‌డబ్ల్యూడీఏ ఎజెండాలో చోటు

» 9న భేటీ.. రాష్ట్రాలకు సమాచారం

హైదరాబాద్, జూన్ 21(ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి నదుల అనుసంధానంలో ఇచ్చంపల్లి వద్దే బ్యారేజీ/రిజర్వాయర్ నిర్మిస్తామని ఇంత కాలం పట్టుబట్టిన కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణ అభ్యంతరాల నేపథ్యంలో ఒక మెట్టు దిగింది. గోదావరి బేసిన్‌లోని ఇంద్రావతి నదిపై సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) వద్ద తెలంగాణ కడుతున్న బ్యారేజీ నుంచి నీటిని తరలించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించి, అధ్యయనం చేయాలని నిర్ణయించింది. జూలై 9న జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) పాలకమండలి సమావేశం జరుగనుంది. దీని ఎజెండాను శుక్రవారం రాష్ట్రాలకు పంపింది. ఇందులో.. సమ్మక్క సాగర్ బ్యారేజీ, నిల్వ సామర్థ్యం పెంపును పరిశీలించనున్నట్లు సమాచారం ఇచ్చింది. గోదావరి-కావేరి నదుల అనుసంధానంలో భూపాలపల్లి జిల్లా ఇచ్చంపల్లి వద్ద 87 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కట్టి, నీటిని తరలిస్తామని గతంలో కేంద్రం ప్రకటించింది. అదే ప్రతిపాదనకు చాలాకాలంగా కట్టుబడి ఉంది. దీనికి బీఆర్ఎస్ ప్రభుత్వం అంగీకరించలేదు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక కూడా అదే వాదన వినిపించింది. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం తుపాకులగూడెం బ్యారేజీ నుంచి అనుసంధానం చేపడితే అభ్యంతరాలు లేవని కూడా ఎన్‌డబ్ల్యూడీఏకు తెలిపింది. తెలంగాణ ప్రాంతంలో గోదావరి నీటిని అందించడానికి వీలుగా 1980లో 118 మీటర్ల ఎత్తుతో ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణానికి బచావత్ ట్రైబ్యునల్ అనుమతి ఇచ్చింది. కానీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అభ్యంతరాలతో ఎత్తును 112 మీటర్లకు తగ్గించారు. మళ్లీ 1986-88లో 108 మీటర్లకు, కాలక్రమంలో 105 మీటర్లకు కుదించారు. తాజాగా నదుల అనుసంధానంలో 87 మీటర్లకు పరిమితం చేశారు. అయినా.. తమ నాలుగు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. మహారాష్ట్ర కూడా కొన్ని సందేహాలు లేవనెత్తింది.

తెలంగాణ అభ్యంతరాలతో..

ఇచ్చంపల్లి నుంచి 24 కిలోమీటర్ల దిగువనే తుపాకులగూడెం (సమ్మక్క) బ్యారేజీ ఉంది. తక్కువ దూరం ఉన్నందున.. ఇచ్చంపల్లి నుంచి ఆకస్మికంగా వరద విడుదలైతే నియంత్రించలేమని తెలంగాణ పలుమార్లు అభ్యంతరాలు తెలిపింది. ఇచ్చంపల్లి దిగువన 158 టీఎంసీల నీటి వినియోగం ఉందని, ఇచ్చంపల్లి బ్యారేజీ నిర్మించి ఏకకాలంలో.. గోదావరి- కావేరి అనుసంధానంతోపాటు దిగువన ఉన్న ప్రాజెక్టుల నీటి అవసరాలు తీర్చడం ఎలా సాధ్యమని ప్రశ్నించింది. తాజాగా మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, మరమ్మతులు చేసినా, బ్యారేజీ మళ్లీ దెబ్బతినదని చెప్పలేమని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ఇవ్వడంతో కేంద్రం కొత్త ప్రతిపాదనను తెచ్చింది. మేడిగడ్డను పునరుద్ధరించకపోతే ఇచ్చంపల్లి వద్ద ఎత్తు పెంచి రిజర్వాయర్ కట్టి, తిరుగు జలాలను కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద వాడుకోవడానికి వెసులుబాటు ఇస్తామని తెలంగాణకు సూచన చేసింది. కాగా, మేడిగడ్డ పునరుద్ధరణ ఇప్పట్లో సాధ్యం కానందున ఇచ్చంపల్లికి ఒప్పుకోవాలని సాగు నీటి నిపుణులూ ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో ఎన్‌డబ్ల్యూడీఏ పాలకమండలి ఏం నిర్ణయం తీసుకోనుందో తేలనుంది.

పట్టణ చెరువుల్ని కాపాడదాం

భూగర్భ జలాల్ని సంరక్షిద్దాం.. చెరువుల సమగ్ర వివరాలు ఇవ్వండి

» జూలై 5లోగా అందజేయండి

» మున్సిపల్ కమిషనర్లను ఆదేశించిన పురపాలక శాఖ సంచాలకురాలు

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని చెరువులను సంరక్షించడానికి పురపాలక శాఖ సిద్ధమవుతోంది. చెరువులను కాపాడడం ద్వారా పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను సంరక్షించాలన్న లక్ష్యంతో ముందుకెళుతోంది. చెరువుల రక్షణపై రేవంత్ సర్కారు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఇటీవల పురపాలకశాఖ సంచాలకురాలు దివ్యాదేవరాజన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. దేశంలో చెరువుల సంరక్షణకు అవలంబిస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకున్నారు. అందులో చర్చించిన అంశాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీల పరిధిలో (జీహెచ్ఎంసీ మినహా)ని చెరువుల సంరక్షణకు సూచనలు చేశారు. జూలై 5లోపు చెరువుల భౌగోళిక సరిహద్దులు తెలిపే చిత్రాలు, విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ వివరాలను పంపాలని ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, ఆక్రమణలు వంటి పూర్తి వివరాలను పంపాలని సూచించారు.

ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పునరుజ్జీవం

మున్సిపాలిటీల పరిధిలో ప్రస్తుతం ఉన్న చెరువులకు జీవం పోసేందుకు ఎన్జీవోలను, ప్రజలను, విద్యార్థులను భాగస్వాములను చేయాలని దివ్యదేవరాజన్ మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అన్ని నగరపాలక సంస్థలు, పెద్ద మున్సిపాలిటీల పరిధిలో కనీసం ఒక నర్సరీ అయినా పెంచడంతో పాటు చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలను చెరువుల్లో వేయకుండా చూడాలని ఆదేశించారు. మురుగు నీటిని ఎట్టి పరిస్థితుల్లో చెరువుల్లో చేరకుండా చూడాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులపై సీసీ కెమెరాల ఏర్పాటు, గ్రీన్‌ఫెన్సింగ్ కోసం వెదురు మొక్కల పెంపకం, కమ్యూనిటీ పోలీసింగ్ వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని మున్సిపాలిటీల నుంచి జూలై 5లోపు సూక్ష్మ ప్రణాళికను తయారు చేసి పంపాలని ఆదేశించారు.

ఆ చెరువులను పునరుద్ధరిస్తాం: భట్టి

గ్రేటర్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 282 చెరువులు ఆక్రమణకు గురైనట్లు 'తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టీజీఆర్ఏసీ)' రిమోట్ సెన్సింగ్ సాంకేతికత ద్వారా గుర్తించింది. ఇందులో గ్రేటర్ హైదరాబాద్‌లోనే 193 చెరువులు ఉండగా.. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో 89 ఉన్నాయి. 2014 నుంచి 2023 వరకూ ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలకు సంబంధించి టీజీఆర్ఏసీ నివేదికను రూపొందించింది. డిప్యూటీ సీఎం భట్టి గ్రేటర్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో గల చెరువులు, కుంటలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. చెరువులు, కుంటల ఆక్రమణలకు సంబంధించిన టోపోషీట్లను భట్టి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి.. ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను పునరుద్ధరించడానికి కృషి చేస్తామని భట్టి తెలిపారు.

48 అంశాలపై సర్వే నివేదిక ఇవ్వండి..

మున్సిపాలిటీల పరిధిలో ఉండే చెరువులకు సంబంధించి 48 అంశాల మీద నివేదిక పంపాలని దివ్యదేవరాజన్ కమిషనర్లను ఆదేశించారు. అందులో చెరువుల విస్తీర్ణం, ఆక్రమణలు, నీటి లభ్యత, సామర్థ్యం తదితర అంశాలపై సమగ్ర వివరాలు అందించాలని ఆదేశించారు.

ఏసీబీకి పట్టుబడ్డ సూరారం సీఐ!

- భూ వివాదంలో జోక్యం..లంచంగా రూ.5 లక్షలు డిమాండ్
- 2లక్షలు ఇచ్చినా మిగతా మొత్తం ఇవ్వాలని బాధితుడిపై ఒత్తిడి
- ఏసీబీకి సమాచారం.. రూ.లక్ష తీసుకుంటుండగా పట్టివేత

గాజులరామారం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో తలదూర్చి, ఓ వర్గానికి సహకరించేందుకు సిద్ధమైన ఆ సీఐ, లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు! లంచం తీసుకుంటుండగా ఆయన్ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పట్టుబడింది సూరారం సీఐ ఆకుల వెంకటేశం. కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో ఉంటున్న రత్నాకర్‌సాయిరాజ్ అనే వ్యక్తి గాజులరామారంలో స్థలం కొనుగోలుపై కొందరు వ్యక్తులతో ఒప్పందం చేసుకున్నాడు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య గొడవలు జరడటంతో సూరారం పోలీసులు రత్నాకర్‌సాయిరాజ్‌పై కేసు నమోదు చేశారు. రత్నాకర్‌సాయిరాజ్‌ను సూరారం సీఐ ఆకుల వెంకటేశం, పీడీయాక్ట్ పెడతామని బెదిరించారు. పీడీ యాక్ట్ పెట్టకుండా ఉండేందుకు, వివాదాస్పద స్థలంలో నిర్మాణాలకు సహకరించేందుకు లంచంగా రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రత్నాకర్‌సాయిరాజ్ నుంచి ఆయన గతంలోనే రూ. 2లక్షలు తీసుకున్నారు. మిగిలి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలని రత్నాకర్‌పై ఒత్తిడి తీసుకురావడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం సాయంత్రం రత్నాకర్‌సాయిరాజ్ నుంచి రూ. లక్ష తీసుకుంటుండగా సీఐ వెంకటేశాన్ని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన న్యాల్‌కల్ ఆర్ఐ

న్యాల్‌కల్, జూన్ 21: జాతీయ పెట్టుబడులు, తయారీ కేంద్రం(నిమ్జ్) నిర్వాసితుడైన ఓ రైతుకు పరిహారం వచ్చేలా చేశానంటూ ఆ రైతు నుంచి డబ్బు తీసుకున్న సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ ఆర్ఐ దుర్గయ్యను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ మెదక్ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్ గ్రామానికి చెందిన రైతు మల్లప్ప పాటిల్‌కు 2.36 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఈ స్థలానికి నిమ్జ్ ద్వారా పరిహారం వచ్చేలా తనవంతు కృషి చేశానని చెప్పి దుర్గయ్య రైతు మల్లప్ప నుంచి రూ.లక్ష డిమాండ్ చేశాడు. ఈ నెల 11న దుర్గయ్యకు మల్లప్ప రూ.30 వేలను ఇచ్చాడు. మిగిలిన రూ.70వేలు ఇవ్వాలంటూ దుర్గయ్య తరచూ ఫోన్ ద్వారా మల్లప్పను వేధించాడు. దీంతో బాధిత రైతు ఈ విషయంపై ఈ నెల 14న ఏసీబీని ఆశ్రయించాడు. మండలంలోని గంగ్వార్ చౌరస్తా వద్ద శుక్రవారం తన కిరాణా దుకాణంలోనే రైతు మల్లప్ప ఆర్ఐ దుర్గయ్యకు రూ.70వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

జూలై 5 వరకు కవిత కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ కేసులో ఆమెకు విధించిన జ్యుడీషియల్ కస్టడీని జూలై 5 వరకు పొడిగిస్తూ న్యాయస్థానం శుక్రవారం ఆదేశాలిచ్చింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవితను మార్చి 15న అరెస్టు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మార్చి 16న ఆమెను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టింది. 10 రోజుల ఈడీ కస్టడీ తర్వాత కవితను తిహాడ్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలులోనే ఉన్న కవితను సీబీఐ ఏప్రిల్ 11న అరెస్టు చేసింది. ఈడీ కేసులో జ్యుడీషియల్ కస్టడీ జూలై 3 వరకు ఉంది. అయితే, సీబీఐ కేసులో జ్యుడీషియల్ కస్టడీ శుక్రవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో జైలు అధికారులు కవితను వర్చువల్ విధానంలో రౌస్ అవెన్యూ కోర్టు ముందు హాజరుపరిచారు..

చెంచు మహిళపై దాష్టీకం.. నలుగురికి రిమాండ్

నాగర్‌కర్నూల్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో చెంచు మహిళపై దాష్టీకం ప్రదర్శించిన నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మొలచింతలపల్లిలో ఓ చెంచు మహిళను వివస్త్రను చేసి ఆమె కళ్లలో, నోటిలో పచ్చిమిరపకాయలు దంచి పెట్టి మర్మాంగాలపై డీజిల్ పోసి నిప్పంటించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. పోలీస్ యంత్రాంగాన్ని, ప్రజా సంఘాలను కదిలించింది. వెంటనే స్పందించిన పోలీసులు మొలచింతలపల్లికి వెళ్లి బాధితురాలిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. నిందితులు బండి వెంకటేశ్వర్లు, బండి శివమ్మ, లింగస్వామి, లక్ష్మీని అరెస్టు చేశారు. వీరిని నాగర్‌కర్నూలు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు శుక్రవారం హాజరుపరిచారు. నిందితులను రిమాండ్ నిమిత్తం మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్టు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

25 కి.మీ వెంటాడి 70 లక్షల గంజాయి స్వాధీనం

దుమ్ముగూడెం, జూన్ 21: కారులో అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.70లక్షల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సినీ ఫక్కీలో 25 కిలోమీటర్లు వెంటాడి పట్టుకున్నారు. ఏపీ నుంచి ఒక కారు గంజాయి ప్యాకెట్లతో భద్రాచలం వైపుగా వస్తోందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావుకు శుక్రవారం తెల్లవారుజామున సమాచారం అందింది. సీఐ తన సిబ్బందితో కలిసి కూనవరం రోడ్డులో కాపలా ఉన్నారు. భద్రాచలం వంతెన సమీప చెక్‌పోస్టు వద్ద కొంత మంది సిబ్బందిని ఉంచారు. కూనవరం రోడ్డులోనే తమిళనాడు రిజిస్ట్రేషన్‌కు చెందిన ఓ కారు వేగంగా వెళ్లడంతో దాన్ని సీఐ వెంబడించారు. అధికారులను గమనించిన స్మగ్లర్లు తమ కారును భద్రాచలం వంతెన వైపు కాకుండా చర్ల వైపునకు మళ్లించారు. వేగంగా వెళుతున్న స్మగ్లర్ల కారుకు దుమ్ముగూడెం ఎస్ఐ కేశవరావు, పోలీసు సిబ్బంది బైక్‌లను అడ్డుపెట్టి ఆపేశారు. కారులోని ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. స్మగ్లర్లను వెంబడిస్తూ వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు కారు డిక్కీను తెరిచి చూడగా, ఒక్కొక్కటి కిలో బరువుగల 280 గంజాయి ప్యాకెట్లున్నాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.70లక్షల దాకా ఉంటుందన్నారు.

బాధితులు ఎవరు? నిర్వాహకులు ఎవరు?

- మహిళల అక్రమ రవాణా సమస్యలపై మార్గదర్శకాలేవి?.. హైకోర్టులో వ్యాజ్యం

హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): మహిళల అక్రమ రవాణా నిరోధం, బాధితులకు పునరావాసం కల్పించే విషయంలో సరైన మార్గదర్శకాలు లేవంటూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలయింది. వీటి రూపకల్పనపై వివరణ సమర్పించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. బలవంతంగా వేశ్యా వృత్తిలోకి ప్రవేశించిన బాధిత మహిళలకు పునరావాసం కల్పించడం, వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన హోంకు చేర్చడం వంటి అంశాలపై ఎలాంటి మార్గదర్శకాలు అందుబాటులో లేవని పేర్కొంటూ ప్రజ్వల అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్ దాఖలు చేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాది రవిచందర్ వాదనలు వినిపిస్తూ మహిళా అక్రమరవాణా నిరోధక చట్టం- 1956 ప్రకారం.. మహిళలను అక్రమంగా రవాణా చేస్తున్నది ఎవరు? వేశ్యా వృత్తి నిర్వాహకులు ఎవరు? బాధితులు ఎవరు? అనే తేడాను గుర్తించే వ్యవస్థ ఏదీ లేదని పేర్కొన్నారు. ఇటీవల ఓ హోటల్ నుంచి ఇద్దరు మహిళలను రక్షించారని, నిజానికి వారు నిర్వాహకులు కాగా వారిని బాధితులుగా గుర్తించి ప్రభుత్వ పునరావాస హోంకు పంపించారని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. బాధితులు, నిర్వాహకులతో ప్రత్యేకంగా వ్యవహరించేలా మార్గదర్శకాల రూపకల్పనపై వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది.

పెట్టుబడి లేక రైతు ఆత్మహత్య

- మరో ఘటనలో కౌలు రైతు బలవన్మరణం

నంగునూరు, వలిగొండ, జూన్ 21: పంట సాగుకు పెట్టుబడి లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా.. చేసిన అప్పులను తీర్చే మార్గం లేక మరో కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల గ్రామానికి చెందిన గజ్వేల్లి వెంకటయ్య(67)కు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పొలం సాగుకు డబ్బులు లేవని, పోయినసారి పొలంలో బోరు వేస్తే సరిగ్గా దిగుబడి రాలేదని తన ఇద్దరు కుమారులకు చెబుతూ బాధపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 18న తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామానికి చెందిన జోర్క నరేశ్(31) నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని రెండేళ్లుగా పత్తి సాగు చేస్తున్నాడు. వ్యవసాయ పెట్టుబడికి సుమారు రూ.4.50లక్షల వరకు అప్పు చేశాడు. పంట దిగుబడి సరిగా రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

వామ్మో వైరల్ న్యూమోనియా

(మొదటి పేజీ తరువాయి)

చేరి ప్రత్యేక చికిత్సలు తీసుకున్నవారు దాదాపు 50 మంది దాకా ఉన్నట్టు సమాచారం. తరచుగా బయటతిరిగేవారిలో, మంచు ఎక్కువగా ఉండే ప్రదేశాలకు వెళ్లొచ్చిన వారిలో ఈ తరహా ఇబ్బందులు ఎక్కువగా చూస్తున్నామని వైద్యులు పేర్కొంటున్నారు.

ఇవీ లక్షణాలు..

వాతావరణ మార్పులకు ఎక్కువగా గురైనవారిలో వైరల్ న్యూమోనియా ఎక్కువగా కనపడుతోంది. దీనిబారిన పడ్డవారిలో ముందుగా జలుబు కనిపిస్తుందని.. నీరసనగా తయారవుతారని, రెండు రోజుల తర్వాత దగ్గు, ఆయాసం మొదలవుతున్నాయని వైద్యులు వివరించారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే క్రమంగా ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోతాయని హెచ్చరించారు. వైరల్ న్యూమోనియాను సిటీ స్కాన్ ద్వారా నిర్ధారించవచ్చు. వైరల్ న్యూమోనియా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో.. మూత్రపిండాలు, మధుమేహం, కేన్సర్ బాధితులు, స్టెరాయిడ్స్ తీసుకుంటున్న వారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని.. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని.. ఇంటికి రాగానే కాళ్లు, చేతులను శుభ్రం చేసుకోవాలని (లేదా) స్నానం చేయాలని.. సూచిస్తున్నారు. వీలైనంతవరకూ రద్దీ ప్రాంతాలకు వెళ్లవద్దని చెబుతున్నారు. అవసరమైన వారు ఫ్లూ, న్యూమోనియా వ్యాక్సిన్లు తప్పని సరిగా వేయించుకోవాలని వైద్యులు పేర్కొన్నారు.

అందరూ జాగ్రత్తగా ఉండాలి..

ఇటీవలి కాలంలో మా దగ్గరికి చాలా మంది.. జ్వరం, గొంతునొప్పి, బలహీనత, తుమ్ములు, దగ్గు, ఆయాసం వంటి లక్షణాలతో వస్తున్నారు. వారిలో చాలామందికి వైరల్ న్యూమోనియా నిర్ధారణ అవుతోంది. కొంతమందిని ఐసీయూలో ఉంచి చికిత్స చేయాల్సి వస్తోంది. మరికొందరికి.. చిన్న, పెద్ద వెంటిలేటర్, ఎక్మో చికిత్సలు అందిస్తున్నాం. చార్‌ధామ్ యాత్రకు వెళ్లి వచ్చినవారిలో 50-60 ఏళ్లవారిలో ఈ సమస్య కనిపిస్తోంది. 30-40 ఏళ్లవారు కూడా వేరే ప్రాంతాలకు వెళ్లి వైరల్ న్యూమోనియా బారిన పడుతున్నట్టు గుర్తించాం. 50 ఏళ్లు దాటిన ఇద్దరికి ఎక్మో చికిత్స అందించాం. ఐసీయూల్లో దాదాపు సగం మంది ఈ తరహా బాధితులే ఉంటున్నారు. అసలే వాతావరణం మారుతున్న నేపథ్యంలో.. అందరూ జాగ్రత్తగా ఉండాలి.



- డాక్టర్ విశ్వేశ్వరన్, సీనియర్ ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్టు, యశోద ఆస్పత్రి

నీట్ మళ్లీ నిర్వహించాల్సిందే

హైదరాబాద్‌లో విద్యార్థి సంఘాల ఆందోళనలు.. సుప్రీం జడ్జి లేదా సీబీఐతో విచారణకు డిమాండ్

- ఎన్టీఏను రద్దు చేయాలి: బల్మూరి
- కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడికి యూత్ కాంగ్రెస్ నేతల యత్నం



ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఎన్టీఏ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నేతలు

బర్కత్‌పుర/తార్నాక/రాయదుర్గం/హైదరాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): నీట్, నెట్ ప్రశ్నపత్రాలు లీక్ కావడంపై విద్యార్థి, యువజన సంఘాలు మండిపడ్డాయి. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలు, యూనివర్సిటీల్లో ఆందోళనలు నిర్వహించాయి. నీట్ పరీక్షను రద్దు చేసి.. తిరిగి నిర్వహించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశాయి. నీట్, నెట్ పరీక్షల అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని కోరాయి. నీట్, నెట్ పరీక్షల్లో అవకతవకలు జరగడాన్ని నిరసిస్తూ ఓయూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఇందులో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, వీజేఎస్, ఏపీఎస్‌యూ, డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వైజేఎస్, యువజన కాంగ్రెస్ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. నీట్ అవకతవకలపై కేంద్రం స్పందించేలా ఒత్తిడి తేవాలని కిషన్‌రెడ్డిని అపాయింట్‌మెంట్ కోరగా ఆయన ఇప్పటివరకు స్పందించలేదన్నారు. కిషన్‌రెడ్డి తీరుకు నిరసనగా శనివారం ఓయూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆయన క్యాంపు ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టి.నాగరాజు, నెల్లి సత్య, నాగేశ్వర్‌రావు, మహేశ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నం..

నీట్ అక్రమాలకు నిరసనగా శుక్రవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. బర్కత్‌పుర యువతి మండలి చౌరస్తా నుంచి కిషన్‌రెడ్డి ఇంటి వైపు కార్యకర్తలు ర్యాలీగా వస్తుండగా వారిని నిలువరించారు. దీంతో వారికి పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలోనే యూత్ కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మోతె రోహిత్‌తో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షను రద్దు చేసి ప్రధాని మోదీ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

హెచ్‌సీయూలోనూ..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద పలు విద్యార్థి సంఘాలు నిరసన తెలిపాయి. ఎన్టీఏను రద్దు చేయాలని వర్సిటీ మెయిన్ గేటు ఎదురుగా సంఘాల నేతలు ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి, యూజీసీ చైర్మన్, ఎన్టీఏ డైరెక్టర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్, బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్, ట్రైబల్ స్టూడెంట్స్ ఫ్రంట్, దళిత్ స్టూడెంట్స్ యూనియన్ తదితర సంఘాల నేతలు ఆందోళనలో పాల్గొన్నారు.

ఓయూలో ఎన్టీఏ దిష్టిబొమ్మ దహనం

నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఎన్టీఏ దిష్టిబొమ్మను సంఘం నేతలు జీవన్, పృథ్వీతేజ, శ్రీహరి తదితరులు దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎన్టీఏను పూర్తిగా ప్రక్షాళన చేసి బాధ్యులైనటువంటి అధికారులను వెంటనే తొలగించాలన్నారు.

అనుమతుల్లేకుండానే ఆస్పత్రుల నిర్వహణ!

- వైద్య అధికారుల తనిఖీల్లో విస్తుపోయే అంశాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా.. తొలుత స్థానికంగా ఉండే ఆస్పత్రులు లేదా క్లినిక్‌ల్లో చూపించుకోవడానికే ప్రజలు ప్రాధాన్యం ఇస్తుంటారు. స్థానికంగా అందుబాటులో ఉండడం, తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తుండడమే.. దీనికి కారణం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇలాంటి ఆస్పత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్‌హోమ్‌లు వేలల్లోనే ఉన్నాయి. కానీ, వీటిలో చాలా వరకు అనుమతి లేకుండానే కొనసాగుతున్నాయని తనిఖీల్లో తేలింది. హైదరాబాద్ పరిధిలో 10 నుంచి 250 పడకలు ఉన్న ఆస్పత్రులు 6వేల వరకు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 3వేల వరకు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు ఉండగా, చిన్నపాటి క్లినిక్‌లు కూడా వేలల్లోనే ఉన్నాయి. ఈ మేరకు అసలు అనుమతులు ఉన్నవి ఎన్ని? లేనివి ఎన్ని? అనే లెక్కలు తీసే పనిలో వైద్యాధికారులు ఉన్నారు. ప్రత్యేక బృందాలు కొన్ని రోజులుగా వివరాలు సేకరిస్తున్నాయి. అయితే, ఇప్పటిదాకా చేపట్టిన తనిఖీల్లో నే విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే దాదాపు 400పైగా ఆస్పత్రులకు అనుమతులు లేనట్లు తేలింది. అధిక శాతం ఆస్పత్రులు తాత్కాలిక అనుమతి తీసుకుని వాటితోనే నెట్టుకొస్తున్నాయి. మరికొన్ని ఆస్పత్రులు అయిదేళ్ల వరకు అనుమతి తీసుకుని, ఆ తర్వాత కూడా కొనసాగుతున్నాయి. మెజారిటీ నర్సింగ్‌హోమ్‌లు నిబంధనలకు విరుద్ధం కొనసాగుతున్నాయి. 3వేల నర్సింగ్‌హోమ్‌లకు గాను 800లోపు మాత్రమే అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాయి. చాలా నర్సింగ్ హోమ్‌ల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థే లేదు. ఆస్పత్రుల్లో ఎక్కడా నిబంధనలకు అనుగుణంగా ఫర్నిచర్, పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది ఉండడం లేదు. చాలా చోట్ల నిపుణులైన వైద్యులు కూడా లేరు. అనుమతి లేని వైద్యులు సైతం ఇష్టానుసారం చికిత్సలు చేస్తున్నారు. వాస్తవానికి జీవో నంబర్ 135 ప్రకారం ఆస్పత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్‌హోమ్‌ల నిర్వాహకులు నిబంధనలు పాటించాల్సిందే. ఆస్పత్రిలో అన్ని వసతులు సమకూర్చుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ (డీఎంహెచ్‌వో) కార్యాలయంలో అనుమతి పొందాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ఆస్పత్రి, నర్సింగ్ హోమ్‌లకు 90 రోజుల పాటు తాత్కాలిక అనుమతి ఇస్తారు. డీఎంహెచ్‌వో తనిఖీల సందర్భంగా ఆస్పత్రి భవనానికి జీహెచ్ఎంసీ పర్మిషన్ ఉందా? లేదా? అగ్నిమాపక దళం నుంచి అనుమతి ఉందా? అద్దె భవనం అయితే లీజు పత్రాలు, కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతి తదితర అంశాలను పరిశీలించిన తర్వాత అన్ని బాగున్నాయని అనుకుంటే పూర్తి స్థాయి అనుమతి లభిస్తుంది. ఒక వేళ అధికారులు అనుమతి ఇస్తే తొలుత ఐదు నెలలకే ఇస్తారు. ఆ తర్వాత ఐదు సంవత్సరాలకు అనుమతి లభిస్తుంది. ఆ తర్వాత స్థానిక యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రతి మూడు నెలలకు ఒక సారి పరిశీలిస్తారు. కానీ, క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదు. జీహెచ్ఎంసీ, అగ్నిమాపక దళ అనుమతి సర్టిఫికెట్ ఉందా? లేదా? అని పరిశీలిస్తున్నారే తప్ప..ఆస్పత్రుల్లో వాటిని ఏర్పాటు చేశారా? లేదా? అని చూడడం లేదు. ఫలితంగా తాత్కాలిక అనుమతులతోనే ఏళ్లపాటు ఆస్పత్రులు కొనసాగుతున్నాయి.

ఉసురు తీసిన హాస్టల్ భయం

- కళాశాల హాస్టల్ నుంచి పారిపోతూ విద్యుదాఘాతానికి గురై.. ఇంటర్ విద్యార్థి దుర్మరణం
- రెండ్రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు



గిరీష్ అరావత్ (ఫైల్)

హయత్‌నగర్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటికి, అమ్మానాన్నకు దూరంగా హాస్టల్‌లో ఉంటూ చదువుకోవడం ఆ బాలుడికి చాలా భయంకరంగా అనిపించింది. తన కష్టాన్ని అమ్మకు చెబితే.. కొడుకు భవిష్యత్తు కోసం ఆ తల్లి నచ్చజెప్పింది. కానీ, హాస్టల్‌లో ఉండే ధైర్యం చేయలేకపోయిన ఆ బాలుడు అక్కడి నుంచి పారిపోయేందుకు సాహసించి ప్రాణాలు కోల్పోయాడు. హయత్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ కార్పొరేట్ కళాశాల వద్ద ఈ ఘటన జరిగింది. సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలో నివాసముండే కర్రీ విజయ్‌కుమార్, చాముండేశ్వరి దంపతులకు గిరీష్ అరావత్(16) అనే కుమారుడు ఉన్నాడు. గిరీష్ పదో తరగతి పూర్తవ్వడంతో ఇంటర్మీడియట్ కోసం కొహెడాలోని ఓ రెసిడెన్షియల్ కళాశాలలో పది రోజుల క్రితం చేర్పించారు. హాస్టల్‌లో ఉండటాన్ని ఇష్టపడని గిరీష్ తరచూ తల్లికి ఫోన్ చేసి రమ్మని పిలిచేవాడు. ఈ క్రమంలో గత ఆదివారం హాస్టల్‌కు వెళ్లిన చాముండేశ్వరి కొడుకును కలిసి భోజనం తినిపించి ధైర్యం చెప్పి వచ్చారు. కానీ, హాస్టల్‌లో ఉండలేకపోయిన గిరీష్ అక్కడి నుంచి పారిపోయేందుకు నిర్ణయించుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి తర్వాత పారిపోయేందుకు హాస్టల్‌లో తన గది నుంచి బయటికొచ్చాడు. కళాశాల ఆగ్నేయం వైపున ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో దానిని దూకేందుకు వెళ్లాడు. ఆ గోడ పైకి ఎక్కిన గిరీష్‌కు విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న పొదల్లో పడిపోయాడు. అయితే, గురువారం ఉదయం గిరీష్ హాస్టల్‌లో కనిపించకపోవడంతో యాజమాన్యం హయత్‌నగర్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. అయితే, గిరీష్ బుధవారం అర్ధరాత్రి తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళుతున్న సీసీ కెమెరా దృశ్యాలను కళాశాల యాజమాన్యం శుక్రవారం గుర్తించింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో గాలించగా అక్కడి పొదల్లో గిరీష్ మృతదేహం కనిపించింది. విద్యుదాఘాతం వల్ల గిరీష్ శరీరం నల్లగా మారిపోగా చర్మం కూడా కాలిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో యోగాసనాలు వేస్తున్న ఉపాధి కూలీలు

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- మనిషి జీవితంలో మంచి డాక్టర్ యోగా: కిషన్ రెడ్డి
- యోగాను విశ్వవ్యాప్తం చేసింది మోదీనే : గవర్నర్

హైదరాబాద్, బర్కత్‌పుర, నందిగామ, మేడ్చల్ టౌన్, వికారాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : మనిషి జీవితంలో యోగా ఓ మంచి డాక్టర్ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నిత్యం యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిజాం కళాశాల మైదానంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర సహాయ మంత్రి సతీష్‌చంద్ర దూబే, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి యోగా చేశారు. ఇక, యోగా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తుందని రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. ప్రధాని మోదీ యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 5వేల మంది అభ్యాసీలతో కలిసి యోగాసనాలు వేశారు. ఇక, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హైదరాబాద్‌లోని తన నివాసంలో యోగా చేశారు. ఇక, పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప వారసత్వం యోగా అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఈటల పలు ఆసనాలు వేశారు.

ఉపాధి కూలీల యోగా సందడి

కట్టంగూరు, అడవిదేవులపల్లి, జూన్ 21: నల్లగొండ జిల్లా కట్టంగూరు, అడవిదేవులపల్లి మండలాల్లో ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు. కట్టంగూరు మండలంలోని కల్మెర, ఎరసానిగూడెం, బొల్లేపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలతో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు ఆసనాలు వేయించారు. అడవిదేవులపల్లిలో ఎంపీడీవో కరుణాకర్‌రావు ఉపాధి కూలీలతో యోగాసనాలు వేయించారు.

కడుపునొప్పి భరించలేకే రూపాదేవి ఆత్మహత్య!

ఆమెకు గైనిక్ సమస్యలు.. తల్లి భూలక్ష్మమ్మ వాంగ్మూలం

- కుటుంబంతో తిరుమల వెళ్లొచ్చాక చొప్పదండికి వెళ్లిన ఎమ్మెల్యే సత్యం
- వెళ్లొద్దని, ఇంట్లోనే ఉండాలన్న రూపాదేవి
- ఆ రోజు రాత్రి భర్తకు ఫోన్, వెంటనే రాకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరిక?
- ఆ వెంటనే బెడ్‌రూంలోకి వెళ్లి చున్నీతో ఉరి
- ముగిసిన అంత్యక్రియలు, బోరుమన్న సత్యం

అల్వాల్/మచ్చబొల్లారం జూన్ 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి బలవన్మరణం వెనుక గల కారణాలు బయటకు రాలేదు. అయితే ఆమెకు గైనిక్ సమస్యలు ఉన్నాయని, కడుపునొప్పి తట్టుకోలేకే ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులకు తల్లి భూలక్ష్మమ్మ వాంగ్మూలమిచ్చారు. రూపాదేవి సున్నిత మనస్కురాలనీ చెబుతున్నారు. రూపాదేవి అల్వాల్‌లోని తమ నివాసంలోని పడక గదిలో గురువారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సత్యంతో రూపాదేవిది ప్రేమ వివాహం. ఆమె న్యాయవాద విద్య, బీఈడీ చదివారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించారు. ఓయూలో న్యాయవాద విద్య చదువుతున్న రోజుల్లోనే అక్కడ ఆమెకు మేడిపల్లి సత్యం పరిచయమయ్యారు. 2012లో పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు కుమారుడు యోజిత్ (11), కుమార్తె రుషిక్శ్రీ (8) ఉన్నారు. తొలుత ఆమెకు మునీరాబాద్‌లో పోస్టింగ్ వచ్చింది. తర్వాత మేడ్చల్‌లోని రావల్‌కోల్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు మారారు. నెల క్రితం ఈ కుటుంబం అల్వాల్‌లోని పంచశీలకాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లోకి షిఫ్ట్ అయింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భర్త మేడిపల్లి సత్యం చొప్పదండి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో రూపాదేవి, తోటి ఉపాధ్యాయులకు మిఠాయిలు పంచారు. ఇటీవల సత్యం.. భార్య రూపాదేవి, పిల్లలతో కలిసి తిరుమలకు వెళ్లొచ్చారు.

ఆ రోజు ఏం జరిగింది?

వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తిరుమల వెళ్లడంతో సత్యం మూడు రోజులు చొప్పదండి నియోజకవర్గం బయటే ఉండిపోవాల్సి వచ్చింది. గురువారం నియోజకవర్గానికి వెళ్లి ప్రజలను కలవాల్సి ఉందంటూ భార్యకు చెప్పి ఆయన బయలుదేరారు. అయితే వెళ్లొద్దని, ఇంట్లోనే ఉండాలంటూ భర్తకు రూపాదేవి చెప్పినట్లు తెలుస్తోంది. ఆ రోజు రాత్రి 10:30కు భర్తతో రూపాదేవి ఫోన్లో మాట్లాడారు. వెంటనే రావాలని, లేకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పినట్లు తెలుస్తోంది. కంగారుపడిన సత్యం, ఎలాంటి అఘాయిత్యానికి పాల్పొడొద్దని, తాను అప్పటికే బయలుదేరినట్లు చెప్పినట్లు సమాచారం. అయితే ఫోన్ పెట్టేసిన తర్వాత రూపాదేవి తన పడకగదిలోకి వెళ్లిపోయి, గడియ పెట్టుకున్నారు. ఆ సమయంలో ఆమె తల్లి భూలక్ష్మమ్మ, కుమారుడు యోజిత్, కుమార్తె రుషికలతో పాటు సత్యం తరఫు బంధువు ఇంట్లోనే ఉన్నారు. కొద్దిసేపటికి పడక గది తలుపులు తెరిచేందుకు చిన్నారులు ప్రయత్నించినా సాధ్యపడలేదు. కూతురు రుషిక్శ్రీ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పింది. అపార్ట్‌మెంట్‌లోనే ఉన్న కొందరు వ్యక్తులొచ్చి తలుపులను బద్దలు కొట్టారు. అప్పటికే రూపాదేవి సీలింగ్‌కు చున్నీతో ఉరివేసుకున్నారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశాక మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. తిరుమలగిరిలోని స్వర్గవాటికలో రూపాదేవి అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంత్యక్రియల సమయంలో ఎమ్మెల్యే సత్యం భావోద్వేగానికి గురయ్యారు. కుమార్తె, కొడుకులను దగ్గరకు తీసుకొని బోరున విలపించారు.



రూపాదేవి అంత్యక్రియల్లో విలపిస్తున్న భర్త సత్యం, కుమారుడు యోజిత్



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 22 జూన్ 2024



టెస్టింగ్‌లో 'నోట్స్'



యూట్యూబ్ కొత్తగా 'నోట్స్' ఫీచర్‌ను తీసుకు వచ్చే ప్రయత్నంలో ఉంది. టెస్టింగ్ దశలో ఉన్న ఈ ఫీచర్ ఎక్స్‌కు చెందిన కమ్యూనిటి నోట్స్ మాదిరిగానే ఉండనుంది. వీడియోపై కాంటెక్స్ రాసేందుకు ఇది వీలుకల్పిస్తుంది. మిస్‌లీడింగ్, ఔట్ ఆఫ్ కాంటెక్స్ అని టాగ్ కూడా చేయవచ్చు. టెస్టింగ్ దశలో భాగంగా ముందుగా కొందరు యూజర్లు, క్రియేటర్లకు ఈ ఫీచర్ అందుబాటులో ఉంటుంది. రెలవెంట్, టైమ్లీ, ఈజీ టు అండర్‌స్టాండ్ కాంటెక్స్ వంటివి వీడియోలపై రాసే అవకాశం లభిస్తుంది. ఒక పాటకు పారడీ నుంచి ప్రొడక్ట్ న్యూవెర్షన్ రెవ్యూ, ఎప్పటిదో ఇప్పటిదంటూ పెట్టిన ఫుటేజీని గుర్తించడం వంటివన్నీ ఈ ఫీచర్‌తో తెలుసుకునేందుకు వీలుంటుంది. ఇంగ్లీష్‌లో రాయవచ్చు. అమెరికాలోని మొబైల్ యూజర్లకు మొదట ఇది అందుబాటులోకి వస్తుంది. టెస్టింగ్ దశలో ఎవాల్యుయేటర్లు ఈ ఫీచర్‌కు రేటింగ్ ఇస్తారు. ఏ మేరకు ఉపయోగపడుతుందన్నది తెలియజేస్తారు.

అందుబాటులోకి గూగుల్ జెమిని యాప్

గూగుల్ జెమిని మొబైల్ యాప్ మన దేశంలో అందుబాటులోకి వచ్చింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీన్ని పొందవచ్చు. అడ్వాన్స్‌డ్ ఏఐ ఫీచర్లను ఉపయోగించుకోవచ్చు. తెలుగు సహా తొమ్మిది భారతీయ భాషలను ఇది సపోర్ట్ చేస్తుంది. జెమిని 1.5ప్రొ కూడా ఇండియాలో లభిస్తుంది. జెమిని అడ్వాన్స్‌డ్ ఫీచర్స్ విషయానికి వస్తే,



- దీంతో 1500 పేజీల మేర డాక్యుమెంట్స్‌ను అప్‌లోడ్ చేయవచ్చు. అంతేకాకుండా 100 ఈమెయిల్స్‌ను చాట్‌బోట్ సమ్మరైజ్ చేస్తుంది. ఇచ్చిన డేటా ఆధారంగా చర్యకు అవసరమైన ఇన్‌సైట్స్‌ను అందిస్తుంది.
- కాంప్లెక్స్ డేటా అనాల్సిస్ సౌలభ్యం కూడా ఉంది. గూగుల్ షీట్స్, సీఎస్‌వీలు, ఎక్సెల్ నుంచి పొందిన సమాచారం నుంచి విశ్లేషణ మొదలుకుని ఇంటరాక్టివ్ చార్ట్స్ వరకు పొందవచ్చు.
- గూగుల్ మెసేజెస్‌తో ఇంటిగ్రేట్ అవుతుంది. దాంతో స్నేహితులు, కొలీగ్స్‌తో కొలాబిరేషన్‌కు వీలుపడుతుంది.

సెక్యూరిటీ లూప్‌హోల్!




గూగుల్ - పీసీలపై ఉండే క్రోమ్ బ్రౌజర్‌లో భద్రతపరమైన లోపాలు తలెత్తాయని, రాబోయే రోజుల్లో సరికొత్త అప్డేట్‌తో వాటన్నింటినీ పరిష్కరిస్తామని ప్రకటించింది. సెక్యూరిటీ సమస్యలకు వీలున్న వాటిని మొదట ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సీఈఆర్‌టీ) గుర్తించింది. విండోస్ పీసీలు, లినక్స్, మేక్ కంప్యూటర్స్‌లో ఉన్నట్టు కనుగొన్నారు. వీటిలో టైప్ కన్ఫ్యూజన్, వెబ్‌అసెంబ్లీ అమలులో అవకతవకలు, డాన్ సంబంధ సమస్యల ఫలితమే ఇది అని సీఈఆర్‌టీ తేల్చింది. గూగుల్ వీటికి అంగీకరించడానికి తోడు తదనుగుణ చర్యలు తీసుకుంటోంది. రిలీజ్ చేయబోయే అప్డేట్స్‌ను కూడా వెల్లడించింది. ఈలోపు గూగుల్ పిక్సెల్ ఫోన్స్‌లోనూ సంబంధిత సమస్యలను కనుగొన్నారు. లక్షిత డివైజ్‌లను టార్గెట్ చేస్తూ ఇప్పటికే రిమోట్ హేకర్ ఒకరు యత్నించారు. సులువుగా డివైజ్‌పై పట్టు సాధించాడు. డినయల్ ఆఫ్ సర్వీస్(సర్వీస్ తిరస్కరణ) అటాక్‌ను కూడా నిర్వర్తించాడు.

'లాగిటెక్' కొత్త కీ బోర్డు

లాగిటెక్ కొత్త కీబోర్డును ప్రకటించింది. పదేళ్ళ నాటి కీస్-టు-గో కీబోర్డ్ స్థానే కొత్తది 'కీస్-టు-గో 2' ఈ నెల మార్కెట్లోకి వస్తోంది. డిజైన్ నుంచి ఫీచర్ల వరకు అన్నింటినీ ఆధునీకరించారు. లాగిటెక్ కీబోర్డ్ మొదట 2014లో విడుదలైంది. రెండేళ్ళ క్రితం కొద్దిపాటి మార్పులు కూడా చేశారు. ఇప్పుడు మరిన్ని మార్పులతో విడుదల అవుతోంది. ప్లాస్టిక్ డెక్‌పై సక్రమంగా కీ, స్విచ్‌లు ఉన్నాయి. కీ బోర్డ్‌పై పనిచేస్తునప్పుడు దాని చుట్టూ ఉన్న కవర్ మూసుకునేలా ఏర్పాటు చేశారు. తయారీలో 36 శాతం మేర రీసైక్లిడ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించారు. సూపర్ థిన్ అంటే 4.57 ఎంఎం ఉంది. మూసినప్పుడు 8.77 ఎంఎం అంటే కవర్‌తో కలిపి ఉంటుంది. కాయిన్ సెల్ బ్యాటరీలతో పనిచేస్తుంది. 36 నెలలు వస్తుంది. లాగిటెక్‌కు చెందిన 'ఈజీ-స్విచ్' కీ సపోర్ట్ ఉంది. వివిధ డివైజ్‌ల మధ్య స్వైపింగ్ అవకాశం ఉంది. రమారమి 80 డాలర్లకు రెండు వెరైటీలు అంటే ఒకటి యాపిల్ డివైజ్‌ల కోసం మరొకటి అన్ని రకాలకు ఉపయోగపడేలా రూపొందించారు. లిలాక్, పేల్ గ్రే, గ్రాఫైట్ కలర్‌వేస్ రంగుల్లో రెండు వెరైటీలు లభ్యమవుతాయి.





షేర్ మెనూలో ఆండ్రాయిడ్ డివైజ్ లింక్

మైక్రోసాఫ్ట్ - విండోస్ 11లో చేయబోయే అప్డేట్‌తో ఆండ్రాయిడ్ ఫోన్ డివైజ్, షేర్ మెనూతో ఇంటిగ్రేట్ కానుంది. షేర్ మెనూ కింద ఫైల్స్ లింక్స్ తదితరాలను పీసీల నుంచి ఆండ్రాయిడ్ ఫోన్లకు పంపుకోవచ్చు. ఇందు కోసం షేర్ మెనూలో 'మై ఫోన్' జతపడుతుంది. ఫోన్ లింక్ ద్వారా ఇది పనిచేస్తుంది. అలాగే ఆండ్రాయిడ్ డివైజ్‌ల్లో ఉండే యాప్‌తో సాధ్యమవుతుంది. నోటిఫికేషన్స్ సింకింగ్ నుంచి యాప్స్ -ఫైల్స్ యాక్సెస్ తదితరాలకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. సరికొత్త ఎడిషన్స్‌తో ఐటెమ్స్‌ను వేగంగా, సులువుగా పంపుకోవచ్చు. అయితే ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న సమాచారం మాత్రం లేదు. బేటా టెస్టర్లకు మాత్రమే ప్రస్తుతానికి దీన్ని పంపుతోంది.

క్షణాల్లో యాప్ పేర్లను దాయొచ్చు!

ఐఫోన్‌లో యాప్స్ పేర్లను దాచిపెట్టవచ్చు. ఐఫోన్ కస్టమైజేషన్ కోసం ఐఓఎస్ 18 సరికొత్త ప్రమాణాన్ని సెట్ చేసింది. తద్వారా ఐఫోన్ హోమ్ స్క్రీన్‌పై యాప్‌ల పేర్లను దాచి ఉంచొచ్చు. అందుకోసం...



- ఐఫోన్ హోమ్ స్క్రీన్‌పై లాంగ్ ప్రెస్ చేయాలి.
- ఎడిట్‌ని టాప్ చేయాలి. కస్టమైజ్‌ను సెలెక్ట్ చేసి లార్జ్‌ని ఎంచుకోవాలి.
- లార్జ్‌ని సెలెక్ట్ చేయగానే యాప్ నేమ్ అదృశ్యమవుతుంది. ఐకాన్ సైజ్ కూడా కొద్దిగా పెరుగుతుంది.

దీనికితోడు ఐకాన్‌లను డార్క్‌మోడ్‌లోకి మార్చుకోవచ్చు. లేదంటే అన్నింటినీ పింక్ కలర్‌లోకి చేంజ్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్‌పై ఈ ఫీచర్ ఇప్పటికే ఉంది. అదే ఇప్పుడు ఐఓఎస్‌లోకి వచ్చింది. ఐఫోన్ 11, 12 13, 14 ఫోన్లలో చాలా వాటికి ఈ ట్రిక్ పనిచేస్తుంది.

వాచ్ ఓఎస్ 11 అప్డేట్‌తో రింగ్‌టోన్‌లో మార్పు

యాపిల్ వాచీ



యాపిల్ వాచీలో ఇప్పటి వరకు డిఫాల్ట్‌గా ఒకే రింగ్‌టోన్ ఉంది. అయితే వాచ్‌ఓఎస్ 11 అప్డేట్‌తో వేర్వేరు రింగ్‌టోన్‌లను తీసుకునే అవకాశం యూజర్లకు కలుగుతుంది. '9టు5మేక్' రిపోర్ట్ ప్రకారం తాజా అప్డేట్‌తో రెండు ఒరిజినల్ సహా ఎనిమిది రింగ్‌టోన్‌లకు అవకాశం ఉంటుంది. పెబల్స్(సెల్యులర్ రింగ్‌టోన్), ఫోకస్, జింగిల్(ఒరిజినల్ రింగ్‌టోగోన్), నైట్‌ఫవాక్, ట్రాన్స్‌మిట్, ట్విర్ల్, వైండప్, వండర్ ఈ రింగ్‌టోన్స్‌లో ఉన్నాయి. వీటితో ఇంకో సదుపాయాన్ని కూడా కల్పిస్తోంది. అలెర్ట్స్, నోటిఫికేషన్స్, రిమైండర్స్ టెక్స్ మెసేజెస్, ఈమెయిల్స్ తదితరాలకు వేర్వేరుగా ఈ రింగ్‌టోన్స్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. రింగ్‌టోన్స్‌కు తోడు ఆటోమేటిక్ స్లీప్ ట్రాకింగ్‌ను కూడా తీసుకువస్తున్నట్టు సమాచారం. షాజమ్ కోసం స్మార్ట్ స్టాక్ విడ్జెట్‌ను తీసుకువస్తోంది. యాప్‌స్టోర్‌లో ఇది ఇప్పటికే యూజర్లకు అందుబాటులో ఉంది. మ్యూజిక్ సెర్చ్ వేగంగా జరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది.

ఏఐతో ఇంటరాక్షన్‌కు 'బటర్‌ఫ్లైస్'



మామూలు వ్యక్తులు, ఏఐ పర్సన్స్‌లతో ఇంటరాక్షన్‌కు వీలుగా బట్టర్‌ఫ్లైస్ యాప్ అందుబాటులోకి వచ్చింది. మనం కొన్ని డిస్క్రిప్షన్ గనక బట్టర్‌ఫ్లైస్‌కి ఇస్తే మిగిలిన పని అంతా అదే చేసుకుంటుంది. ఒక ప్రొఫైల్ ఇమేజ్, లైఫ్, కారెక్టర్ అన్నీ సెకెండ్ల వ్యవధిలో క్రియేట్ చేసుకుంటుంది. ఇది అవసరం అయితే తనంతగా తానే మాట్లాడటం, ప్రశ్నిస్తే సమాధానాలు ఇవ్వడం అన్నీ చేస్తుంది. గూగుల్ ప్లే అలాగే యాపిల్ యాప్ స్టోర్‌లో ఈ యాప్ ఉచితంగా లభిస్తోంది. ఇది జనరేటివ్ ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) - సెంట్రిక్ నెట్ వర్కింగ్ యాప్. స్మార్ట్‌ఫోన్లలో ఉపయోగించేందుకు వీలుగా రూపొందించారు. స్నాప్ ఇంక్‌లో ఒకప్పుడు ఇంజనీరింగ్ మేనేజర్‌గా పనిచేసిన వ్యక్తి దీన్ని అభివృద్ధిపర్చారు.

టెక్స్ డిస్క్రిప్షన్‌తో బట్టర్‌ఫ్లైస్ పర్సన్స్‌ని రూపొందించుకోవచ్చు. మెదడులో పుట్టిన ఆలోచనలకు అనుగుణంగా ఇమేజ్, అదేవిధంగా నిర్వర్తించాల్సిన పని ఉంటాయి. అంతే కాదు, ఆ ఏఐ పర్సన్స్ సందర్భానుసారం లేదంటే కామెంట్‌కు తగ్గట్టు స్వతంత్రంగా సమాధానమిస్తాయి. ఉదాహరణకు రైతు, తను చేసే పనిని ఊహించి యూజర్ రాసిందే తడవు, మూడు వరకు ఏఐ జనరేటెడ్ ఫొటోలకు తోడు హ్యాష్‌ట్యాగ్స్ వచ్చాయి. నెలల తరబడి బేటా టెస్టింగ్ జరిగిన తరవాత కొద్ది రోజుల క్రితం ఈ యాప్‌ను విడుదల చేశారు. ఇన్‌స్టాగ్రామ్ తరహా ఇంటర్‌ఫేస్ దీనికి ఉంది. హార్ట్ ఆకారంలో బటన్, బాణం మాదిరి షేర్ బటన్ ఉన్నాయి. కింద యూజర్లు సమాధానం ఇవ్వవచ్చు. బట్టర్‌ఫ్లైస్‌లో ఏఐ పర్సన్ కోసం ఏమి చేయాలంటే...

- హోమ్ పేజీ - ప్లస్ గుర్తుని టాప్ చేయాలి. అక్కడ ఆర్ట్ స్టయిల్(సెమి- రియలిస్టిక్/డ్రాయింగ్)ని ఎంపిక చేసుకోవాలి.
- యాప్‌లో ఏఐ ప్రొఫైల్ క్రియేషన్ కోసం డిస్క్రిప్షన్‌ను టైప్ చేయాలి. పేరు ఇవ్వాలి. యూనిక్ పర్సనాలిటీ కోసం గుణాలను జోడించాలి. బ్యాక్‌గ్రౌండ్ అంటే ఫ్యామిలీ, ఎడ్యుకేషన్, నిర్వర్తించాలని భావిస్తున్న పనిని కలపాలి.
- అప్పుడు యాప్ ప్రొఫైల్ ఉన్న ఫొటోల నుంచి సరైన ఇమేజ్‌ని వెతికే పనిని చేపడుతుంది. వర్ణించిన లక్షణాలకు అనుగుణంగా ఉన్న ఫొటోని తీసుకుని, యూజర్ కోరుకున్నవాటిని కలుపుతుంది.

అప్పుడు ఇక బట్టర్‌ఫ్లైస్ రూపొందించిన ఏఐ వ్యక్తి మెసేజ్‌లు, ఇమేజ్‌లను పోస్ట్ చేస్తూ ఉంటుంది. యూజర్లు కూడా మెసేజ్‌లను పోస్ట్ చేస్తే ఏఐ పర్సన్ స్పందిస్తూ ఉంటారు. సానుకూల దృక్పథంతో కూడిన ఆలోచనలకు తోడు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే సూచనలు కూడా ఇస్తుంది. ప్రస్తుతానికి ఈ యాప్ ఉచితంగానే అందుబాటులో ఉంది. అయితే సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను రూపొందించే పనిలో సదరు కంపెనీ ఉందని సమాచారం.

జీపీఎస్ సామర్థ్యాలతో 'బౌల్ట్' డాష్‌క్యామ్

బౌల్ట్ క్రూయిజ్ క్యామ్ ఎక్స్1 - జీపీఎస్ లాగింగ్ ఫీచర్‌తో అలాగే అది లేకుండా కూడా వచ్చింది. లాగింగ్ ఫీచర్‌తో వాహనం వేగం, లోకేషన్‌ను డ్రైవర్ ట్రాక్ చేయగలుగుతాడు. ఇండియాలో రెండు వేరియంట్లను విడుదల చేశారు. 108పీ కెమెరా, జీపీఎస్ లాగింగ్ సామర్థ్యాలు 360 డిగ్రీల రొటేటబుల్ డిజైన్ ఉన్నాయి. మొదటిదానిలో 2 - మెగా పిక్సల్ కెమెరా ఉంది. 170 డిగ్రీల వైడ్ యాంగిల్ లెన్స్ కారణంగా ఎక్కువ రోడ్డును కవర్ చేస్తుంది. దాంతో బ్లయిండ్ స్పాట్స్ నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. ముందే చెప్పినట్టు లోకేషన్, వేగాన్ని డ్రైవర్ ట్రాక్ చేయగలుగుతాడు. అలాగే దీన్ని స్మార్ట్‌ఫోన్‌తో కనెక్ట్ చేసుకోవచ్చు. సంబంధిత యాప్ గూగుల్ ప్లేస్టోర్, యాప్ స్టోర్‌లో ఉన్నాయి. సదరు యాప్ రికార్డింగ్స్‌కు వీలుగా ఉంటుంది. రికార్డ్ అయినా మీడియాను సర్దుబాటు చేసే ఆర్గనైజ్ గ్యాలరీ ఉంటుంది. వాహనంలో లైవ్ స్ట్రీమింగ్‌కు అవకాశం ఉంటుంది. ఇక రెండో దానిలో 360 డిగ్రీల రొటేషనల్ డిజైన్ ఉండటంలో డ్రైవర్ తన అవసరాలకు తగ్గట్టు అడ్జస్ట్ చేసుకోవచ్చు. ఇన్‌బిల్ట్ జి-సెన్సర్ కారణంగా ప్రమాదాలను డిటెక్ట్ చేస్తుంది. ఎమర్జెన్సీ వీడియో రికార్డింగ్ సదుపాయం కూడా ఉంది. డ్యాష్‌క్యామ్‌కు అల్యూమినియం చాసిస్‌తో మన్నిక బాగుంటుంది. జీపీఎస్‌తో ఉన్నది రూ.3,999 కాగా లేనిది రూ.2,999కే లభిస్తుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, బౌల్ట్ అధికారిక వెబ్‌సైట్ నుంచి వీటిని పొందవచ్చు.



Windows

వైఫై నుంచి అటాక్!

విండోస్ అప్డేట్‌ను వాయిదా వేస్తుంటే సరిగ్గా ఇప్పుడు ఆ పని అంటే ఇన్‌స్టాల్ చేసుకోవడం మంచిది. పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌తో కనెక్ట్ అయిన పీసీల్లో రిస్క్ ఉందన్న విషయాన్ని మైక్రోసాఫ్ట్ గమనించింది. అందుకనే విండోస్ 11, 10విండోస్‌ను ఇప్పుడు అప్డేట్ చేసుకోవడం మంచిది అంటోంది. 'ద రిజిస్టర్' దీన్ని ముందు గుర్తించింది. విమానాశ్రయాలు, కాఫీ షాపులు లేదంటే వర్క్‌ప్లేసుల్లో ముఖ్యంగా పబ్లిక్ వైఫైతో కనెక్ట్ అయ్యే డివైజుల్లో ఈ ప్రమాదం పొంచి ఉంది. యూజర్ ఇంటరాక్షన్ లేదంటే అథెంటికేషన్‌తో హ్యాకర్ రిమోట్ నుంచి డివైజ్‌ను స్వాధీనం చేసుకోగలుగుతారు. ఈ ప్రమాదాన్ని 'ఇంపార్టెంట్'గా మైక్రోసాఫ్ట్ పేరుపెట్టింది. భద్రతపరమైన రిస్క్‌ల్లో దీన్ని రెండో పెద్ద థ్రెట్‌గా పేర్కొంది. ప్యాచ్ విషయంలో ఆలస్యం చేస్తే ముప్పు తప్పదని హెచ్చరించింది.



స్క్రీన్‌షాట్ ప్రివ్యూ రీడిజైన్

ఆండ్రాయిడ్ 15 బేటా 3లో స్క్రీన్‌షాట్ ప్రెవ్యూని రీడిజైన్ చేశారు. పిక్సెల్‌కు చెందిన జనరేటివ్ ఏఐ స్టిక్కర్లపై పని జరుగుతున్నట్టు అనిపిస్తోంది. 'ఏపీకే ఇన్‌సైట్' పోస్టును డి కంపైల్ చేసినప్పుడు వివిధ కోడ్స్ కనిపించాయి. అది సరికొత్త ఫీచర్ రాబోతోందని తెలుపుతోంది. కొత్త పిల్ షేప్ కంటైనర్ అదీ సర్క్యులర్ షేర్, మేకప్ బటన్స్‌తో ఉంది. ఇది సైడ్ బై సైడ్ అప్రోచ్‌కు బదులుగా ఉండనుంది. ఇది తుది డిజైన్ కావచ్చు. బగ్ కూడా కావచ్చు. ఏదన్నది స్పష్టం కాలేదు. మొత్తానికి ప్రత్యేకించి పిక్సెల్ డివైజ్‌ల కోసం ఇది క్రియేటివ్ అసిస్టెంట్ యాప్/సర్వీసెస్‌ను రూపొందించనుంది. స్క్రీన్‌షాట్ ఎడిటింగ్ టూల్‌తో ఇంటిగ్రేట్ చేయడంతో రీమిక్స్‌డ్ స్టిక్కర్లు, ఇమేజ్‌లు జనరేట్ అవుతాయి. అప్పుడు మార్పు లేనట్టే. స్క్రీన్‌షాట్ ప్రెవ్యూకు తోడు సిస్టమ్ షేర్ షీట్, గూగుల్ ఫొటోస్, ఫైల్స్ యాప్‌లో ఇంటిగ్రేట్ అయింది. ఎఐకోర్ పర్మిషన్‌ను క్రియేటివ్ అసిస్టెంట్ తీసుకుంటుంది. ఆన్-డివైజ్ మోడల్‌ని ఉపయోగించి స్టిక్కర్లు జనరేట్ చేయవచ్చు. మొత్తానికి ఫన్‌కు అవకాశం కలుగుతుంది.





ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ • శనివారం 22 జూన్ 2024

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ అన్నట్లుగా రోజులు మారాయి. నిజానికి కోర్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ లేదు. ఇంజనీరింగ్ మూలపుటమ్మలుగా ప్రసిద్ధి చెందిన మూడింటిలో సివిల్ ఒకటి కాగా మెకానికల్, ఎలక్ట్రికల్ తతిమా రెండూ. ఇప్పుడు ఉన్న ఇంజనీరింగ్ బ్రాంచ్‌లన్నింటికీ మాతృకలు ఇవే. అయితే కంప్యూటర్ మోజులో ప్రపంచవ్యాప్తంగా చాన్నాళ్ళుగా సివిల్ ఇంజనీరింగ్‌కు ఆదరణ బాగా తగ్గింది. ఆ నేపథ్యంలో సదరు డిసిప్లిన్ అవసరాన్ని, అవకాశాలను **రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు** తార్కికంగా వివరించారు.



కోర్ బ్రాంచెస్‌లో బెస్ట్ సివిల్ ఇంజనీరింగ్

గత దశకం అంటే 2013 నుంచి సివిల్ ఇంజనీరింగ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ తగ్గుతోంది. 2022 వరకు ఈ డిసిప్లిన్‌లో చేరిన విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. అయితే గత సంవత్సరం నుంచి దీనికి పాపులారిటీ పెరుగుతోంది. సివిల్ ఇంజనీర్లకు రానున్న రోజుల్లో డిమాండ్ అధికం కానుందన్న లెక్కలే ఇందుకు ఆలంబన. గ్లోబల్ గణాంకాల ప్రకారం 2020 నుంచి 2027 వరకు సివిల్ ఇంజనీరింగ్ మార్కెట్ సైజ్ 5.4 శాతం చక్రీయ వార్షిక వృద్ధి రేటు(కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్) సాధించనుంది. భారత దేశంలో కూడా మౌలిక సదుపాయాలపై వ్యయం పెరుగుతోంది. టెక్నాలజీ, ఆటోమేషన్‌పై మౌలికరంగం ఆధారపడుతున్న నేపథ్యంలో అది మరిన్ని జాబ్స్ సృష్టికి దారితీస్తుంది. అంటే లేటెస్ట్ టెక్నాలజీలపై పట్టు ఉన్న విద్యార్థులకే ఆ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పవచ్చు. అలా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు భారత దేశ ఆర్థికవ్యవస్థ ఎదుగుదలలో కీలకపాత్ర పోషించనున్నారు. దరిమిలా అటు ప్రభుత్వ ఇటు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలపరంగా సివిల్ ఇంజనీర్లు అప్పర్ ఎడ్జ్‌లోనే ఉంటారని కూడా చెప్పవచ్చు. సివిల్ ఇంజనీరింగ్ తరవాత ఉద్యోగమే కాదు, సొంతంగా వెంచర్లను ప్రారంభించుకోవచ్చు. అలా కాదనుకుంటే వృత్తిపరంగా కొంత అనుభవం గడించిన తరవాతైనా సొంతంగా వ్యవహారాన్ని నడుపుకోవచ్చు.

భౌతికంగా లేదంటే సహజంగా ఏర్పాటైన కట్టడాల డిజైన్, నిర్మాణం, నిర్వహణ కలగలిసిన వృత్తిపరమైన డిసిప్లిన్ సివిల్ ఇంజనీరింగ్. పబ్లిక్ వర్క్స్ అంటే రహదారులు, వంతెనలు, కాల్వలు, డ్యామ్‌లు, ఎయిర్‌పోర్టులు, మురుగునీటి వ్యవస్థలు, పైప్‌లైన్‌లు, భవనాలకు సంబంధించిన స్ట్రక్చరల్ కాంపోనెంట్స్, రైల్వేలు, వాటర్ సప్లయ్, ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు, నివాస గృహాలు సహా భూమి, నీరు, పర్యావణం, సివిలైజెషన్ అలాగే సంబంధిత ప్రాసెసస్‌కు సంబంధించినవన్నీ సివిల్ ఇంజనీరింగ్‌లోకే వస్తాయి.

రిలేటెడ్ బ్రాంచ్‌లు

సివిల్(కన్‌స్ట్రక్షన్), సివిల్(పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ రూరల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్(కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ), సివిల్ ఇంజనీరింగ్(ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్), సివిల్ ఇంజనీరింగ్(పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్), సివిల్ ఇంజనీరింగ్(రూరల్ ఇంజనీరింగ్), సివిల్ టెక్నాలజీకి తోడు ప్లానింగ్, ఆర్కిటెక్చర్‌కు అందులోని ఉప విభాగాలకూ ఇదే మాతృక.

అవకాశాలు

ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో సివిల్ ఇంజనీర్లకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వ అంటే మున్సిపల్ కార్పొరేషన్స్, వాటర్ బోర్డులు, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ, న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, మెట్రోరైల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, రైల్వేస్, ఇరిగేషన్ అండ్ ఫ్లడ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్, డిఫెన్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఆర్ఐటీఈఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు, వివిధ సంస్థలకు చెందిన బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలు సహా ఈ జాబితాకు అంతు లేదు. అలాగే అసిస్టెంట్, ఇంజనీర్, అసిసెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ వంటి ఉద్యోగాలు ప్రభుత్వ సంస్థల్లో ఉంటాయి.



కౌన్సెలింగ్ గైడెన్స్

- అదే ప్రైవేట్ సెక్టర్‌లోకి వస్తే ట్రైనీ ఇంజనీర్‌తో మొదలై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరకు వేర్వేరు హోదాల్లో ఉద్యోగాలు ఉంటాయి. కన్‌స్ట్రక్షన్, డిజైన్ విభాగాల్లో సివిల్ ఇంజనీర్ సేవలు అవసరమవుతాయి. కాడ్(సీఏడీ) సాఫ్ట్‌వేర్‌పై పరిజ్ఞానానికి తోడు ఫైనైట్ ఎలిమెంట్ అనాల్సిస్ అలాగే అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకుంటే ప్రైవేటు సంస్థల్లో ఎదుగుదలకు ఢోకా ఉండదు. ఆరంభంలో రెండున్నర నుంచి మూడున్నర లక్షల రూపాయల వార్షిక ప్యాకేజ్ ఉంటుంది. ప్రైవేటు రంగంలో ముఖ్యంగా ఎల్ అండ్ టి మొదలుకుని టాటా ప్రాజెక్టు లిమిటెడ్, గ్యామన్ ఇండియా, గ్యామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రాజెక్ట్ లిమిటెడ్, ఒమెక్స్, సూపర్‌టెక్, షాపూర్‌జి అండ్ పల్లోంజి గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అశోకా బిల్డ్‌కాన్, బిఎల్ కాష్యప్ అండ్ సన్స్ లిమిటెడ్, కన్సాలిడేటెడ్ కన్‌స్ట్రక్షన్ కన్సార్టియం లిమిటెడ్, ఎస్సార్ గ్రూప్, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, జేపీ గ్రూప్, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, పుంజ్ లాయిడ్ తదితరాలు అతి పెద్ద కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో కొన్ని మాత్రమే.

అవసరం

సివిల్ ఇంజనీరింగ్ విషయంలో ప్రమోషన్ కార్యకలాపాలు చాలా అవసరం, కీలకం కూడా. కన్‌స్ట్రక్షన్ పరిశ్రమ, సంబంధిత సంస్థలు, వ్యవస్థలు అలాగే మీడియా ఇందుకు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. రెగ్యులేటరీ వ్యవస్థలు, ప్రొఫెషనల్ సంస్థలతో కూడా కలిసి పనిచేయాలి. పే ప్యాకేజ్‌తో మొదలుపెట్టి కరికులమ్‌లో ఇండస్ట్రీ నిర్దేశిత థియరటికల్ కాన్సెప్ట్స్, నైపుణ్యాల పెంపుపై దృష్టిసారించాలి. అన్నింటికీ మించి అటు ఇండస్ట్రీ ఇటు విద్యా సంస్థలు చేతులు కలపాలి. వివిధ ఇంజనీరింగ్ విభాగాల మధ్య విద్యా సంస్థల్లో సీట్లు - భర్తీ విషయంలోనూ శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలి. ఒక జాబ్‌కు ఉన్న డిమాండ్, వేకెన్సీలను దృష్టిలో పెట్టుకుని ఇదంతా జరిగితే ఇంజనీరింగ్ విద్యావ్యవస్థలో మంచి రోజులు రావడమే కాదు, ఫలితాలూ బాగుంటాయి. దేశ భవిష్యత్తుకు ఈ ప్రక్రియ చాలా అవసరం కూడా.


జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్ర ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్& నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్ఎల్ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.



ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.25,000
- **అడ్మిషన్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 31
- **ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** ఆగస్టు 1 నుంచి 7 వరకు
- **అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 20 నుంచి
- **ప్రోగ్రామ్‌ల ముగింపు:** 2025 ఫిబ్రవరి 19న
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

తెలంగాణ ఎస్టీ గురుకులాల్లో

నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్

హైదరాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ)- ఆపరేషన్ ఎమరాల్డ్(ఓపీఈఎం)లో భాగంగా నీట్ 2025కు హాజరయ్యే అభ్యర్థుల కోసం లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. నీట్ 2024లో సాధించిన మార్కుల ఆధారంగా పీవీటీజీ గురుకులాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బాలబాలికలకు క్యాంపస్‌లు వేరుగా ఉంటాయి. బోధన ఉచితం. భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. రాష్ట్రానికి చెందిన ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

గిరిజన గురుకులాలు-సీట్లు

- టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ(పీవీటీజీ-బాలురు) హయత్‌నగర్- 50+25 (ఎస్టీ+పీవీటీజీ)
- టీజీటీడబ్ల్యూఆర్‌జేసీ(పీవీటీజీ-బాలికలు) హయత్‌నగర్- 50+25 (ఎస్టీ+పీవీటీజీ)

అర్హత: అభ్యర్థులు నీట్ 2024 రాసి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు. గతంలో ఆపరేషన్ ఎమరాల్డ్(ఓపీఈఎం) కింద ఈ అవకాశాన్ని వినియోగించుకున్న వారు ప్రస్తుతం దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** నీట్-2024 స్కోర్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, ఇన్‌కం సర్టిఫికెట్, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్/పన్నెండోతరగతి సర్టిఫికెట్, నాలుగు ఫొటోలు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 27
- **సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్:** జూన్ 29
- **తరగతులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** tgtwgurukulam.telangana.gov.in

పీజేటీఎస్ఏయూలో యూజీ ఎన్ఆర్ఐ కోటా



హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్ బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. విదేశాల్లో నివశిస్తున్న ఎన్ఆర్ఐ అభ్యర్థులు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్(ఇంటర్/పన్నెండోతరగతి మార్కులు) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు రూ.9,53,450లకు డీడీ, రూ.46,550ల నగదుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ రాయితీలు లభించవు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

- **బీటెక్ స్పెషలైజేషన్‌లు:** ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్

బైపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ 10 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

ఎంపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) 3 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: బైపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు(ఇండియన్/విదేశీ బోర్డు) నుంచి బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే ఏదేని ఇండియన్/విదేశీ బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** రూ.5,000
- **చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

చిట్టీస్


తగ్గితే ఎందుకు మంచిది


ఒక ఊరిలో జగ్గు, రంగా అనే ఇద్దరు వ్యక్తులు ఉండేవారు వారిద్దరు మాటిమాటికీ కారణం లేకున్నా గొడవలు పడుతుండేవారు. ఎంతమంది మందలించినా, వారిద్దరూ తమ వైఖరి మార్చుకోలేదు. ఆ ఊరివారు ఊరు చివరనున్న చెరువులోనుంచి తాగడానికి నీళ్ల తెచ్చుకునే వారు.

ఆ చెరువుకు వెళ్లే దారి కొండ మీదుగా చాలా సన్నగా, ఇరుగ్గా ఉండేది. కొంచెం పక్కకు జరిగితే కొండ మీదినుండి పడిపోయే విధంగా ఉన్న ఆ దారిలో ఒక రోజు జగ్గు నీళ్ల కోసం వెళ్లాడు. అదే సమయానికి రంగా నీళ్ల తీసుకుని వెనక్కి వస్తూ ఇద్దరూ ఒకరికొకరు ఎదురు పడ్డారు కానీ ఎవరూ వెనక్కి వెళ్లడానికి ఇష్టపడలేదు. ఇద్దరూ పట్టు తప్పి, కొండమీద నుండి కిందపడి దెబ్బలు తగిలించుకున్నారు.

కొన్ని సార్లు నెగ్గడానికి కాకుండా తగ్గడానికి ఇష్టపడితేనే బాగుపడతాం.

7 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



జంతువులు ఎన్ని?



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 339

1	4		2		8			
		5	6					
				5	4			7
	6		4				5	3
	1	8				6	9	
3	5				9		8	
4			3	1				
					6	3		
			8		5		6	1

సుడోకు - 338 సమాధానం

8	4	7	6	1	3	2	9	5
6	9	1	5	2	8	3	7	4
2	3	5	7	9	4	8	6	1
4	5	3	1	8	7	9	2	6
1	7	6	9	5	2	4	3	8
9	2	8	3	4	6	5	1	7
5	6	9	8	3	1	7	4	2
7	8	2	4	6	9	1	5	3
3	1	4	2	7	5	6	8	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.